ఉంది: ఈయన "ఊదివచ్చినప్పుడు" అన్నదీ బాగుంది. శ్రీ ధన్‌సుఖ్‌లాల్ జైన్ నీటి రంగు చిత్రాలు రెండూ బాగున్నాయి. 'ఐదుగురు' అనేది ముచ్చటగా వుంది. శ్రీ త్రయంబక్ మెహతా చాకుతో, బ్లేడుతో రంగులు పూశారు. జడప్రకృతిని చిత్రించిన ఐదూ మనోహరంగా ఉన్నాయి. మాధురి ప్రకృతి చిత్రాలు ఐదు, శ్రీమతి సరళ నాలుగుచిత్రాలు ప్రకృతిని, నిత్య జీవితయాత్రను మనోహరంగా చిత్రించాయి. మిత్రులు, కళావిమర్శకులు శ్రీ బి. కోటయ్య అన్నట్లు — ఈ ఔత్సాహికుల మనస్సు వృత్తి కళాకారుల మనసువలె రాగరంజితం కాదు గనుక తమ భావాలను స్వేచ్ఛగా తెలిపి, కొత్తగా తీర్చిదిద్దడం నిజం.

**ఆచార్యగంటి**
**జోగి సోమయాజిగారు**

ఏడు దశాబ్దాలు పూర్తయినా ఎక్కడా నిరుత్సాహమన్నది కనిపించని ఆచార్యగంటిజోగి సోమయాజిగారిని చూసినప్పుడల్లా, ఆయన జీవిత రహస్యమేమిటో కనుక్కుందామనిపిస్తుంది. కాశీమజిలీ కథలలో చెబుతారు, ఎవడి ప్రాణమో దేనిలోనో వున్నట్లు, ఈ ఆచార్యుని ప్రాణం, జీవితం జిజ్ఞాసలోను, పరిశ్రమలోను ఉన్నాయనుకుంటాను అందుకనే ఆయన జ్ఞానానందంతో నిత్యయౌవనులుగా, వలత అన్నది లేని ముఖవర్చస్సుతో కనిపిస్తారు. ఏదో చర్చలో 'వివాహాలలోని అరివేణికుండలంటే ఏమిటండీ?' అని అడిగాను. 'ఇది నేనెప్పుడో చూసిపెట్టా.' అని నవ్వుతూ, ఐరిణీపూజే, ఐరేని, అరివేణిగా మారిందని చెప్పినప్పుడు ఆహా అనిపించింది. ఇలా ఎన్నో ఆయనతో చర్చలో తెలుసుకోవచ్చు. ఆయన విద్యారంగంలో ఉన్నత పదవులెన్నో నిర్వహించారు. ఈ సంవత్సరం ద్రవిడియన్ లింగ్విస్టిక్స్ తృతీయ మహాసభకు అధ్యక్షులై ద్రావిడభాషలలో ఇంకా ఎంతో జరుగవలసిన కృషిని సూచించి, చివర, 'భాష ద్వారా మనం జ్ఞానాన్ని ఆరాధిస్తాము భాషపై ప్రభుత సంపాదిద్దాము. రాగద్వేషాలు విడనాడి, సమైక్యభావం సాధిద్దాము' అన్న మాటలు నేడు ప్రతి రంగానికి ఉపదేశించ యోగ్యాలు. సోమయాజిగారు ఈ సంవత్సరమంతా ఈ సంఘానికి అధ్యక్షులుగా వుంటారు. ఈ ద్రవిడియన్ లింగ్విస్టిక్స్ తృతీయ మహాసభ జూన్ 20, 21లలో ధార్వాడలో జరిగింది. మైసూరు ముఖ్యమంత్రి శ్రీ దేవరాజ అరసు ప్రారంభోత్సవం జరిపారు. పలువురు ఆంధ్ర విద్వాంసులు పాల్గొన్నారు.

**ఉపశ్రుతి**

'ఏమైంది రాజకీయపు హడావుడి?' అనడిగాడు ఒక నాయకుణ్ణి ఒక జిజ్ఞాసువు.

'ఈ టికెట్లతో పందిళ్ళు, టికెట్లతో పెళ్ళి భోజనాలు అవుతాయా?' అన్నాడు నాయకుడు.

## 'డబ్బుకోసం అంతా పని చెయ్యవలసిందే'

'ప్రత్యేకమైన అర్హతలున్నవాళ్ళకి ఎడ్యుకేషన్‌లో కొంత 'కన్సెషన్' వుంటేనే బాగుంటుంది' అంటాడు పి.భారతరెడ్డి. మద్రాసు క్రిస్టియన్ కాలేజి హైస్కూలులో స్కూల్ ఫైనల్ తప్పాడు. ప్రయివేటుగా అక్టోబరు పరీక్షకు కూర్చోవాలనుకుంటున్నాడు.

భారతరెడ్డి పై మాటలు అనడానికి కారణం లేకపోలేదు. ఇంగ్లాండు వెళ్తున్న ఇండియన్ స్కూల్‌బోయ్స్ క్రికెట్ టీమ్‌కి అతను కెప్టెన్!

వికెట్ కీపింగ్‌లోను, బ్యాటింగ్‌లోనూ తమిళనాడులో అతన్ని మించిన వారులేరు. అందుకే ఈ సంవత్సరం ఉత్తమ క్రికెట్‌ఆటగాడుగా ఎన్నికయ్యాడు.

పద్దెనిమిదేళ్ళ ఆంధ్ర యువకుడికి ఇలాంటి అవకాశం రావడం గర్వించతగిన విషయం. కాని, భారతరెడ్డికి తెలుగు రాయడం, చదవడం రాదు. బాగా మాట్లాడతాడు. మదనపల్లి తాలూకా 'మల్లెల' అతని స్వంతవూరు.

తెలుగు సినిమాలు అసలు చూడ్లేదట. నటీనటుల పేర్లు మాత్రం విన్నాడు. చెప్పమంటే నాగేశ్వరరావు, ఎన్‌టీ రామారావు పేర్లు చెప్పాడు.

ఇంగ్లీషు సినిమాలు ఎక్కువగా చూస్తుంటాడు. స్టీవ్‌మేక్‌క్వీన్ అంటే ఇష్టం.

హిందీలో జయభాదురి, సంజీవ్‌కుమార్ అంటే అభిమానం. ఈమధ్యన వచ్చిన పిక్చర్లలో 'ఖిలోనా' నచ్చింది.

గర్ల్‌ఫ్రెండ్సున్నా, ఫాషన్స్ అన్నా మోజు లేదు. కాని, బెల్‌బాటమ్స్ వేస్తుంటాడు. (అతని దృష్టిలో బెల్‌బాటమ్స్ ఫాషన్ కాదు. మామూలు పాంటు కిందే లెక్క!)

పాలిటిక్స్ అంటే అభిరుచి లేదు. స్పోర్ట్స్ గురించిన పత్రికలు మాత్రమే చదువుతుంటాడు.

క్రికెట్ స్టార్స్ ఇంజనీర్, విశ్వనాథ్, వెంకటరాఘవన్ అంటే అభిమానం. ఆటలో ఎవరినీ గురుతుల్యులుగా భావించడు. తన ఆట తనది. కోచ్‌ని మాత్రం బాగా ఫాలో అవుతాడు.

స్విమ్మింగ్ అంటే ఇష్టం.



పి. భారతరెడ్డి.

'క్రికెట్ ఆటని వృత్తిగా తీసుకోవాలనే వుద్దేశం లేదు. డబ్బుకోసం అంతా పనిచెయ్యవలసిందే. ఏ పనిచేసినా క్రికెట్ నా ప్రాణం' అనే భారతరెడ్డి కామర్సు చదవాలని నిశ్చయించుకున్నాడు. చదువుకుని బిజినెస్ చెయ్యాలని అతని ఆశయం.

ఇంగ్లండులో ఆరువారాల పాటు వుండబోతున్న ఈ కుర్రవాడు టెస్ట్‌మాచెస్‌లో పాల్గొంటున్నాడు.

—సీతారాజు.

నిధులకోసం వేట-3

విక్ ఆల్‌డిన్

# పంట పొలాల్లో నిధి నిక్షేపాలు

బ్రిటన్‌లో ఒక నిధి కోసం ఏడు శతాబ్దాల నుంచి వేటాడుతున్నారు. జాన్ రాజు కిరీటం, మణులూ, వజ్రాలూ యావత్ ఆస్తీ 1216 లో ఒక ఇసుక తిన్నెలో కూరుకుపోయాయి — అని ఒక కథ.

లింకన్ షైయిర్ ప్రాంతంలో కోట్లకొద్దీ విలువయిన ఈ నిధి వున్నదని ప్రజల నమ్మిక.

1216 ఇంగ్లండులో సివిల్ వార్ సమయం. జాన్ రాజు మీద తిరుగుబాటు జరిగింది.

జాన్ రాజు సంవత్సరం నందర్భి లూటీ చెయ్యడం ఆరంభించాడు. వూరూ వాడా దోచుకుంటూ సంపాదించిన దాన్నంతా కూడా వెట్టుకు వెళ్ళుండేవాడు. అతని వెనక రెండుమైళ్ళ పొడవువరకూ వాహనాలమీద తరగని ఆస్తి వస్తుండేదట! ఇది ఫలానా చోటికి చేరవేసే బాధ్యతని ఒకరికి అప్పజెప్పాడు.

అతను ఈ ఆస్తితో నెమ్మదిగా నడుస్తూ అలా దక్షిణానికి ప్రయాణం సాగించాడు. క్రాస్‌కేస్‌కి లాంగ్‌సట్టన్‌కి మధ్య వున్న నాలుగన్నరమైళ్ళా ఇసుకతో నిండి వున్నది. (ఇప్పుడు దీన్ని 'వెనె' అంటున్నారు.)

ఇసుక మీద కనీ కనపడనట్టు ప్రవాహం కూడా వుండేది. అలా కొంత దూరం ఆ ప్రవాహంలో ప్రయాణించారు.

కొంతదూరం వెళ్ళాక ఇసుకలో కూరుకుపోవడం ఆరంభించారు. ఆ ప్రదేశం గురించి తెలిసినవాళ్ళు లేకపోవడంవల్ల వచ్చిన కష్టం అది.

గుర్రాలూ, సామగ్రి, వాహనాలూ అన్నీ ఇసుక లోపలికి వెళ్ళిపోవడం మొదలు పెట్టాయి. అనుచరులు వాటిని బయటికి తియ్యటానికి ప్రయత్నించి విఫలులయ్యారు.

అంతలో ప్రవాహం కూడా వుధృత మయింది. ఇసుకలోకి కూరుకుపోకుండా మిగిలివున్నవాళ్ళని ఈ ప్రవాహం ముంచేసింది.

ఇద్దరు ముగ్గురు మాత్రమే ప్రాణాలతో బయటపడి జాన్ రాజుకి ఈ వార్త నందించారు.

'జాన్ రాజుకి గుండె పగిలినంత పనయిపోయింది. అప్పటినుంచి అతని ఆరోగ్యం కూడా క్షీణించిపోయింది.'—అని ఒక చరిత్రకారుడు రాశాడు.

కొద్ది రోజుల తర్వాత జాన్ రాజు చచ్చిపోయాడు. అతని కిరీటం—ఇంకా ఇతరమైన ఆస్తినంతటినీ ఆ ఇసుక తిన్నెల్లోనే కప్పెట్టేశారు.

ఇప్పటికి అదంతా అక్కడే వుంది. ఈ సముద్ర భాగమంతా ఇప్పుడు మేట వేసేసింది. మూడు దశాబ్దాలుగా చాలా మార్పులు వచ్చాయి.

ఈ మేర అంతా ఇప్పుడు పంటలు పండిస్తున్నారు. నిధులమీద వెలసిన ఈ పొలాలు పుష్కలంగా పండుతున్నాయి!

ఇన్నివందల ఏళ్ళుగా దేశంలో అన్ని ప్రాంతాలనుంచి నిధులను వేటాడానికి వచ్చారు. సారవంతమైన ఈ భూమిని తవ్వి పోగులు పెట్టారు. ఎవరికీ అమూకి లభించలేదు.

19?3 లో హెర్బర్ట్ బాన్ అనే ఒక సంపన్నుడు ఒక ప్రయత్నం చేశాడు. చాలా ఆధునికమైన పరికరాలతో వేటాడేడు కాని ఫలితం లేకపోయింది

1956 లో జార్జ్‌టాగ్ అనే లండన్ రిసెర్చి ఇంజనీర్ మళ్ళీ ఒక బృహత్ ప్రయత్నం చేశాడు. విస్‌బెక్ ప్రాంతంలో సాగిన ఈ వేటలో కొంత ఫలితం దక్కింది.


ఇరవై అడుగుల లోతున కొన్ని ఆధారాలు దొరికాయి. ఆసేవనిగా తవ్వకం మొదలుపెట్టారు. ఆయాసం మాత్రమే మిగిలింది!

మూడేళ్ళ క్రితం నట్టింగ్‌హామ్ యూనివర్సిటీకి చెందిన కొందరు భూగర్భశాస్త్రజ్ఞులు తవ్వకం ఆరంభించారు. వారి ప్రయత్నం కొంత ఆశాజనకంగా సాగించింది. భూమి లోపలికి తవ్వుతున్నప్పుడు డ్రిల్లింగ్ మెషన్‌కి బంగారం, వెండి, రజను అంటుకుని కనిపించింది.

అదృష్టం పట్టటానికి ఇక ఆట్టే సమయం అక్కరలేదనుకున్నారు. ద్విగుణీకృతోత్సాహంతో ఇంకా ఇంకా తవ్వారు. చేతులు నొప్పి పుట్టాయి విసుగుతో ఇక తవ్వకం కట్టిపెట్టేశారు. నిధి గురించిన చిహ్నాలు ఏవీ కనిపించలేదు.

తూర్పు ఆంగ్లియాలోని పొలాల్లో ఇంకా ఈ నిధికోసం గాలిస్తున్నారు.

(ఇంకా వుంది)



శ్రీమతి అంజలీదేవి, శ్రీ ఆదినారాయణరావుగార్ల చలన చిత్ర జీవిత రజతోత్సవం జూలై 5వ తేదీన హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ సినీ గోయెర్స్ అసోసియేషన్ అధ్వర్యాన జరిగింది. ఆ సందర్భంగా సావనీర్‌ని ఆవిష్కరిస్తున్న శ్రీ అక్కినేని నాగేశ్వరరావుని చిత్రంలో చూడవచ్చు. (ఫోటో : శ్రీధర్)

# మొట్టమొదటి చిట్టచివరి ప్రేమలేఖ




శ్రీ మోహన్‌బాబుగారికి !

ఇది నేను వ్రాసే మొట్టమొదటి ప్రేమలేఖ !

ఎలా మొదలెట్టాలో తెలియడంలేదు. నా కలం వణుకుతోంది. నా చేయి జంకుతోంది. నా మనసు ఏదో విషాదం పలుకుతోంది. అయినా, మీకే ఉత్తరం రాయమని నా హృదయం వేధిస్తోంది!! అందుకే ఈ ప్రయత్నం

శ్రీకృష్ణగారూ మీరూ కలం స్నేహితులు కాకుండా ఉండిఉంటే, మీ యింటికి మమ్మల్నిద్దర్నీ ఆహ్వానించకుండా ఉంటే, బహుశా నేనింత కలవరానికి గురి అయివుండేదాన్ని కాదేమో?

మీయింట మేము గడిపినది మూడే మూడురోజులు. రేపే తిరిగి మేము మా వూరు వెళిపోతామని తలుచుకుంటేనే నా గుండె బరువెక్కుతోంది.

అతి సున్నితమైన మీ ప్రవర్తన, కళాత్మకమైన మీ జీవన విధానం, నన్నెంతో ఆకర్షించాయి. ఈ మూణ్ణాళ్ల పరిచయంలోనూ మీరు నన్నేగాక నా మనసునుకూడా చూడగలిగారనీ, నా అందాన్నేగాక, హృదయాన్నికూడా మెచ్చుకున్నారనీ తెలిశాక నాలో కలవరం మరీ ఎక్కువయింది

కళాభిమానులు అందంకోసం ఎప్పుడూ అన్వేషిస్తూనే ఉంటారు అత్యంత సుందరమైన వస్తువు కనిపించేదాకా వారి మనసుకు శాంతిగాని, వారి కళ్లకు విశ్రాంతిగాని లభ్యమవ్వవు!

మీరు శ్రీకృష్ణగారికి వ్రాసిన ఉత్తరాలు చదివినప్పుడల్లా మిమ్మల్ని ఎప్పుడు చూడగల్గుతానా అనుకునేదాన్ని! మిమ్మల్ని చూశాక, మీతో మాట్లాడే సమయం యెప్పుడు వస్తుందా అనిపించేది. మీతో మాట్లాడడం కూడా అయ్యాక... ఏదో తెలియని ఆవేదన నన్ను వేధిస్తోంది మీకేదో చెప్పాలని నా మనసు తహతహలాడుతోంది సమయం దొరకక, సభ్యత్వానికి వెరచి, మథనపడుతున్నాను.

—అబలను, ఇంతకంటే వ్రాయలేను.

—మీరు మగవారు! మనసువిప్పి మాట్లాడే ధైర్యమున్నవారు!! చొరవచేసి జీవితాన్ని ఏ బాటలోనైనా నడిపించే శక్తిగలవారు!!

ఇప్పుడు నిబ్బరంగా తపనన్ని నా మనో వేదనను అర్థం చేసుకుంటారనీ, మేము మా వూరు ప్రయాణమయ్యేలోగా నాపై మీకుగల అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తారని ఆశిస్తూ వేయికళ్ళతో మీ జాబుకై నిరీక్షి

—రాధిక

* * *

పున్నమి రాత్రి! పన్నెండు గంటలు

విస్మయం! మేడమీదనున్న రెండు గదులూ నిశ్శబ్దంగా నిదరపోతున్నాయి! ఉన్నట్టుండి ఒక గదితలుపు మెల్లిగా తెరచుకుంది. మేలి ముసుగులోని ఒక స్త్రీరూపం నిశ్శబ్దంగా బయటకువచ్చి, వెన్నెలవర్షంలో తడిసి, డాబా అవతలి గదివైపు చప్పుడుకాకుండా వెళ్ళింది. కిటికీవద్ద ఓ నిముషంసేపు నిలబడి, మరికొంతసేపటికి నిశ్శబ్దాన్ని అతి సున్నితంగా భంగపరుస్తూ గాజుల చప్పుడు చేసింది! గదిలో, గాఢనిద్రలోనున్న 'మోహన' రూపానికి నిద్రాభంగం అయిందని తెలుసుకుని, తన చేతిలోని కాగితం కిటికీగుండా పరుపుపైకి విసిరింది. ఆలస్యం చేయకుండా తిరిగి తాను వచ్చిన గదివైపు నడిచి, ఆ చీకటి గదిలోకి అంతర్థానమైంది!!

* * *

హౌరామెయిలు మద్రాస్ సెంట్రల్ నుంచి బయల్దేరి గంటన్నరపైగా అయింది. రెండేరెండు బెర్తులున్న మొదటితరగతి కంపార్టుమెంటులో పై బెర్తుమీద పడుకున్న శ్రీకృష్ణగారు నిద్రాదేవత ఒడిలోనికి ఒదిగారని నిర్ధారణ చేసుకున్న రాధిక, మెల్లిగా తన తలగడ క్రిందనున్న పుస్తకం బయటకు తీసింది. తన బెర్తుపైనుంచి లేచి, ఆయన్ని మరోసారి అటూ యిటూ కదిపిచూసి, ధైర్యంగా తన బెర్తుమీద కూర్చుంది. చేతిలో పుస్తకం పరుపుపైనవుంచి, ఆ పుస్తకం మధ్య పేజీలో దాచిన ఉత్తరాన్ని అతిసున్నితంగా బయటకు తీసింది. 'అబ్బ! ఎంత పెద్ద ఉత్తరం!' అని మనసులోనే మురిసిపోతూ, నిశ్శబ్దంగా దాంట్లో తలదూర్చింది—

—'శ్రీమతి రాధికా శ్రీకృష్ణగారికి!

మీరు రాసిందే తిరిగి రాస్తున్నాననుకోకండి, ఇది నా జీవితంలో నేను మొట్టమొదట వ్రాసే ప్రేమలేఖ!!

ముచ్చటగా గడిచిన ఈ మూడురోజుల్లోనూ కలవరానికి గురియైనది నేనే అనుకొన్నాను. మనసులోని మధన నాకే అనుకొన్నాను. అవ్యక్త ఆనందానుభూతి అనుభవించినది నన్నే అనుకొన్నాను. నా కలవరంలో, విషాదంలో, ఆనందంలో మీరు కూడా పాలుపంచుకున్నారని మీ లేఖద్వారా తెలుసుకున్నాక ఏదో చెప్పలేని తృప్తి, శాంతి లభించాయి! కాని, అదే మీ లేఖ

# మొట్టమొదటి...

నాలో అంతులేని అశాంతికి దారితీసింది!!

కావాలని నేను శ్రీకృష్ణగారివంటి వ్యక్తిని కలం స్నేహితుడిగా ఎంచుకున్నాను. మా యిద్దరి అభిరుచులకూ మనస్తత్వాలకూ ఎక్కడా సంబంధం లేదని తెలిసి కూడా, ఏదో సరదాగా ప్రయోగం చేసి వట్టుంటుందని ఆయన్ను నా కలం స్నేహితునిగా ఎంచుకున్నాను. ఈ ఎన్నిక నాదే! ఆయన తన సమ్మతిమాత్రం తెలియజేశారంతే!!'

నేనూ, నా భార్యా మిమ్మల్నిద్దర్నీ మొట్టమొదట, స్టేషనులో కలుసుకున్నప్పుడు, మిమ్మల్ని చూడగానే, ఎన్నాళ్ళనుండో ఊహాగానాల్లోనే సృష్టించుకున్న ఒక స్త్రీరూపం ప్రాణం పోసుకుని నా ముందర ప్రత్యక్షమయినట్లనిపించింది. ఏదో తెలియని ఆత్మీయత ఆ క్షణంలో మీమీద ఏర్పడింది. అంతకంటె ఎక్కువసేపు మీవైపు చూడ్డం బావుండదని శ్రీకృష్ణగారి వైపు నేను తిరిగానని మీరు గ్రహించినట్లు నాకు అనిపించింది. మాటికి నూరుపాళ్ళా పాశ్చాత్య నాగరికతా ప్రవాహానికి లొంగి పోయినట్లు కనిపించే శ్రీకృష్ణగారికీ, చూసీ చూడగానే భారతీయ సంస్కృతి కొట్టొచ్చినట్లు కనిపించే మీకు మధ్య దాంపత్యం గురించి ఏదో అనవసరపు ఆలోచనలు నా మెదడులో ఓ క్షణంపాటు మెదిలినా, మీ యిద్దర్నీ బాగా ఆదరించాలని, నేనూ, నా భార్య పడిన తాపత్రయంలో ఆ విషయాన్ని అంత పట్టించుకోలేక పోయాను ఆ సాయంత్రం వరకూ ఆమాటే మరచిపోయాను!! విజ్ఞానవేత్తలైన శ్రీకృష్ణగారి శాస్త్రజ్ఞానాన్ని మెచ్చుకుంటూనే ఉండిపోయాను!!

తన స్నేహితులెవర్నో కలుసుకు వస్తానని, శ్రీకృష్ణగారు అలా బయటకు వెళ్ళినప్పుడు, మీకు విందుభోజనం ఏర్పాటు చేసే తాపత్రయంలో నా పద్మ వంటింట్లో చప్పుళ్ళు చేస్తున్నప్పుడు, చేతిలో ఉన్న పుస్తకం మూసి, కళ్ళకు విశ్రాంతికోసమని, ఒక్కసారి పక్కింటివాళ్ళ పూలతోట వైపు చూశాను, మా డాబామీదనుంచి— గుబురుగా పెరిగిన బొగడ చెట్టుక్రింద పాసన్ రంగుచీర కట్టుకున్న మీరు పువ్వులేరుకుంటున్నారు. అదేరంగు లోలాకులు మీ చెవులకు ఎంతో ఆకర్షణ నిచ్చాయి. పక్కింటివాళ్ళ బుల్లిపాప, మీతో ఏవో తియ్యని కబుర్లు చెప్తోంది. ఆ పాప బుగ్గలు ఎర్రగా ఉన్నాయి. ఆ పాపంటే నాకెంతో ఇష్టం. మాయింటికి రావడానికి ఆపాప ఎందుకో ఇష్టపడదు. నాతో మాత్రం ఇనపకంచెకు అవతలనుండే మాట్లాడుతుంది. అది నా పద్మకు ఇష్టం ఉండదు. ఆ పాప, తన చిలకపలుకులతో నా పద్మను రెండు నిముషాల్లో ఉడికించేస్తుందని పద్మకు ఆ పాపంటే ఇష్టం లేదు!— కాని ఆపాప మీతో ఎంచక్కా మాట్లాడుతోంది. నవ్వుతూ ఆ పాపతో కబుర్లు చెప్తూనే మీరు బొగడ పువ్వులేరుతున్నారు. నేను మీ వైపే చాలాసేపు చూస్తూ ఉండిపోయానని, క్రిందనుంచి మీరు నావైపు చూసేదాకా నాకు తెలీలేదు! మీరు నన్ను చూడగానే నేను చాలా సిగ్గుపడిపోయాను కాని, జ్ఞాపకం తెచ్చుకోండి, మీరూ సిగ్గుపడ్డారు ధైర్యంచేసి ఒకరినొకరం మనం మరోసారి చూసుకున్నాం! ఏదో పిచ్చి అనుభూతి!! నేనక్కడుండడం అదోలా అనిపించింది. నేనేదో నేరం చేసినట్టు బాధపడ్డాను. వంటింట్లోకి దారితీశాను.

రెండు కుంపట్లమధ్య ఎర్రగా కందిన ముఖంతో కనిపించిన పద్మను చూస్తే జాలేసింది. పద్మపై జాలికంటె కూడా, మీకు పెట్టబోయే పదార్థాలు రుచిగా ఉండలేమోనన్న భయంతో పద్మ పక్కన నిలబడి ఓ పదినిముషాలు సాయం చేశాను. నేనూ పద్మా ఇంకా వంటింట్లో ఉండగానే పూల సజ్జతో మీరక్కడకు వచ్చారు, మాదీ దారంకోసం! పద్మ అలా బయటకు వెళ్ళినప్పుడు, 'వంటింటిపనులు కూడా చేతనవునన్నమాట!' అన్నారు మీరు, అదోలా నావైపు చూస్తూ!

'చేతనయినా, కాకపోయినా, పద్మతో పది నిముషాలు వంటింట్లో గడపడం నాకు సరదా!' అన్నాను నేను అప్రయత్నంగా!

మీరు చూసిన చూపుల్లో ఏదో భావం వ్యక్తపడింది. ఎప్పుడో చదివిన కథలు, ఎక్కడో విన్నగాథలు, గుర్తుకు వచ్చాయి. నాకు నిజంగానే మీమీద మొట్టమొదటిసారిగా— జాలేసింది!! కాని, ఆ రాత్రి

మీరూ, శ్రీ కృష్ణగారూ ఒక ప్రక్కన, నేనూ, నా పద్మ ఒక ప్రక్కనా కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ఓ గంట సేపు భోజనాలదగ్గర గడిపినప్పుడు నేను మీ దాంపత్యాన్ని అంతవరకూ కొంచెం పొరపాటుగా అర్థం చేసుకున్నాననే అనుకున్నాను.

ఆ మరునాడుదయం ఏడుగంటలకు మీ గదినుండి మీరు బయటకు వచ్చేశాక, శ్రీ కృష్ణగారికి ఏమికావాలో చూద్దామనీ, బాగా నిద్రపట్టిందో లేదో అడుగుదామనీ నేను ఆగదిలోకి వెళ్ళాను. అంతవరకూ మాయింట్లో లేని కొత్తవాసన ఆ గదిలో నాకు తెలియడం నాకు కొంచెం ఆశ్చర్యం కలిగించింది. శ్రీ కృష్ణగారికి కొంచెం మధువు పుచ్చుకునే అలవాటు ఉన్నట్టుందని అనుకుని, యన్ను లేపడానికి ఇష్టంలేక, గదిబయటకు వచ్చేస్తున్నా నాకు, వెలిగించిన అగరవత్తులతో గదివైపు వస్తున్న మీరు ఎదురయ్యారు! నన్ను అక్కడ చూడగానే మీరు చాలా తబ్బిబ్బయ్యారని నేను తెలుసుకోగలిగాను.

'ఆయన లేవడానికి ఇంకా కొంతటైం పడుతుందండి. పదిమిద్దాతేగాని లేవరు—' అంటూ గబగబా మీరు గదిలోకివెళ్ళి, తలుపు మూసేసుకున్నారు. క్షణంలో మీరనుభవించిన అవస్థ నేను తేలిగ్గా అర్థం చేసుకోగలిగాను. మీమీద రెండో సారిగా జాలేసింది!!


ఆ రాత్రి, అంటే నిన్నరాత్రి, భోజనాలయ్యాక, పదకొండు గంటలదాకా బీచిలో కబుర్లు చెప్పుకుని మనం నలుగురం మాయింటికి చేరుకున్నాం! డాబామీద వెన్నెలవర్షం కురుస్తోంది. నా వీణాగానం వినడానికి అంతకంటె మంచిసమయం లేదని, బలవంతంగా శ్రీ కృష్ణగారు వీణ తెచ్చి నా వళ్ళో ఉంచారు!

నా ఎదురుగా మీరు ముగ్గురూ కూర్చున్నారు. తెల్లటి నైలన్‌చీరలో మీరెంతో స్వచ్ఛంగా కనిపించారు చీరలో మధ్యమధ్య వున్న చిన్నిచిన్ని అద్దాలద్వారా చందమామ వెండికిరణాలు పరావర్తనం చెంది మీ రూపానికి ఓ ప్రత్యేకాకర్షణ నిస్తున్నాయి! వాతావరణం ఎంతో చల్లగా ఉంది. వయసులోవున్న మన నలుగురి మనసులూ సాధారణంగా కంటె ఓమెట్టు ఎక్కువ స్థాయిలో ఆనందం అనుభవిస్తున్నాయి. మీకు సంగీతమంటే మహాయిష్టమని శ్రీ కృష్ణగారు చెప్పారు మీకోసమే ఆయన నన్ను బలవంత పెట్టారన్నారు! నిజంగానే నాకు అదో కొత్త అనుభూతి కలిగించి! ఒక్కక్షణం నిశ్శబ్దంగా గడిచింది.

ఎంతో జాగ్రత్తగా 'హిందోళ'రాగం ఆలాపించాను. నాగతులను ఎన్నోసార్లు మీరు మెచ్చుకోగలిగారని తెలుసుకోగలిగాను. పద్మగాని, శ్రీ కృష్ణగారు కాని ఏమీ అడగకపోయినా, ధైర్యంచేసి మీరు రెండు మూడు రాగాలను గూర్చి అడిగారు. వాయించి చూపించాను. 'కుంతల వరాళి' 'సుపాద వినోదిని', ఈ రెండు రాగాలలో వాయించిన పాటలు మీకు బాగా నచ్చాయని పసిగట్టగలిగాను. 'నవరసకళ్యాణి'లో వాయించిన పాటలో రవ్వలు బాగా స్వీకరించగలిగారని నేనే తరువాత అనుకున్నాను. పద్మ, శ్రీ కృష్ణగారూ చాలా బాగుందని మాత్రం మెచ్చుకున్నారు. మీరుమాత్రం ప్రతిపాటలోని విశేషాలనీ కొంచెం వివరించి వాళ్ళిద్దరికీ చెప్పి, నా వాయిద్యంలో ప్రత్యేకత ఉందని మెచ్చుకున్నారు అది నాకొక గొప్ప అనుభూతి!!

నేనూ, పద్మ, మా గదికి వచ్చేశాం! ఎంతో అలసిపోయిన పద్మ చాలా త్వరలోనే నిద్రపోగలిగింది. కాని నాకుమాత్రం నిద్ర రాలేదు! చాలా సేపు మీరే జ్ఞాపకం వచ్చారు! నా వీణపాటగూర్చి మీరు చెప్పిన విషయాలు పదేపదే నా చెవుల్లో వినిపిస్తున్నాయి! లేచి కూర్చున్నాను. నా ఎదురుగా తన పరుపుమీద అమాయకంగా నిద్రపోతోంది, పద్మ! పక్కనేవున్న కిటికీ రంగుటద్దాలద్వారా చందమామ చల్లటి కిరణాలు పద్మ ముఖంపైపడి, ఆమె రూపాన్ని మరీ అమాయకంగా కనిపింపచేస్తున్నాయి! నేనేదో నేరం చేస్తున్నట్లనిపించింది. ఆ రెండురోజుల్లోనూ మీరు కల్పించిన ఆనందానుభూతి ఒకవైపు, అమాయకంగా, నిశ్చింతగా నిద్రిస్తున్న పద్మ మరోవైపు ... ఏదో తెలియని విషాదం!! ఏదో మధన!! అది అవ్యక్తం! పరుపుమీద ఎంత దొర్లినా నిద్దరాదు! ఆలోచనలు తెగవు! మరి కొంతసేపటికి మెత్తని గాజుల చప్పుడు — వెనువెంటనే మీ ఉత్తరం!! నాలో ఏదో భయం! ఆర్తి!! పద్మ కదులుతూందని తెలిసి మీ ఉత్తరం ఎదురుగానున్న షెల్ఫులో కుక్కేశాను. పద్మ కళ్ళు తెరిచి ఆశ్చర్యంగా నావేపు చూసింది.

'క్షమించండి, మీకింకా నిద్రపట్టలేదా, నే మొద్దులా నిద్దరోయాను!' అంటూ దగ్గరకొచ్చింది, ఎంతో తప్పుచేసినదానిలా తబ్బిబ్బవుతూ!! ఆమె కళ్ళు యెంతో అమాయకంగా నవ్వాయి. ఎక్కువసేపు చూడలేక, టేబుల్‌లైట్ ఆర్పేశాను. 'ఏం లేదు శ్రీ కృష్ణగారిచ్చిన పుస్తకం చదువుతూ కూర్చున్నా ఇంతసేపూ! ఇప్పుడే అనుకుంటున్నాను నిద్రపోదామని! ఒకే అలసటగా వుంది పడుకుంటాను' అంటూ



# మొట్టమొదటి...

అప్రయత్నంగా నా వరుపుమీద వాలేను. పద్మ నా కాళ్ళదగ్గర కూర్చుంది. ఎన్ని గంటలు సేవచేసిందో నా కెప్పుడు నిద్ర పట్టిందో తెలియదు-తిరిగి మెళకువ వచ్చే వరికి ఫలహారం, కాఫీతో ఎదురుగా నిల బడింది నవ్వుతూ!

ఈరోజే మీరు తిరిగి ప్రయాణమవు తున్నారని తలచుకుంటేనే అదోలాగయింది. మీరు మాయింట్లో అతిథుల్లా అనిపించ లేదు మీరికకా ఉంటే బావుణ్ణుని అని పించింది. ఏదో మీకు చెప్పాలని నేను కున్నాను. మీరు నాకేదో చెప్పడానికి అవకాశం కోసం ఎదురు చూస్తున్నట్లు నా కనిపిం చింది. వీలు పడిన ఒక్క క్షణకాలపు ఏకాం తంలో, మీతో నే నన్నాను—'మీరు బొగడ చెట్టుక్రింద పువ్వులేరుతూ ఆ బుల్లి పాపతో కబుర్లు చెప్తోంటే మీతో చూడ ముచ్చటగావుంది. మీరు గొప్ప కళారాధ కులు ! నిజమేనా ?'

వెంటనే మీరన్నారు— 'నా మాత్రం సన్మానం చేసుకున్నారు. ధన్యవాదాలు !' మీ ఉత్తరానికి బాబు ఏదంటూ మీకళ్లతో అడిగారు. సమాధానం ఇచ్చే అవకాశం లేక పోయింది !! అక్కడికి శ్రీ కృష్ణగారు వస్తూనే ఒకపుస్తకం నాచేతులో ఉంచుతూ అది ఆయన రాసిన పుస్తకమనీ, ఆరోజునే విడుదలయిందనీ గర్వంగా చెప్పారు. వెంటనే మీరిద్దరూ మీగదిలోకి వెళ్లిపోయారు.

అది ఎంతో విలువైన టెక్నికల్ పుస్తకం ఎన్నో గొప్ప విషయాలున్నాయి అందులో. కాని ఆ శాస్త్రజ్ఞానాన్ని అర్థం చేసుకొనే శక్తి నాలో లేదని నే సిగ్గు పడ్డాను అలాటి మహానుభావుడు నాకు స్నేహితుడని నాలో నేనే గర్వపడ్డాను. నా ఆనందం వ్యక్తపరుద్దామని నేరుగా మీ గదిలోకి వచ్చాను. మీవైపు చూస్తూ, 'శ్రీ కృష్ణగారు చాలా ఘటికులు! ఇలాంటి విలువైన పుస్తకం ఇంత చిన్నవయసులోనే రాయగలిగారంటే, ఆయన్ని దీలా మెచ్చు కోవాలో అర్థం కాకుండా వుంది !' అన్నాను.

తడుముకోకుండా అనేశారు మీరు— 'రోజుకు నాలుగు స్కాచ్ బాటిల్స్, ముగ్గురు స్త్రీలూ ఉంటే ఇలాంటివి వారానికి మూడు పుస్తకాలు రాసిపారేస్తారు! ఇప్పుడిద్దరే వున్నారు. రెండు బాటిల్సే ఖాళీ అవుతున్నాయి !'

మీరు అతిశయోక్తి పలుకుతున్నారని తెలిసిపోయింది. కొంచెం ఆశ్చర్యంగా, ఇబ్బందిగా ఆయనవైపు చూశాను. ఆయన మీ మాటలు చాలా తేలిగ్గా తీసుకున్నారు. మీ మాటలు ఆయ నకు అభినందనలుగా కనిపించాయనుకుం టాను. గర్వంగా మీసం సవరించుకుంటూ నావైపు చూశారు. నా కక్కడ ఉండ బుద్ధికాలేదు. ఏదో కారణంచెప్పి బయటకు వచ్చేశాను.

మీ దాంపత్యంలోని లోటు బాగా అర్థ మయింది. మీమీద మరోసారి జాలికల్గింది. ఏకాంతంగా నా గదిలో ఎన్నో పహార్లు చేశాను. మీకు జాబు వ్రాద్దామనిపించింది. కలం కాగితం తీశాను. వ్రాయకూడదనిపిం చింది. కలం మూసిపెట్టేశాను. బహుశా ఇవన్నీ మీకు రాయనక్కరలేదు. నేనిలా చేసివుంటానని మీరు తేలిగ్గా ఊహించుకో గలరు.

మీకు సమాధానం ఎలా రాయాలో ఎప్పుడు రాయాలో తెలియక సమయం చిక్కక మథనపడుతున్నానని మీరెలా ఊహించుకున్నారో తెలియదు? మీ తెలివికి నా జోహార్లు!! బజారులో ఏవో కొన వలసినవి వున్నాయంటూ నన్నూ, శ్రీ కృష్ణగారినీ కూడా బయల్దేరదీశారు! ఒంటరిగా నన్నింట్లో వదిలి మీరు ముగ్గురూ టాక్సీలో వెళ్ళిపోయారు!

ఒంటరితనం మనిషి మనసుకు మధన కలిగిస్తుందని మీకు తెలుసు! ఒంటరి తనంలోగాని మనిషి నిర్ణయాలు తీసుకో లేడని మీకు తెలుసు! మీ భావనాచాతుర్యాన్ని తలుచుకున్నకొద్దీ పొగడాలనిపిస్తోంది. నా సమాధానికి మీరంత విలువ ఇస్తారని తెలుసుకున్నాక ఈ జాబు వ్రాయకుండా ఉండలేకపోయాను!

నేనే నిర్ణయానికి వచ్చానో, మీకెలాటి సమాధానం ఇస్తానో బహుశా ఈపాటికి



మీరే ఊహించుకొని ఉంటారు! అయినా వ్యక్తపరచడం సాధర్మ్యం కనుక వ్రాస్తున్నాను.

ఒక్కవిషయం మాత్రం చెప్పాలి! మీరు మంచివారు గనుక నా జీవన విధానంలోని కొలతను తేలిగ్గా అర్థం చేసుకున్నారు. నా కళారాధనలో నాకు అండగా నిలిచేశక్తి నావద్మకు లేదని ఇట్టే పసిగట్టేశారు. అయితే, మీరు నాకళా జీవనాన్ని చూడ గలిగారుగాని, సాంఘిక వ్యవస్థలో నా స్థానాన్ని చూడలేకపోయారు. ఇది మీలోని మనసు—వ్యవధి తక్కువ! అదే కారణం!

నా జీవితంలో భూతకాలమంతా ఒక పీడకల! దిక్కులేని లేతవయసు! కళమీద వల్లమాలిన అభిమానం! సంగీతంపై తపన! 'మింగడానికి మెతుకులు లేకపోయినా మీసానికి సంపెంగనూనె' అనుకునే పరిస్థితి! గుడ్డిలో మెల్ల అన్నట్టు జీవితంలో ఒక చిన్నమలుపు ఒక మహానుభావుని దయాదాక్షిణ్యాల ప్రభావంగా అటు డిగ్రీ చదువూ, ఇటు ఆయనవద్దనే శిష్యరికం పుచ్చుకొని సంగీతభ్యాసం చేయడం! ఆయన కడసారి కోరికగా, ఆయనకు చెల్లించాల్సిన గురుదక్షిణ రూపంగా, ఆయన ఏకైక పుత్రిక పద్మతో వివాహం, నాజీవిత భాగస్వామిని ఎన్నుకొనే అవకాశం నాకు లేక పోవడం—ఇంతకంటె వివరంగా చెప్పలేను. క్షమించాలి!

మీవంటి కళాపిపాసులతో మధురమైన క్షణాలెన్నో గడపాలనే ఆశల దొంతర లొకవైపూ, భారతీయ సాంప్రదాయానికి కట్టుబడి వుండాలనీ గురువుమాట జవదాట కూడదనీ చెప్పేనీతుల పరంపర లొకవైపూ నా మనోరంగంపై యుద్ధం సలుపుతున్నాయి. ఏక్షణంలో ఏది నెగ్గుతుందో నేనే చెప్పలేనేమో! ఈ ఉత్తరం పూర్తి చేసేలోగా నా హృదయం ఎటువైపు మొగ్గుతుందో కూడా నిర్ణయించలేని బలహీనత వన్నావహిస్తోంది.

సంస్కృతికి నీతి — ఈ పేర్లతో కళా జీవితంలో నేరాకష్టుతుందుకునే అవకాశాలు చంపుకోవద్దని ఒకమనసూ, కళాభిమానం పేరుతో రామాయణ నీతిని కించపరచ వద్దని మరో మనసూ నన్ను వేదిస్తున్నాయి. ఇది నిజమైన పరీక్ష! ఇటువంటి పరీక్షకు బహుశా నావంటి వాళ్లెందరో అనుక్షణం గురియౌతుంటారని నేనూహించుకోవడం తప్పుకాదేమో! అటువంటి వారిలో, ఒక వైపు మీరు—మరోవైపు నేను!

అందరూ ఇదే నిర్ణయానికి రావాలని నేననుగాని, నేనుమాత్రం ఒక నిర్ణయానికి వచ్చాను. మరోసారి ఆలోచించండి! కళాత్మకమైన ఒక వస్తువును దూరంగా ఉంచి నప్పుడే దానివిలువ ఎక్కువగా కనిపిస్తుంది. కొత్తరాగం వినగానే దాన్ని నేర్చుకోవాలని మనసు మథనపడుతుంది. నేర్చుకోడం అయ్యాక దాని సాధనలో కొన్నాళ్లు మహానందాన్ని అనుభవించవచ్చు. కాని అదే బాగా అలవాటయ్యాక, మరో విలువైన రాగంమీదకు మనసు తప్పకుండా మళ్ళుతుంది. ఇది కళారాధకుల అంతులేని దీనికి అంతులేదు! తృప్తి అనేది [illegible]

అందుకే అనిపిస్తోంది. [illegible] మన జీవితాలను కళారాధన పేరుతో [illegible] కళంకం చేయడం తగని పని అని!

రసాభాసానికి నన్ను క్షమించండి!


మనిద్దరిమధ్యా మనుగాలాలు [illegible] మన ధర్మాలకు విరుద్ధం! పిచ్చి ఊహాలకు అంతు కనుపించదు! మనం ఒకరినొకరు మరచిపోదాం!

నన్ను నమ్మండి!


ఇది నేను వ్రాసే చిట్టచివరి ప్రేమలేఖ!

—మీ శ్రేయోభిలాషి, మోహన్!

* * *



చేతిలోని కాగితాలు జాగ్రత్తగా [illegible] పెట్టింది రాధిక. భారంగా ఒకసారి నాలుగువంక చూసింది. బెర్తుమీదనుంచి లేచి తలుపుతెరచి బయటకు వచ్చింది. రైలు అతివేగంగా పరుగెడుతోంది. [illegible] ఉత్తరంవైపు మరోసారి మమకారంగా చూసింది. రైలు హోరు ఒకే దిశగా కల్గిస్తోంది. అవతల శ్రీ కృష్ణగారు లేచినట్లు భావన, భయం! గబగబా చేతిలోని కాగితాలు ముక్కలు ముక్కలుగా చించింది. గాలిహోరుకు కొన్ని ముక్కలు చేయిజారి ఎగిరి పమిటచెంగును తాకుతున్నాయి! కోపంగా వాటినికూడా తీసి ముక్కలన్నింటినీ బయటకు విసిరేసింది. గాలిలో ఎగురుతున్న కాగితపు ముక్కలు వెన్నెల వెలుతురులో మసకగా కనిపించాయి. తన మనసులోని ఆలోచనలు కూడా అలాగే చెల్లాచెదురుగా [illegible] కాని ఆమెకు తెలుసు—రైలు పూర్తిగా వెళ్లగానే ఆ కాగితపు ముక్కలు [illegible] మీద భద్రంగా వాలతాయని [illegible] ఇంకా తెలుసు—తన పిచ్చి ఆలోచనలు కూడా త్వరలోనే స్థిరపడతాయని, మోహన్ తీసుకున్న నిర్ణయమే తనూ [illegible] దందని ॥



సీరియల్

# చరితార్థులు

ఎస్. ఎస్. ప్రసూన

### జరిగిన కథ

రమణమూర్తి, శేఖర్ బాల్య స్నేహితులు. రమణమూర్తి ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. శేఖర్ స్టేట్స్‌కి వెళ్ళి భార్య సుమతితో సహా ఇండియాకు వచ్చి రమణమూర్తిని చూడ్డానికి వచ్చాడు. రమణమూర్తి భార్య ఇందిర, సుమతి ఇద్దరూ ప్రాణ స్నేహితులు. శేఖర్‌కి పేకాటపిచ్చి. రమణమూర్తికి అలవాటు చేశాడు. శేఖర్ రిజైన్‌చేసి హైదరాబాదు మారడానికి ప్రయత్నాలు చేశాడు. మామగారు పోవడంతో ఆవూరు బయల్దేరింది ఇందిర పిల్లలతో. తండ్రి రమణ పేరుతో వీలునామా రాయడం చాలమందికి కష్టం కలిగించింది. ఆస్తి వ్యవహారాలని లాయర్‌గారికి అప్పగించి శిల్పా శిరీష్‌ని తీసుకుని తిరిగి వచ్చాడు రమణ. శేఖర్, సుమతి వెళిపోయాక ఇందిర అదోలా అయిపోయింది. రాజారావుని ప్రేమించింది శిరి, ఇందిర ఆమెకి వదిన. వదినతో రాజారావు విషయం చెప్పాలని కూర్చున్నది శిరికి ఇందిర జ్ఞానోదయం చేసింది.

## 11

రిజల్ట్సు వచ్చాయి. శిరి, మణి సెకండు క్లాస్‌లో పాసైనారు.

వేసవి శెలవుల అనంతరం తిరిగి స్కూళ్ళు—కాలేజీలు తెరిచారు. పిల్లలంతా కొత్త క్లాసుల్లోకి ప్రమోట్ అయి స్కూళ్ళల్లో చేరారు. మళ్ళీ శిరికి వంటరితనం మొదలైంది. ఆ వేసవిలోనే మణికి పెండ్లి జరిగి అత్తవారింటికి వెళ్ళి పోయింది.

ఒకనాటి రాత్రి భోజనాలయ్యాక—రమణా—ఇందిరా—తాంబూలాలు వేసుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు—మణి పెళ్ళి ప్రస్తావన రావటంతో వారి సంభాషణ పెళ్ళిళ్ళవేపు మళ్ళింది.

'ఇందూ! నాదో ఆలోచన, మన శిరిని కూడా ఒకింటిదాన్ని చేస్తే మన బాధ్యత తీరుతుంది. మా ఆఫీసులో నాతో పనిచేసే పరమేశంగారి తమ్ముడున్నాడు. మొన్ననే ఏం. కాం. పాసైనాడు. ఇంకా వుద్యోగంలో కుదురుకోలేదనుకో—త్వరలోనే రావచ్చును.—కుర్రాడు మెరికలాటివాడు. మంచి పర్సనాలిటీ వుంది. ఇంక వంశాన్ని గురించి ఆలోచించే పనిలేదు. నాకు తెల్సును గా! మన శిరికి ఈడు—జోడు బావుంటుంది ఏమంటావు?' అన్నాడు.

'బావున్నది! మన శిరిని అడిగి చూస్తాను' అన్నది ఇందిర.

'ముందు నీ అభిప్రాయం చెప్పవోయ్'

'నా అభిప్రాయం అంటూ వేరే ఏముంటుంది? మీకు నచ్చితే—నాకూ నచ్చినట్లే—ముందు అమ్మాయికి నచ్చటంగదా ముఖ్యం'

'అవుననుకో రేపే శిరిని అడిగిచూడు. జాప్యంచేస్తే మంచి సంబంధం చేజారి పోవచ్చు.'

'సరే—సరే' అంటూ పాప మంచంమీద మెసలటంతో లేచి వెళ్ళింది ఇందిర.

మర్నాడు మధ్యాహ్నం మూడుగంటల వేళ శిరి రేడియోదగ్గిర కూర్చుని సిలోన్ వింటోంది.

ఇందిర రెండు కప్పుల్లో కాఫీతెచ్చి ఒకటి శిరికి ఇచ్చి తనొకటి తీసుకుని పక్కనే కూర్చున్నది. కాఫీత్రాగి బల్లమీద పెట్టిన కప్పులు తీసుకుని శిరి లేవబోతూంటే—

'వుండు శిరీ నీతో కొంచెం మాట్లాడాలి' చేయిపట్టి కూచోపెట్టింది. ఏమిటన్నట్లు చూసింది శిరి.

'నేను అడిగేదానికి, నీవు సూటిగా జవాబు చెప్పాలి—మేము ఏమనుకుంటామో అని నీలో నీవు బాధపడకు సుమా—నీ నిర్ణయం—జవాబు ఏదైనా నాకు సమ్మతమే' అంటూ రాత్రి రమణ చెప్పిన విషయం మెల్లిగా చెప్పసాగింది ఇందిర.

మౌనంగా విన్న శిరి కళ్ళనిండా నీరు నింపుకుని.

'వదినా నాకు ఇప్పుడు పెళ్ళేమిటి? రాజా చేసిన గాయం మనస్సంతా పచ్చి పుండులాగా సలపరిస్తోంది. ఇంతలో ఈ బాధ మరువలేను నాకు కొంత టైము ఇవ్వండి వదినా ఇప్పట్లో ఇలాటి ఆలోచనలేమీ వద్దు—నువ్వే అన్నయ్యకు నచ్చచెప్పు—మీ మాట కాదన్నానని కోపగించక క్షమించు' దీనంగా శిరి అంటూంటే—ఇందిర మనస్సు జాలితో నిండిపోయింది.

'పోనీలే శిరీ—నువ్వింతలా బాధపడకు. మీ అన్నయ్యకు నేను చెప్తానులే—మనస్సు సరుదుకోవాలిగాని — ఎన్నాళ్ళిలా కుమిలి పోతూ కూచుంటావు? ఏదో చిన్నసలహా—వింటావా?'

'సలహాకాదు వదినా నువ్వు శాసించ గలదానివి — నీ మాటకు ఎదురు చెప్పను. ఈ ఒక్క విషయంతప్ప ఇంక ఏదైనాసరే'

'ఇలా నువ్వు ఏ వ్యాపకములేకుండా గదిలో ముడుచుకు కూచుంటే—నీ మనస్సు ముడుచుకుపోయే వుంటుంది—నీవు విశాల మనిషివి అవాలంటే—చేతినిండా తీరిక లేని పని కావాలి, మనస్సుని వికసింపజేసే

ఆలోచన్ను కావాలి. శిరీ నీవు మెడిసిన్ చదువు — ఇప్పుడు నీకు అదే సరైనది.'

'మెడిసినా?' విప్పారిన కళ్ళతో ఇందిర వంక చూస్తూ అన్నది శిరి.

'అవును మెడిసినే, ఎందుకంత ఆశ్చర్య పోతావు? అదేం చేయలేని చేయరాని పని కాదుగదా!'

'అదికాదు మెడిసినంటే ఎంతో వ్యయ భారంతో కూడిన చదువు వద్దు వదినా...' ఆ మొహమాటం పూర్తి కాకుండానే ఇందిర అడ్డుకున్నది.

'అలాంటిమాట అనవద్దని ఇదివరకోసారి చెప్పేము నేనూ మీ అన్నయ్యా కూడాను— మళ్ళీ అదే అంటే నాకోపం వస్తుంది. ఇంటపుట్టిన ఆడబడుచువి— నీకు చెయ్యటం వ్యయభారం అనుకునేంత బీదస్థితిలో లేము. అంత స్వార్థపరులమూ కాము. అసలు అదంతా మేము చూసుకుంటాములే— నీ కిష్టమైతే ముఖ్యం— నా మాటవిని హాయిగా చదువుకో'

ఇందిరవంక చూస్తూ 'కృతజ్ఞురాల్ని వదినా' అన్న శిరి చెక్కిళ్ళను ఆప్యాయంగా నిమిరింది ఇందిర.

శిరి అభిప్రాయం— ఇందిర మాటనిచ్చిన రమణకు కూడా అదే మంచిదనిపించింది— పోతే కొన్నాళ్ళు చదువు వ్యాపకంవుంటే— మనస్సుకి తగిలినగాయం మానే అవకాశం వుండవచ్చు. ఏమంత వయస్సు మీరిందని నిర్బంధించి పెళ్లి చేయటం అని— శిరికి మెడిసిన్‌లో సీటుకొరకు ప్రయత్నించ సాగేడు. అయిదువేలు డొనేషను కట్టి చివరి కెలాగో సీటు సంపాదించాడు రమణ. శిరికి కాలేజీజీవితం మొదలైంది.

* * *

అదొక పెద్ద హాలు. హాలుకు ఇరువైపులా బాడీస్‌ను వెల్లకిలా పడుండ బెట్టేరు. గబుక్కున చూస్తే— మనిషి వెల్లకిలా చేతులు కాళ్ళు చాచుకుని పడున్నట్లే వుంటుంది.

శిరి [illegible] ముందుగా [illegible] దెబ్బ తీసుకున్న తరువాత ఆ హాలులోకి తీసుకువెళ్ళేడు డిమాన్‌స్ట్రేటర్. అనాటమీ థియేటర్‌లో అడుగు పెట్టగానే— శిరికి వొళ్ళు జలదరించింది. భయంతో గుండె వేగంగా కొట్టుకోసాగింది. శిరి మాదిరిగానే మరికొందరుకూడా భయంగా— బితుకు— బితుకు మంటూ అడుగులో అడుగు



# చరితార్థులు

[illegible]గా హాల్లోకి వచ్చారు. మరికొందరేమో — వీరిని చూసి హేళనచేస్తూ — తమకేమీ భయం లేదన్నట్లు ధైర్యంగా ముందుకు నడిచారు. ఆ హాల్లో దాదాపు వంద బాడీస్ దాకావున్నాయి. వాటిమధ్యగా వైట్ ఆప్రాన్స్ తొడుక్కున్న అమ్మాయిలూ— అబ్బాయిలు తిరుగాడుతున్నారు. కొందరి చేతుల్లో ఫోర్ సెప్స్-స్కాల్ పెల్ వున్నాయి. ఒక్కో బాడీ దగ్గిరా ముగ్గురు స్టూడెంట్సు నిలబడివున్నారు. వారు సెకండియర్ స్టూడెంట్సు—పాట్టకి అటూ ఇటూ నలుగురు స్టూడెంట్సు నిలబడ్డారు అందులో ఒకరు డిసెక్టుచేస్తూ వుంటే, ఇంకొకరు చదువుతూ అందులోని భాగాలను పరిశీలిస్తున్నారు. శిరి క్లాసువారిని గ్రూపులుగా విభజించారు. గ్రూపుకు ముగ్గురున్నారు. వారికి కాళ్ళు చేతులు భాగాలు పరిశీలించను వచ్చాయి. శిరి గ్రూపువారికి కుడిచెయ్యి వచ్చింది. ఒక బాడీ దగ్గిర శిరి గ్రూపుతో కలిసి వున్న దు మంది—ఫస్టియర్ స్టూడెంట్సు — ఆరుగురు సెకండియర్ స్టూడెంట్సువున్నారు. వీరుకాక రిఫరీ స్టూడెంట్సుకూడా కొందరున్నారు. రిఫరీ స్టూడెంట్సు వారి కిష్టమైన భాగాలు కోసి చదువుకున్నారు. బ్రెయిన్ చదవాలనివున్నవారు కపాలాన్ని ఓపెన్ చేస్తున్నారు. కొంతమంది బ్రెయిన్ ని ట్రేలోపెట్టి చదువుతున్నారు. ఆ వాతావరణం కొత్తవారికి జుగుప్సాకరంగా—భీతిగొల్పేదిగా వుంటుంది. శిరీష్ గాజ్ తెల్ల కోటువేసుకొని రెండుచేతుల్లో ఫోర్ సెప్స్—స్కాల్ పెల్ పట్టుకుని అరచేతిలో ఇన్సిజన్ ఇవ్వటానికి ఆ చేతిని పట్టుకున్నది. మంచుగడ్డలాగా అతి చల్లగావున్న ఆ చేతి స్పర్శకు ఒళ్ళు జల్లుమని—కెవ్వున కేకవేసి చేతిలో వస్తువులు వదిలేసింది భయంగా. అందరూ శిరివేపు చూసి చిన్నగా నవ్వి— మళ్ళీ తమ పనిలో మునిగిపోయారు. కొత్తగా చేరినవాళ్ళు ఆ హాల్లో ఇలా చెదిరి గొడవ చేయటం మామూలే.


'నాకు చాతకాదు. నేను చదవలేను నీవు 'సౌ' చేయి' అని తన క్లాస్ మేట్ సుమిత్ర చేతికి బుక్సు తీసుకున్నది శిరి. కానీ, సుమిత్ర ఇన్సిజన్ చేసి పార్ట్సు సెపరేట్ చేస్తుంటే చూడాలన్నా భయం వేసింది. తొమ్మిది గంటలనుండి — పది గంటలవరకు మూర్ఛపోద నిలబడివుండి వున్నది. మధ్య మధ్యలో ఈ రిఫరీ స్టూడెంట్సు ఒకరు. వాళ్ళే పెద్ద అనుభవజ్ఞుల్లైనట్లువచ్చి. 'ఇలా కాదు—అలా—' అని వుచిత సలహాలు ఇవ్వటము. కొంతమంది అస్థిపంజరము పట్టుకొని పరీక్షిస్తూ దగ్గిరగా తెచ్చి చూపటము—మరి కొందరు బోన్స్ పట్టుకుని చదవటము. అంతా వినుగ్గా—జుగుప్సగా కంపరంగా వున్నది. పది అవగానే గబగబా చేతులు కడుక్కొని—కోటు విప్పేసి చేతోపట్టుకున్నది శిరి.

ఇంటికి వెళ్ళి భోజనం దగ్గిర కూర్చువున్నపుడు కూడా థియేటర్ వాసన— జుగుప్సాకరమైన ఆ దృశ్యాలు — కళ్ళముందు కదులుతూ—అన్నం కలుపుకుంటూంటే—ఆ బాడీస్ గుర్తుకు వచ్చి— కడుపులో దేవినట్టయి—చేయి కడుక్కొని లేచిపోయింది శిరి.

మధ్యాహ్నం రెండుగంటలకు కాలేజీకి వచ్చింది తిరిగి. స్టూడెంట్సు క్లాసుకు లేనందువల్ల అనాటమీ స్పెసిమెన్ రూమ్ కు వెళ్ళారు. అందులో మానవ శరీరాంగములను భాగాలుచేసి జార్లో వుంచారు. సెకండియర్, రిఫరీ స్టూడెంట్సు కూర్చుని ఎక్స దగ్గిర పెట్టుకుని—శరీర భాగాలను—మాంస కండరాలను—రక్తనసాలని—నెర్వ్ సప్లైని—వాటి యాక్షన్ని. పరిశీలించి — దీక్షగా చదువుతున్నారు. శిరీష్ మనస్సున అనేకమైన వూహాలు అల్లి—బిల్లిగా అల్లుకు పోతున్నాయి. ఈ వాతావరణాన్ని క్షణంకూడా భరించలేనట్లు—చీకాకుగా కళ్ళుచిట్లించి, వారందరివంకా నిర్లిప్తంగా చూసి దూరంగా హాండ్ స్పెసిమన్ దగ్గిర కూర్చున్నది శిరీష్.

అనాటమీ ఆమెమనస్సు బొత్తిగా వశంతప్పి పిలువుతూంది. ఈ వాతావరణం, ఈ చదువు —అసహ్యమనిపించేదృశ్యాలు ఆమెకు బొత్తిగా సరిపడలేదు అసలు టెక్స్ట్—తెరిచినా— మూసినా రాజా రూపమే కనిపిస్తుంటే— మనస్సు నిలువరించుకోలేక అశక్తురాలై పోతోంది. బాయ్ ఫ్రెండ్ తో ఇలా కలిసి తిరగటం ఆమెకు అసలు నచ్చలేదు ఇలా తనకి సరిపడని చదువు చదివేకన్నా—ఇంటి దగ్గిర ఒంటరిగాగడపటమే బావున్నది. మగవాళ్ళని చూస్తేనే అసహ్యంగా వున్నది రాజా చేసిన వంచన గుర్తుకువచ్చి—వాళ్ళ వునికినే సహించలేక మనస్సు భగ్గుమంటోంది. వూ— హూ... లాభంలేదు. ఎందుకో తను ఇమడలేదు. రాజాని మరిచిపోతేగాని తను చదువులో నిలదొక్కుకోలేదు. అది ఇంతలో జరిగేపని కాదు. అసలు తను చదువుకు రావ్వకుండా వుండాల్సింది కాదు. గతమంతా కళ్ళముందు తిరిగి—నిస్సహాయంగా కళ్ళల్లో నీరు నింపుకుంటూ కూర్చున్నది శిరి.

'డాక్టర్' అన్న పిలుపు వినరావటంతో— వులిక్కిపడి—తల తిప్పి చూసి అలవాటుగా



గబుక్కున లేచి నిలబడిపోయింది.

'అరే లేవకండి డాక్టర్ కూచోండి—కూచోండి' అంటూ ఆమెకు కొద్ది దూరంలో కూర్చున్నాడొక అపరిచితవ్యక్తి.

ఒక రాదిరి పొడవులో చూడగానే అందగాడే అనిపించే రూపసంపదతో—ఎదుటివారి మనస్సుల్ని ఆకట్టుకునే సమ్మోహనమైన చిరునవ్వుతో తననే చూస్తున్న ఆ యువకుణ్ణి, కళ్లప్పగించి చూడసాగింది శిరీష్.

ఆమె బిడియాన్ని పోగొడుతున్నట్లు అతడు హాయిగా నవ్వేసి,

'అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నా రేమిటి డాక్టర్? కొంపదీసి ఈ డర్టీరోగ్ ఎవరని నన్నుగూర్చి అనుకోటం లేదుగదా! పదండి అలా కాంటీన్‌వైపు కాస్సేపు కబుర్లు చెప్పుకుందాం' కాంటీన్‌వేపు దారితీశాడు అతను

శిరి కాలేజీలో చేరిన కొత్తలో—కొందరు స్టూడెంట్సు — తామె దగ్గరకొచ్చి పరిచయం చేసుకుని - అల్లరి పెట్టేవారు. అందుకే ఇతణ్ణి చూడగానే భయపడి లేచి నిలబడిపోయింది. కానీ,

హృదయ నైర్మల్యం మోములో ప్రతిఫలిస్తూంటే—అతడి సరళ స్వభావాన్ని చెప్పకనే చెప్పే ఆ చిరునవ్వు చూస్తే—అతణ్ణి అనుమానించలేక మంత్రముగ్ధలాగా అతని వెనుకే నడిచింది శిరి

కాంటీన్‌లో ఎదురెదురు కుర్చీలో కూర్చున్నారు. అతడు టిఫిన్—కాఫీ ఆర్డరు చేశాడు వారించటానికి కూడా సిగ్గుపడి బొమ్మలాగా కుర్చీలో ఒదిగి కూర్చున్నది

టిఫిన్ తింటూ అతడు తనకుతానే పరిచయం చేసుకున్నాడు తనపేరు విజయసారథి అని ఫైనల్ స్టూడెంటునని తెలుపుచే మెల్లిగా మాటల్లోకి దింపేడు శిరిని.

అతడి స్నేహభావానికి - మాటల్లో మన్ననకు ముగ్ధురాలై—కాస్సేపట్లోనే కొత్త తీరి తన ఫీలింగ్సు చెప్పసాగింది శిరీష్

'లాభం లేదండి చాలామంది పిరికివాళ్లు ఈ చదువుకు పనికిరారు—ఎరక్కపోయి చేరేను, త్వరలోనే నాలెడ్జికి గుడ్‌బై కొట్టేస్తాను.' అన్నది పేలవమైన నవ్వుతో శిరీష్.

'ఛఛ మీరలా అనకూడదు మిమ్మల్ని మీరు తక్కువ చేసుకుంటున్నా , ఏమని

## చరితార్థులు

కైనా ముందు ఆత్మస్థైర్యం కావాలి— ఆ బలమే వుంటే చేయలేనిది వుండదు. ఆ...మీ పేరు తెల్సుకోవచ్చునా?'

'దాచకేమిటి! శిరీష్ రాణి అంటారు' సిగ్గుపడూ చెప్పింది.

'ఓ...బ్యూటీఫుల్ నేమ్, మీ లాగానే మీ పేరుకూడా...' అంతలోనే నాలుక్కొరుకుని.

'ఐయామ్...సారీ—పొరపాటుగా మాట దొర్లింది ఏమనుకోకండి—ఆ...అసలు విషయానికి కొద్దాం...నేనొక సంగతి చెప్పేదా! నేను తర్డ్ ఇయర్‌లో వుండగా ఏక్సిడెంట్ అయిన కేసొకటి అటెండు అవాల్సి వచ్చింది. తలా—ముఖం పూర్తిగా చితికిపోయి రక్తం గడ్డకట్టి— మాంసం ముద్దలుగా అయిన ఆ వికృతరూపాన్ని చూస్తూనే అదిరిపోయి కళ్ళు గట్టిగా మూసుకున్నాను చితికిపోయిన బ్రెయిన్ తీసి ట్రేలో పెట్టి ప్రొఫెసర్ ఏదో చెప్తున్నాడు. నాకేమీ వినబడటం లేదు. తల్లో రైళ్ళు పరిగెత్తుతున్నట్లు ఒకటే హోరు—చివరికి ప్రొఫెసర్ అంతా చెప్పి— నన్నేదో అడిగేరు—నేనేం చెప్పేనో నాకు తెలీదు. నా చుట్టూవున్న స్టూడెంట్సు గొల్లున నవ్వేసరికి— అవమానం బాధ పెనవేసుకుని ఏడుపొచ్చి ఒక్కవుదుటున గబగబ పైకొచ్చి హాస్టల్‌కేసి నడిచాను. ఆ రాత్రి కంటిమీద కునుకు లేదు. పూర్తిగా చితికిపోయి భయం గొల్పుతున్న ఆ దృశ్యమే మాటిమాటికీ కళ్ళ ముందు కన్పిస్తూంటే— వెర్రి కేకల్తో— కలవరింతలతో ఆ రాత్రి గడిచి తెల్లవారేసరికి వొళ్ళు తెలీని జ్వరంతో స్పృహ లేకుండా పడివున్నాను. నాలుగురోజులకు కాస్త నెమ్మదించినా మనస్సున భీతి వదల లేదు, మావూరు పోతానని—ఇంకరానని ఒకటే గొడవపెట్టేశాను. నా స్నేహితులంతా చేరి నచ్చచెప్పి—'ఫస్టు రాంక్ స్టూడెంటువి నీవే ఇలా నెర్వస్ అయిపోతే గుడ్డేసుకు పోతే—ఇక మా పని ఖాళీయే— నువ్వు మాకిచ్చిన ధైర్యంతోనే నేమిన్నాళ్ళు నిలదొక్కుకున్నాం—మమ్మల్ని అన్యాయం చేయకురా' అని ఒకటే బ్రతిమాలి— ధైర్యాన్ని నూరిపోసేరు. అప్పుడు వాళ్ళిచ్చిన ప్రోత్సాహమే లేకపోతే—ఇప్పుడెక్కడవుండేవాణ్ణో? ఇప్పుడేమంటారు శిరీష్‌రాణీ? ఈ చదువులో ప్రవేశించిన ప్రతి కొత్త విద్యార్థి—విద్యార్థినులు—ఇలా ఫీలవటం సహజమే—కానీ— ధైర్యంగా ముందడుగువేసినప్పుడే ఫలితాన్ని అందుకోగలరు. మీరే మాస్టారుగా—నాలుగు రోజులుపోతే మీరే—మీ తరువాత వచ్చిన వారిని హేళనచేసి ఆటలుపట్టిస్తారు.

'ఏమో బాబు—ఇదంతా భయంగా వాంతి వస్తేట్లు రోతగా ఈ వాతావరణం చూస్తేనే ఒళ్ళు జలదరిస్తోంది' భయంగా కళ్ళు తిప్పుతూ అన్నది శిరీష్.

'చెప్పాగా మొదట్లో అలావున్నా—క్రమంగా అలవాటయిపోతుంది. రోగాన్ని గురించి తెల్సుకోవాలంటే శరీర అవయవ నిర్మాణాన్ని గురించి క్షుణ్ణంగా తెల్సుకోవాలి. అది తెల్సుకుందుకు జంకేవాడు అసలు డాక్టరే కాలేడు అందుకే—సెకండియర్—ఫైనల్ ఇయర్ స్టూడెంట్సు కష్టతరమైనవంటారు అయినా బెదిరిపోనాల్సింది లేదు. క్రమంగ అన్నీ అవగాహన అవుతాయి. ధైర్యంగా ఆ ప్రవాహంలోపడి కొట్టుకు పోయేందుకు ముందుకు వురికినవారికి— ఇంక అడ్డేమీ వుండదు. అంతే కాదు— మానవసేవ — మాధవసేవ అంటారు పెద్దలు. రోగార్తులకు సేవచేసి వారి బాధలు మాన్పటంలో డాక్టర్లు చేసే కృషి మహత్తరమైనది. అలాటి అమూల్యమైన అవకాశం కలిగినందుకు మనమెంతో సంతోషించి మన బాధ్యత నిర్వహించటంలో వింతో ఆత్మసంతృప్తి లభిస్తుంది. నేను చెప్పనక్కరలేదు. క్రమంగా మీరే తెల్సుకుంటారు.

మీరు అర్థంలేని భయ—సంకోచాలతో ఫీలవకుండా—హాయిగా క్లాసులకు అటెండ్ అవండి—ఏమైనా తెలీనిది వుంటే సంకోచంగా నన్ను అడగండి నా సహకారం మీకెప్పుడు వుంటుంది' ఆగేడు విజయసారథి.

కలలోలాగా అతడిమాటలు వింటూ తల వొంచుకు కూర్చున్న శిరీష్—అతను ఆగే సరికి తృళ్ళిపడి తలెత్తింది.

అతడూ చిన్నగా నవ్వి— 'పనివేళ మీరొచ్చి ఇవన్ని నాకెందుకు చెప్పటం— నేను మీకేమికానే—మీకెందుకి శ్రద్ధ?' అంటారేమో మనిషికీ—మనిషికీ మధ్య వుండే బాంధవ్యం—మానవత్వమే—అంత

కన్నా ఏం కావాలి. దిగులుతో చెక్కిట చేయిచేర్చి కూచున్న మిమ్మల్ని చూస్తే, నా మనస్సు ద్రవించి—తోటి మానవుడుగా నా సహాకారం మీ కందివ్వాలనిపించింది. అంతకన్నా మరోభావం నాకులేదు. అపార్థం చేసుకోరుగా' స్నేహపూర్వకంగా నవ్వేడతడు.

'లేదు—లేదు మీ సలహాలకు నా కృతజ్ఞతలు.' శిరీష్ బిడియంగా అన్నది.

'మరి లేద్దామా ?' నిల్చున్నాడు అతను.

ఆమె లేచి చేతులు జోడించింది.

* * *

అలా ఆయన పరిచయం క్రమంగా వారి మధ్య స్నేహబీజాలు నాటింది. తను కోరకనే విజయ సారధి తానై వచ్చి తన సహకారాన్ని — సలహాలను అందించే అతడి సహృదయానికి-ఆమె మనసార కృతజ్ఞతలు చెప్పుకునేది. సాయంత్రం ఆరుగంటల నుండి—లైబ్రరీ మూసేవరకూ—వుండి శిరీష్‌రాణికి చిన్న సంగతులు విడమర్చి చెప్తూ—ఆమెకు వుపయోగించే పుస్తకాలు ఎన్నికచేసి చదవమని ప్రోత్సాహమిస్తూ, భయపడవద్దని ధైర్యాన్ని కలిగిస్తూ, రికార్డ్సు తయారుచేయటంలో సహాయపడ్తూ డిసెక్షన్ ఎలాచేయాలో-పాయింట్సు ఎలా గుర్తుపెట్టుకోవాలో వోపిగ్గా వివరించేవాడు.

అభిమన్యుడు పద్మవ్యూహంలోకి చొచ్చుకు పోయినట్లుగా ఈ మెడిసిన్‌లో ప్రవేశించి ముందుకు పరకాలని. ఒక్కసారి మెడికల్ కాలేజీలో ప్రవేశిస్తే — ఇక డాక్టరైనట్లేనని అందుకే తర్డు ఇయర్—ఫోర్త్ ఇయర్ స్టూడెంట్సు అప్పుడే తాము డాక్టరయినట్టు పోజులు గొడ్తారనీ-అదే అదనుగా వారి అమ్మా, నాన్నలు కూడా తమ అబ్బాయిలు ఫస్టియర్‌లో చేరగానే తమ అబ్బాయి డాక్టరని గొప్పలు చెప్పుకుంటూ—కట్నాల మార్కెట్‌లో వారి ధరలు వేలకువేలు పెంచేసి అందినంత వరకూ గుంజుకుంటారు. అటు కాబోయే మామగార్లు కూడా మాఅల్లుడు డాక్టరవుతాడు అన్న ధీమాతో లక్షల కట్నం దిమ్మరించి ఈ మెడికోస్‌ను కొనటానికి వెనుదీయరు.


అందుకే శిరీష్‌రాణి-మున్నెప్పుడు ఈ కాలేజీలో అడుగుపెట్టిందో అప్పుడే డాక్టరైనట్లే— అభిమన్యుడు పద్మవ్యూహంలో ఇరుక్కున్నట్లే—అని జోక్సు విసురుతూ—గలగలా నవ్వుతూ—నవ్విస్తూ—మలయానిలం లాటి మాటలతో మనస్సు సేదతీర్చుతూ-కర్తవ్యాన్ని మూరిపోసి-ప్రోత్సాహాన్ని పురికొల్పి, ఆత్మవిశ్వాసాన్ని కలిగించే విజయ సారధి, శిరీష్‌రాణి మనస్సులో-నమ్మదగిన మంచి స్నేహితుడుగా స్థానం ఆక్రమించుకున్నాడు.

(ఇంకా వుంది)

# గురునింద*

## ధర్మపథం

బులుసు వెంకటరమణయ్య



గురువులను నిందిస్తే గురునింద అనిపించుకుంటుంది ఆ గురువు లెవ్వరు? తొలి గురువులు తల్లిదండ్రులు. తర్వాత విద్యనేర్పి జ్ఞానాన్ని కలిగించినవారూ గురువులే అవుతారు. అంతే కాదు. జ్ఞానవయోవృద్ధులైనవారూ, ఉత్తములయినవారూ కూడా గురువులని అనిపించుకుంటారు.

ఒక్కొక్కప్పుడు గురువుల ప్రవర్తన మనకు విచిత్రంగానూ, జనసమూహానికి ఆమోదపాత్రం కానిదిగనూ ఉండవచ్చును—కాదు. ఉన్నట్లు తోచవచ్చును. మనకు అర్థం కాకపోవడంవల్లనే విపరీతంగా కనబడవచ్చును. వారి మాటలు కటువుగా వినబడవచ్చును. అంతమాత్రాన వారిని చులకనచేసి నిందించడం కూడదు. ఒకరు పెద్దలను నిందిస్తున్నా వినకూడదు. కొంత ఉద్రేకం ఉన్నవారయితే అలాంటి నిందను సహించలేక పై గురువులను నిందించినవారిని ఎదిరించి బుద్ధిచెప్పడం ఉన్నది. అవతలివాళ్ళు వినకుండా తమ నిందను సాగిస్తూనే ఉంటే చెయ్యి కలుగజేసుకోవడం కూడా ఉంటుంది.

సాత్వికుల పద్ధతి వేరు. పెద్దలైనవారిని ఎవరైనా నిందించేరంటే వారు సహించకపోయినా, ఎదటివారి నోటిలో నోరు పెట్టరు—పెట్టలేరు కూడా. పెద్దలను నిందించేవారికే కాకుండా, ఆ నిందలను విన్నవారికి కూడా పాపం సంభవిస్తుందని భావించి, అక్కడినుండి తప్పుకొని ఆ మాటలు వినబడని చోటికి పోతారు. ఒకవేళ అక్కడే ఉండవలసివస్తే—అవి వినబడకుండా చెవులు మూసుకుంటారు. ఇదే ఉత్తములు అనుసరించే పద్ధతి. వారు ఇలాగే ప్రవర్తించాలంటూ మన పూర్వులే నిర్ణయించారు.

ఎలాగంటే—

'గురోః ప్రాప్తః పరీవాదో
న శ్రోతవ్యః కథం చన
కర్ణౌ తత్ర పిధాతవ్యౌ
గంతవ్యం వా తతోఽన్యతః.'

'ఎవరైనా గురువులను నిందించినట్లయితే అలాంటి నిందావాక్యాలను ఏవిధంగానూ వినకూడదు. ఆ మాటలు వినబడకుండా చెవులనయినా మూసుకోవాలి. లేదా అక్కడినుండి చల్లగా మరోచోటికి వెళ్ళిపోవాలి.

(అంతేగాని నిందించేవారితో వాగ్వాదం పెట్టుకుంటే ప్రయోజనం లేదు) అని దీని అభిప్రాయం.

# వారఫలం

## 27-7-1973 శుక్రవారం మొదలు
## 2-8-1973 గురువారం వరకు

**మేషం:**— మీ కార్యక్రమాలు మురుకుగా సాగుతాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు వారం ఆఖరుతో వృత్తివ్యాపారాల్లో నూతనావకాశాలు లభిస్తాయి.

స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

**వృషభం** — రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. కారుల వలన గరజ వలసిన వ్యవహారాలు లాభిస్తాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు వారం ఆఖరులో మీ మంచితనమే కొన్ని వ్యవహారాల్లో మీకు యిబ్బందిని కలిగిస్తుంది.

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

**మిథునం:**— వృత్తివ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. ఇతరులతో కలసి చేసే వ్యవహారాలు బాగుంటాయి. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. సజ్జనసాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. అనుకూలమైన సమాచారం అందుతుంది

**కర్కాటకం:**—అనవసరమైన శ్రమ కలుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారంమధ్యలో వృత్తిలో ఆదాయం బాగుంటుంది సాంఘిక కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. విద్యావైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుం. టాయి. అధికవ్యయం జమగుతుంది.

**సింహం:**— వ్యాపారంలో మీ ఆలోచనలు - ఫలిస్తాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం మధ్యలో చికాకులు యేర్పడతాయి. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు అనుకొన్నట్టుగా నెరవేరతాయి.

స్త్రీలకు — ఆరోగ్యం బాగుండదు. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

**కన్య:**— అన్ని వ్యవహారాల్లోను గౌరవం బాగుంటుంది. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. వారం ఆఖరులో ప్రయాస మీది ప్రయోజనం మరొకరిది కావచ్చును

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది దైవకార్యాలు నెరవేరతాయి.

**తుల:**— వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. ప్రయాణాలు ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. మీకంటే పెద్దవారు కూడా కొన్ని వ్యవహారాల్లో మీ సహకారాన్ని కోరవలసి వస్తుంది. మీరు యిదివరకు చేసిన ప్రయత్నాలు యిప్పుడు ఫలిస్తాయి

స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

**వృశ్చికం** —వ్యాపారంలో ప్రయాస కలుగుతుంది ఉద్యోగంలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. వారం మధ్యలో అనుకూల పరిస్థితి యేర్పడుతుంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సజ్జనసాంగత్యం లభిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి.

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాల్లో శ్రమకు గురికాగలరు వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.

**ధనుస్సు** — మీ ఆలోచనలు లాభదాయకంగా ఉంటాయి. పోటీవారిలో గౌరవం బాగుంటుంది. వారం మధ్యలో ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి

స్త్రీలకు — ఆరోగ్యం బాగుండదు శుభకార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

**మకరం.**— ఏ వ్యవహారంలోను యితరుల మీద ఆధారపడడం తగదు. వ్యాపారంలో పోటీవారి పోటీ పెరుగుతుంది ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. వారం ఆఖరులో లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాల బాగుంటాయి ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

**కుంభం:**— మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి ప్రయాణాలు ఫలిస్తాయి. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. ఇతరుల నిమిత్తం శ్రమ పొందవలసివస్తుంది భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు లాభించగలవు.

స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

**మీనం.**— సామాన్యమైన పనులకు కూడా మీరు యెంతో కృషి చేయవలసి వస్తుంది. ఉద్యోగంతో గౌరవం బాగుంటుంది వారం మధ్యలో నూతనావకాశాలు లభిస్తాయి. మిత్రుల సహాయం లభిస్తుంది భవిష్యత్తులో మీకు బాధ్యతను కలిగించే వాగ్దానాలు చేయడం తగదు.

స్త్రీలకు — పుణ్యకార్యాలు చేస్తారు నూతన విషయాలను తెల్సుకొంటారు

—మహేష్

# "మనుషులు మారలేదు"

మల్లాది వెంకట కృష్ణమూర్తి



విజయవాడ, బందరు బస్సు మార్గంలో వున్న వో చిన్న వూరు అది. ఆ వూరి నుంచి నాలుగు మైళ్ల దూరంలో వుంది వో పల్లెటూరు.

ఆ చిన్న పల్లెటూరులో ఓ గుడి. గుడిలో పెళ్ళి జరుగుతోంది చిన్నపిల్లల బొమ్మల పెళ్ళి కాదు. నిజమయిన, వయసులో వున్న వాళ్ళ పెళ్ళి.

అర్ధరాత్రి రెండున్నరవుతోంది కాబట్టి ఆ పల్లెటూరులో చాలామంది నిద్రపోతున్నారు. నిద్రపోతున్న వాళ్ళలో చాలామంది ముసలివాళ్ళు.

ఆ రాత్రి ఆ పల్లెటూళ్లో ముసలితనం నిద్రపోతోంది. యవ్వనం మేల్కొని వుంది. గుడినిండా గుమిగూడి వున్న యువకులు, యువతులు సంబరపడుతున్నారు, ఆ గుడిలో పెళ్ళి జరుగుతోంది కనక.

గర్భ గుడికి ఇవతల పెళ్ళి పీటల మీద కూర్చునివున్నారు ఇద్దరు నవ వధూవరులు. బాజాలు మోగుతున్నాయి, ఆ చిన్న పల్లెటూరిలో అందరికీ వినపడేటట్లుగా. చాలా మందికి బాజాల చప్పుడికి మెలకువ వచ్చింది,

ముసలివాళ్ళకి.

'ఈ పట్నం పిల్లలకి ఎంత ధైర్యం ? ఇంట్లో పెద్దవాళ్ళకి తెలియపరచకుండా, వాళ్ళ సమ్మతి లేకుండా, రహస్యంగా ఇక్కడికి వచ్చి ఎలా పెళ్ళిచేసుకోగలుగుతున్నారో? ఎంత గుండె నిబ్బరం' అనుకున్నారు నిద్ర చెడిన కొందరు.

పాపం. కుర్రాళ్ళకి ఏం తెలియదు. అనుభవంమీద నేర్చుకుంటూరు, ఇప్పుడు ఆదర్శం అనుకున్నది చివరకి ఓ అఘాతం అవుతుంది. మరో కులందాన్ని చేసుకోవటం ఎంత బుద్ధి తక్కువ అనుకున్నారు మారని, మెలకువ వచ్చిన మనుషులు.

ఈ పెళ్ళి కాదు గాని మన నిద్ర చెడుతొంది అనుకున్నారు నిద్రపోతులు.

కొందరికి అసలు మెలకువే రాలేదు

పెళ్ళి ఆగలేదు. జరుగుతూనే వుంది. పెళ్ళికొడుకు తరఫున, పెళ్ళికూతురు తరఫున ఎవరూ లేరు, ఒక్క నలుగురు స్నేహితులు తప్ప. ఆ నలుగురూ పెళ్ళికొడుకు స్నేహితులు ఈ కులాంతర వివాహాన్ని ప్రోత్సహించి, పెళ్ళి జరిగేందుకు చేయూతనిచ్చినవాళ్ళు పెళ్ళికి కావల్సిన ఏర్పాట్లు రహస్యంగా చేసినవాళ్ళు.

## మనుషులు మారలేదు

ఆ నలుగురూ గాక నూట ఏభై మంది పైనే వున్నారు వుత్సాహవంతులయిన యువకులు యువతులు. వాళ్ళే పెళ్ళిపెద్దలు.

సరదాగా చూస్తున్నారు పెళ్ళి. ఎవరికి వారు ఆ పెళ్ళి తమ ఇంట్లో జరిగేదిలాగా భావిస్తున్నారు, ఛెణుకులు విసురుతూ ఉత్సాహంగా చూస్తున్నారు. తమ గ్రామంలో మొట్టమొదటిసారి జరిగే ఆ కులాంతర వివాహాన్ని

పట్టుబట్టల్లో, పెళ్ళికళతో, సిగ్గుతో, వోర చూపులతో, నుదుట బాసికాలతో కూర్చుని వున్న ఆ జంటని చూసి అందరూ సంబరపడ్డారు

వాళ్ళ వాళ్ళు ఎవరూ రాలేదనే లోటు జరగనివ్వలేదు కుర్రకారు ఆడవాళ్ళంతా పెళ్ళికూతురుతరఫు వాళ్ళు మొగవాళ్ళంతా పెళ్ళికొడుకు తరఫు వాళ్ళు, ఒకరి కొకరు వియ్యాలవారు

బ్రాహ్మణుడు వేదమంత్రం చెప్పి, పెళ్ళికొడుకుని పెళ్ళికూతురు చెవులో చెప్పమన్నాడు. పెళ్ళికొడుకు చెప్తున్నాడు, పెళ్ళికూతురు చెవులో, పెళ్ళి జరిపించే బ్రాహ్మణుడు చెప్పే మంత్రాలని.

'గట్టిగా' అరిచారు కుర్రాళ్ళు

'వాళ్ళ రహస్యాలు మీ కెందుకు?' సమాధానం చెప్పారు ఆడవాళ్ళు.

అందరి మొహాలనిండా చిరునవ్వులు,

తలంబ్రాల వేడుక మొదలయింది.

అసలు పెళ్ళిలో తలంబ్రాల వేడుక చాలా ముఖ్యమయిన ఘట్టం. రసవత్తరమయిన సన్నివేశం. హుషారెక్కించే సంఘటన, గుర్రవు రేసులు ఇచ్చే వుత్సుకత కలిగిస్తుంది.

పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు ఎవరికి వారు పోటీపడి తలంబ్రాలు పోసుకుంటున్నారు, ఆడవాళ్ళు పెళ్ళికూతురిని ప్రోత్సహిస్తున్నారు, మొగవాళ్ళు పెళ్ళికొడుకుని ప్రోత్సహిస్తున్నారు ఒకరి కొకరు పోటీపడి తలంబ్రాలు పోసుకుంటూంటే అంతా సంతోషంగా చూస్తున్నారు

పెళ్ళికొడుకు పళ్ళెం పళ్ళెమే ఎత్తి పెళ్ళికూతురి నెత్తిమీద కుమ్మరించాడు.

'సెభాష్. మా పరువు నిలబెట్టావు' — printed as: 'సెభాష్. మా పరువు గక్కించావు'

అరిచారు మొగాళ్ళు

'అన్యాయం మీది తప్పు'

ఎదురొన్నారు ఆడాళ్ళు.

బ్రాహ్మణుడు చెప్పిన ప్రకారం పెళ్ళికొడుకు నెత్తిమీద చెయ్యి పెట్టింది పెళ్ళికూతురు సిగ్గుపడుతూ. తర్వాత పెళ్ళికొడుకు వంతు బ్రాహ్మణుడు మంత్రం చదువుతున్నాడు.

'సెన్సార్'

అరిచాడు కొంటె కుర్రాడు.

ఫొల్లున నవ్వారు అంతా. చెయ్యి తీసేసాడు పెళ్ళికొడుకు, ఈసారి పెళ్ళి జరిపించే బ్రాహ్మణుడు కూడా నవ్వాడు.

మధ్యలో మండుతున్న మంట చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నారు, కొంగుముడి వేసుకున్న కొత్త దంపతులు, బ్రాహ్మణుడు మంత్రం చదువుతూంటే.

'ఎవరడుగుల్లో ఎవరు నడుస్తున్నారు?' అడిగిందో అమ్మాయి.

మీ వాళ్ళంటే, కాదు మీ వాళ్ళని వాదించుకున్నారు కుర్రకారు, అమ్మాయిలు.

ఏడడుగులు నడిచారు. బ్రాహ్మణుడు చెప్పినదంతా చేసారు, కీలుబొమ్మల్లాగా.

'అదిగో చూడండి. అరుంధతీ నక్షత్రం' పెళ్ళికూతురు పైకి చూస్తోంది. కాని

పెళ్ళికొడుకు మాత్రం పెళ్ళికూతురువైపు చూస్తున్నాడు దేనికో

'పైకి చూడు బాబూ' చెప్పేడు బ్రాహ్మణుడు

'అయస్కాంతం పైన లేదు' నవ్వుగా చెప్పాడో కుర్రాడు

పెళ్ళి అయిపోయింది. ఇక యిద్దరూ భార్య భర్తలయిపోయ్యారు పెళ్ళి పూర్తయ్యేసరికి ఇద్దరూ సిగ్గులో మొగ్గలయి పోయారు ఆ పెళ్ళి చూడటానికీ, జరిపించడానికీ వచ్చినవాళ్ళు ఎందరు

'చూడముచ్చటగా వున్నారు' అన్నాడొకడు

'పాపం. వాళ్ళ పెద్దవాళ్ళకి ఈ పెళ్ళి చూసే అవకాశం లేకపోయిందిగా' అన్నాడు మరొకడు

'ఇద్దరూ ఒకే ఆఫీస్‌లో పని చేస్తున్నారుట.'

'ప్రేమించుకున్నారు కూడా. ఇద్దరు చేరి ఆరు నెలలయినా కాలేదుట.'

'ఇద్దరిదీ విజయవాడే.'

'ఇప్పుడు ఎక్కడ వుంటారు ?'

'ఇల్లు తీసుకున్నారుట విజయవాడలో వేరే.'

'అతను బ్రాహ్మణుడు ఆమెది ఏకులమో తెలియదు గాని నాన్‌బ్రాహ్మిన్'

పెళ్ళి అంతా అయ్యాక విశ్రాంతి తీసుకుంటూ ముచ్చట్లు చెప్పుకుంటున్నారు అంతా. కొందరు నవ వధూవరుల చుట్టూ చేరి వాళ్ళ ప్రేమకథను, పెళ్ళికి యింట్లో ఎదుర్కోవల్సివచ్చిన బాధలను, ఇకముందు ఏం చేయబోయేదీ వింటున్నారు.

ఆ మారుమూల పల్లెలో పెళ్ళి ఏర్పాటు చేయబడటానికి కారణం, పెళ్ళికూతురుకి తెలిసిన ఒకతను చదువుకున్నవాడు. మంచి ఆదర్శాలు గలవాడు. కులాంతర వివాహాలను ప్రోత్సహించేవాడు మరో కులంవాళ్ళనే చేసుకోలేకపోతే, ఇక చంద్రమండలందాక వెళ్ళే దెప్పుడు అనే స్వభావం గలవాడు,

ఆ పల్లెటూరులో పెద్ద లీడర్. వో రాజకీయపార్టీతో బాగా తిరిగి, ఎలక్షన్స్‌లో నిలబడ్డాడు అతనిద్వారా అయితే పెళ్ళికి సహాయం ఎక్కువగా లభిస్తుందని అతనికి విషయం చెబితే, ఎగిరి గంతేసి ఒప్పుకున్నాడు

అతనుగాక పెళ్ళికొడుకు నలుగురు స్నేహితులు మంచి చేయూతనిచ్చారు. వివాహం జరిపించారు.

ఓ అయిదు నిమిషాలు మాట్లాడాడు, పెళ్ళి అందరూ అయి ఇళ్ళకి వెళ్ళబోయే ముందు, ఆ లీడర్

'పెళ్ళికొడుకు రావు నిజంగా ఆదర్శప్రాయంగా మనందరికీ దారి చూపాడు కులం, మతం, ఇవన్నీ బూజు పట్టిన పాత సిద్ధాంతాలు. కొత్త తరం రావాలి! మనుషులు మారాలి ప్రస్తుతం వున్న వ్యవస్థ పోవాలి. పూర్తిగా రూపు మాసిపోవాలి. కాలం మారింది మనుషులు మారారు — నిదర్శనం ఈ జంట ఇంకా మారాలి'

రాజకీయ నాయకుడి ధోరణిలో సాగిపోయింది వుపన్యాసం వుద్రేకంగా.

తర్వాత రావు—పెళ్ళికొడుకు అందరికీ తన కృతజ్ఞతలు తెలియజేసాడు, పెళ్ళికి సహాయపడ్డందుకు

'ఇక వెళతాం' చెప్పాడు చివరకి.

'ఎక్కడికి ?' అడిగారు ఎవరో.

'విజయవాడకి. ఇంటికి.'

'అప్పుడే'

'పెళ్ళయిపోయిందిగా'

'కాలేదు పూర్తిగా'

'ఇంక ఇక్కడేం చేయాలి? అంతా అయిపోయిందిగా' అన్నాడు రావు అమాయకంగా

'అయిపోయిం దంటావేమిటోయ్, నీ పెళ్ళాం బంగారం గాను అసలుది కాలేదుగా'

'ఏమిటి అసలుది ?'

'పెళ్ళిలో ముఖ్యమయిన భాగం'

'ఏమిటి ?'

'అదే'

ముసిముసిగా నవ్వారు.

'ఏది ?'

'కార్యం'

'ఓ!'

'అవును మొదటి రాత్రి అది కూడా పూర్తిచేసుకుని వెళ్ళండి'

'ఇక్కడా? ఫర్వాలేదు..'


నసిగాడు రావు

'అక్కడ అద్దె కొంపల్లో ఏం సుఖం? మీ కోసం ఏర్పాటు చేసాము దగ్గరలోనే చిన్న మల్లెపొద వుంది దాంట్లో హాయిగా వుంటుంది.'

'వద్దులెండి.'

'మొహమాట పడకండి ఎవరూ రారు లెండి. మేం అంతా ఇంటికి వెళ్ళి పడుక్కుంటాం. ఎవరూ కొంటెవాళ్ళు మధ్యలో రాకుండా నలుగురయిదుగురు కాపలా వుంటారు ఉదయం దాకా కారులోనే నిద్రపోతాడు డ్రైవర్. ఇప్పుడు వాడిని లేపడం దేనికి? మీరే హాయిగా ఆ మల్లె పొదలో పడుకోవచ్చు.'

అందరిలోకి ధైర్యం గల అమ్మాయి అన్నది ముందుకు వచ్చి, నవ్వునాపుకుంటూ



[illegible]ం అన్నట్లుగా చూసాడు రావు కొ[illegible] భార్య వంక 'మీ ఇష్టం'అన్నట్లుగా చూసింది.

'[illegible]' అన్నాడు రావు.

[illegible]కి వాళ్లు వెళ్లిపోయారు [illegible]తో పాటు మరో ఆరు [illegible]వు కదిలారు [illegible]అంగుల దూరంలో వుంది [illegible]

[illegible] ఈ ఎద రహస్యంగా ప్రేమి[illegible]వేందుకు ఉపయోగ పడింది [illegible] కొంతమంది కులాలలాంటి [illegible] విడిపోవాల్సివచ్చింది అయిష్టం [illegible] కాని విజయమయిన దంపతులు మొదటి [illegible] అక్కడ గడపటం మీదే ప్రథమం [illegible].'

[illegible].

[illegible]ంత ఇరుకుగా లేదు ఆ [illegible] వో పెద్ద గదిలా వుంది [illegible] మల్లె తీగలు అల్లుకుని [illegible] కర్రలతో గోడలులాగా [illegible] చిన్న ద్వారం లోప[illegible] లోపలకి వచ్చి తలుపు మూసారు

మట్టి నేల కాదు క్రిందంతా ఇసుక. ఆ ఇసకమీద తెల్లటి ఇస్త్రీ చేసిన దుప్పట్లు రెండు పరచి వున్నాయి వాటినిండా మల్లె పూలు వాటి మధ్య అరంగుళం దూరం కూడా లేదు

పైన సందుల్లోంచి పడుతున్న చంద్రుని వెన్నెల కిరణాలు మెత్తటి ఇసక అన్నిటికీ

## మనుషులు మారలేదు

మించి మల్లెపూల మధురమయిన వాసన, మల్లెపువ్వులాంటి, కోరుకున్న మనువడ్డ కన్నె పిల్ల

'ఎవరయినా మధ్యలో వస్తారేమో ?' అన్నది పెళ్ళికూతురు సిగ్గుగా

'రారు, కంచే చేను మేస్తే చెప్పలేం గాని'

నవ్వాడు రావు

'వీళ్ళంతా అబ్బ ఎంత మంచివాళ్ళు,'

'తర్వాత వాళ్ళ సంగతి'

మీదికి లాక్కున్నాడు రావు భార్యని

చిలిపిగా నవ్వి అన్నది

'మీ బ్రాహ్మణత్వం మంటకలసిపోతుంది'

'ఇప్పుడు కలవాల్సింది బ్రాహ్మణత్వం కాదు'

చెవులో చెప్పాడు రావు భార్యకి యేం కలవాలో సూర్యుడు ఉదయిస్తూండగా, వాళ్లలోని కోరికలు ప్రస్తుతానికి అస్త మిస్తూండగా నిద్రపోయారు అలసిపోయిన ఆ దంపతులు

కారు హారన్ విని మెలకువ వచ్చింది రావు భార్యకి రావుని లేపింది

'అబ్బ, పదకొండయిందే' అన్నాడు రావు చేతి గడియారం వంక చూసుకుని

'రండి ఇంత ఆలస్యం అయితే వాళ్లేమన్నా అనుకుంటారు'

ఇద్దరూ బయటికి వచ్చారు ఆ మల్లె పందిరిలోంచి అలాగే చూస్తూండి పోయారు !

నిన్న రాత్రి పెళ్లికి వచ్చిన వాళ్ళంతా, మల్లె పొదకి వంద గజాల దూరంలో కూర్చుని చూస్తున్నారు వాళ్ళ కోసం చేతులు వూపారు ఆడవాళ్లు వాళ్లని చూస్తూ ఈలలు వేసారు ఈల వచ్చిన మొగవాళ్లు

*   *

దాదాపు వో పదివేల రోజుల తర్వాత

చాలా ప్రయత్నాలు చేసారు కాని ఎవరూ సమ్మతించలేదు కూతురు పెళ్లి కావటంలేదే అనే దిగులు పట్టుకుంది ముసలి దంపతులకి

చివరి ప్రయత్నంగా వో వుత్తరం రాసాడు రావు, తన పెళ్ళిలో తనకి సహాయపడ్డ మిత్రులు నలుగురికీ

'డియర్ ఫ్రెండ్,

దాదాపు మూడు దశాబ్దాల క్రితం నా పెళ్ళికి సహాయం చేశారు ఇప్పుడు మరో సారి కోరుతున్నాను మీనుంచి మళ్ళీ కాలం మారలేదోయ్, ఇంకా కులం కులం కులంపట్టుకుని వేలాడుతున్నారు మనుషులు పెద్దమ్మాయికి ఇరవైఏడు వస్తోంది ఇంకా ఇరుకు స్వభావాలు మారలేదు మనవాళ్లల్లో, గోత్రం, కులం, ముఖ్యం పిల్లకన్నా, పిల్ల గుణం కన్నా

బయటికి చెప్పదుగాని, నాకు తెలుసు అది మనసులోపడే బాధ ఇప్పుడనిపిస్తోంది నేను పొరపాటు చేసానేమోనని—ఆ వయసులో ఇంత ముందుకు ఆలోచించే శక్తిలేదు కదా ?


ఇప్పుడు ఈ వుత్తరం రాయడానికి కారణం ఏమిటంటే, మీ అబ్బాయిని వుంచుకుని వూరంతా వెతికాననిపిస్తోంది మీ అబ్బాయి ఒప్పుకుంటే ఆమూడు ముళ్లు వేయించేద్దాం

సమాధానం కోసం ఎదురుచూస్తూ
—రావు

పోస్టు చేయబోయేముందు పెద్దకూతురుకీ చూపించాడు వుత్తరాన్ని, చదివి, నవ్వి వూరుకుంది

మూడోరోజే సమాధానాలు వచ్చాయి, ముగ్గురినుంచి, కూతురుని పిలిచి చదవమన్నాడు

రావు మడతమంచంమీద పడుక్కొని, కళ్లు మూసుకుని, కూతురు చదివేది విన



సాగాడు

డియర్‌రావ్‌

చాలా రోజులతర్వాత నీ నుంచి ఉత్తరం వచ్చినందుకు సంతోషం మా పెద్దాడికి మేనరికం సిద్ధంగావుంది నీకు తెలుసుగా మా ఇంట్లో అందరికీ మేనరికమే అచ్చి వచ్చిందని నీ ప్రయత్నాలు నువుచెయ్యి, అధైర్యపడక కాలంవస్తే అదేఅవుతుంది

'బావుంది కదూ?' అన్నది కూతురు నవ్వి

'రెండో ఉత్తరం చదువు వాడుమాత్రం ఏంచేస్తాడు?' అన్నాడు రావు కళ్ళు తెరవకుండానే

రెండో ఉత్తరం విప్పి చదివింది రావు పెద్ద కూతురు

'డియర్ రావ్‌,

మా వాడు పుట్టి బుద్దొచ్చాయి పెళ్లి చేసుకోనంటున్నాడు పాతికవేలిస్తామంటూ వస్తున్నారు చాలామంది వూహూ కాదు ససేమిరా అంటున్నాడు ఎన్నిచెప్పినా వినటం లేదు కాబట్టి వాడి పెళ్లి విషయంలో నేను బాధ్యుడిని కాను

ఇకపోతే, నేనీమధ్య గుంటూరు దగ్గర వో నాలుగెకరాల మాగాణి కొన్నాను దాంట్లో వరి, పచ్చిమిరప '

'మూడోది చదువు' అన్నాడు రావు మధ్యలోనే.

'ఏం? బాగుళ్ళేదా?'

నవ్వి, రెండోఉత్తరం పక్కన పడేసి మూడోది అందుకుంది రావు కూతురు

'వాడు మంచివాడు అందరికన్నా'

తన ఆశని వ్యక్తం చేసాడు రావు

'డియర్ రావ్‌,

నీ ఉత్తరం

తప్పు నంబర్ డయిల్ చేసావు

'ఇదెట్లావుంది? రెండేరెండు వాక్యాలు. బాగుందికదూ?'

మంచంమీద పడుక్కొనివున్న తండ్రి మొహంలోని బాధతాలూకు ఛాయలు గమనించి, రావుని ఆట్టే విసిగించడం ఇష్టం లేక, లోపలికి వెళ్లిపోయింది రావు పెద్దమ్మాయి

మూడు రోజుల తర్వాత వచ్చింది నాలుగో స్నేహితుడినుంచి ఉత్తరం.

'చదువు' అన్నాడు రావు ఆతృతంగా. 'నలుగురిలో వాడు మిన్న.' రావు చూపించిన ఉత్సాహం, ఆసక్తి లేవు పెద్దకూతురులో

మామూలుగానే విప్పింది ఉత్తరం' గొంతు సర్దుకుని చదివింది

'డియరెస్ట్‌రావ్‌—'

'ఏమని రాసాడు?' అడిగాడు రావు.

'డియరెస్ట్ రావ్‌,

సూటిగా, క్లుప్తంగా రాయదలచుకొన్నది రాస్తాను ముప్పై సంవత్సరాలు అవుతోంది నీ పెళ్లయి అప్పుడు నీకు ఎదురయిన సమస్యలే ఇప్పుడూ ఎదురు అవుతున్నాయి అవునా? మావాడిని మీ అమ్మాయినిచ్చిచేస్తే, పాతికేళ్ల తర్వాత ఈ సమస్యలు మళ్లీ మావాడికి తయారు. అప్పుడు వాడేం చేస్తాడు? ముప్పైఏళ్లుగా మారని ఈ సంఘం, పాతికేళ్ళ తర్వాతకూడా మారదు

అప్పుడు యువకులం కాబట్టి ఆదర్శం పేరుతో ఏదేదో చేసాం, ఆ ఆదర్శం అంతా కొట్టుకుపోయింది నాలో, ఈ ముప్పైఏళ్ళ అనుభవంతో

స్నేహితుడివి కాబట్టి వో సహాయం చేయదలచుకున్నాను, ఉత్తరం చివర రాస్తున్నాను ఒకతని చిరునామా మీ అమ్మాయికి నచ్చితే అతన్ని కుదుర్చుకోవచ్చు స్వచ్ఛమయిన బ్రాహ్మణుడు వైదికుడు [illegible] అతని చెల్లెలు వో క్రిస్టియన్‌ని [illegible] వెళ్లిపోయింది కాబట్టి [illegible] ముప్పై అయిదొచ్చినా ఇంకా వివాహం...

'ఇంక చదవక్కర లేదు' [illegible]

పెద్దకూతురు చెప్పబోగా, [illegible]

'వెధవ. లేచి పోయినదాని అన్నయ్యట'

'ముప్పైఏళ్ళ క్రితం అమ్మనికూడా ఇలాగే అనుకుని ఉంటారు అంతా.'

రావు మాట్లాడలేక పోయాడు [illegible]

'అంతే నాన్నా ముప్పై ఏళ్ళ క్రితం కానీ, ఇప్పుడు పాతికేళ్ళ తర్వాత కానీ ఎప్పుడయినా ఇంతే లోకం [illegible] [illegible] ధైర్యం చేసేడంటుంది. [illegible] లేచి పోయిం దంటుంది.'

'ప్చ్! కాలం మారిపోతున్నాయి.'

భారంగా అన్నాడు రావు.

'అబద్దం.'

'మరి? కాలం మారలేదు నిజంగా'

'మారనిది కాలం కాదు నాన్నా, మనుషులు మనుషులు మారరేదు

లేచి లోపలికి వెళ్ళిపోయింది రావు పెద్ద కూతురు ●



'అర్ధనారీశ్వరుడు'

సాధారణంగా మనం ఈ పగటి వేషగాళ్ళనిపల్లెల్లో చూస్తుంటాము. కానీ యిప్పుడు మదరాసులోని ఎలక్ట్రిక్ ట్రైన్‌లలో కూడా కనిపిస్తున్నారు ఈ పగటి వేషగాళ్ళు (ఫోటో: సభ చిత్రకారుడు శ్రీ సంపత్ కుమార్)

# సిమీ
# బ్యూటీ బులెటిన్

లేక

## అందానికి చిట్కాలు

**అందాల తార సిమీ అందానికి, ఫాషన్‌కి తగిన చిట్కాలు తెలుపుతుంది. వ్యక్తిగతమయిన ప్రశ్నలకి సమాధానాలు ఇవ్వలేనని తెలుపటానికి ఆమె చింతిస్తోంది! సాధారణంగా అందరికీ ఉపయోగంగా ఉండే ప్రశ్నలనే 'SIMI'S BEAUTY BULLETIN, Post Bag No. 7117, BOMBAY 400014 కి పంపవచ్చు.**

ప్ర: నా స్నేహితురాలు ఒకామె నా కనుబొమలు తగ్గిస్తే బాగుంటా యంది. అవి అసలే చిన్నవి. ఇప్పుడు మరీ చిన్నవి అయిపోయాయి. చూస్తుంటే ఏడుపొస్తున్నది. ఆముదం వల్ల ప్రయోజన ముంటుందా? మీకేమన్నా తెలిస్తే చెప్పండి.

జ: కనుబొమల్ని కత్తిరించినట్టయితే అలాగే ఉండిపోతాయి. ఆముదం రాసినా ఏం రాసినా అంతగా ప్రయోజనం ఉండదు. రోజూ రాత్రుళ్ళు వాజలైన్ రాస్తూ ఉండండి. అవి పెరగవచ్చు...అయిదేళ్ళల్లో!

ప్ర: నాకు పందొమ్మిది ఏళ్ళు నా వెంట్రుకలు తెల్లబడిపోతున్నాయి. ఏం చెయ్యమంటారు?

జ: రంగు వేసుకోవడం తప్పితే అర్జెంటుగా ఏం చెయ్యలేం. కాని, మిగతా వెంట్రుకలు తెల్లబడి పోకుండా చూసుకోవచ్చు. రాత్రి పడుకోబోయే ముందు 'ఆల్మండ్ హెయిర్ ఆయిల్' రుద్దుకుంటూ ఉండండి. ఈ హెయిరాయిల్ బాగా పని చేస్తుంది. అద్భుతంగా పని చేస్తుందని మాత్రం కలగనకండి. ఒకటి రెండు నెలల్లో కొంత మార్పు కనిపిస్తుంది.

ప్ర: నేను చాలా నల్లగా ఉంటాను. మా యింట్లో అందరిలోకీ నేనే నలుపు. అంతా 'నల్లపిల్లి' అని పిలుస్తూ ఉంటారు. నాకు బాధగా ఉంటుంది. కొంచెం తెల్లబడే మార్గం ఏదయినా ఉందా? పెదవులు, ముక్కు నుదుటి భాగంలో నల్లటి మచ్చలు కూడా ఉన్నాయి. ఇవి నిజంగా మచ్చలు కాదు. నా రంగే అంత. ఏంచెయ్యమంటారు?

జ: మీకు ఇటీవల ఫాషన్ గురించి తెలియదులా ఉంది; నలుపే నాణ్యం. అదే ఇప్పటి అందం. మిమ్మల్ని ఎగతాళి చేసే వాళ్ళనే మీరు గేలి చెయ్యవచ్చు. అప్పుడు వాళ్ళే ఈర్ష్య పడతారు. 'బ్యూటీ మాస్క్' ప్రయత్నించి చూడండి. మీ రంగు మారడానికి కొంత ఉపయోగ పడుతుంది.

ప్ర: నల్ల వెంట్రుకలని తెల్లగా చేసేందుకు ఏదైనా మందు ఉందా? ఉంటే దయ ఉంచి చెప్పండి.



జ: తెల్ల వెంట్రుకలని నల్లగా చెయ్యడానికి మన దేశవాళీ మందులు చాలా ఉన్నాయి. మీ సమస్య విదేశీ సమస్య. విదేశీ మందులనే ఉపయోగించాలి. కాని, అవి ఇక్కడదొరుకుతాయనే నమ్మకం నాకులేదు.

ప్ర: నా వయసు పదిహేనేళ్ళు. చేతుల మీద, కాళ్ళమీద దట్టంగా వెంట్రుకలున్నాయి చూడ్డానికి అసహ్యంగా ఉంటున్నది. క్రీమ్, వాక్స్ ఉపయోగించకుండా ఈ వెంట్రుకల్ని తొలగించే మార్గం ఏదైనా ఉంటే చెప్పండి.

జ: మీ ఊళ్ళో 'ఎలక్ట్రాలిసిస్' ద్వారా మీ సమస్యని తీర్చే బ్యూటీ సెలూన్లు చాలా ఉన్నాయి. ఒకసారి అడిగి చూడండి. మీ వెంట్రుకలు మరీ దట్టంగా ఉంటే కష్టమే మరి!

ప్ర: నా పళ్ళూ చిగుళ్ళూ గట్టిగానే ఉంటాయి. నా పళ్ళు తెల్లగా ఉండేందుకు మంచి టూత్‌పేస్టుతో రోజూ రెండుసార్లు తోముకుంటూ ఉంటాను, అయినా తెల్లగా ఉండటం లేదు. ఏం చెయ్యను?

జ: ఆరు మాసాలకి ఒకసారి మీ డెంటిస్టును చూస్తూ ఉండండి. బ్రష్ చేసుకోవడంలో మెళుకువలు అతను చెబుతాడు. 'మీ పళ్ళని తెల్లగా ఉంచును' అనే ప్రకటనలు చూసి మోసపోకండి.



'పల్లెటూరిబావ'లో లక్ష్మి, నాగేశ్వరరావు.



'స్నేహబంధం'లో రమాప్రభ, రాజబాబు

# సినిమా

## కారణజన్ముడు

'కనిపించే దేవుడు' కథానాయకుడు. ఆ కథానాయకుడు ఎవరో కాదు ఎన్నో విశిష్టమైన పాత్రలను విశేషంగా పోషించిన నాగేశ్వరరావుగారే

గత వారం 'కనిపించే దేవుడు' సినిమా చూశాను. ప్రేమనగర్ తర్వాత అక్కినేని అద్భుతంగా నటించిన పాత్ర ఈ చిత్రంలో రిక్షా అబ్బి ఈ పాత్రలో శృంగారం, కరుణ, భయానకం, అహంకారం వున్నాయి. మంజులతో ప్రేమ, జయంతితో కరుణ, ఆనంద మోహన్‌తో భయానకం, గుమ్మడితో అహం చూపెట్టవలసిన పాత్ర అక్కినేనిది. శృంగారం చేసినప్పుడు ఒళ్ళు పులకరిస్తుంది కరుణ చూపెటినప్పుడు కన్నీరు కార్పిస్తుంది. భయంకరంగా గర్జించినప్పుడు గుండె దద్దరిల్లుతుంది అహం ప్రదర్శించినప్పుడు అవురా అనిపిస్తుంది

*దేవదాసు ఉన్నాడు...*

'దేవదాసు ఇంకా ఉన్నాడు అనిపించింది నాగేశ్వరరావును 'కనిపించే దేవుడు' లో చూచినప్పుడు పాత్ర దొరికినప్పుడు, దాని అంతు తేల్చడం అక్కినేనికి భగవంతు డిచ్చిన వరం. ఆయన నట జీవితంలో రిక్షా అబ్బి వేషం మైలురాయిగా ఉంటుంది.

*రెండవ విజయం...*

'కనిపించే దేవుడు' చిత్రం, దర్శకుడు తాతినేని రామారావుకు రెండవ విజయాన్ని తెచ్చిపెడుతుంది అతగాడు తీసిన కొన్ని షాట్లు మరువలేము, ఆచార్య ఆత్రేయ మాటలను మరచిపోలేము

*జయంతి పాత్ర...*

ఆగర్భ శ్రీమంతురాలిగావుండి, విధి వంచితురాలై, భర్తను, ఆస్తిని గోల్పోయి, కటిక దరిద్రురాలిగా మారినప్పుడు జయంతి గొప్పగా నటించింది దీనావస్థలోవున్న తన్ను, తన కుమార్తెను ఆదరించి, అండగా నిలచిన రిక్షా అబ్బికి కృతజ్ఞత ఎలా తెలపాలో తెలియక, సతమతమయ్యేఘట్టంలో జయంతి అద్భుతంగా నటించింది,

*కన్నీటి కథ...*

'కనిపించే దేవుడు' చిత్రం ఒక దీనురాలి, అభాగ్యురాలి జీవితానికి సంబంధించిన కథ.. ఒకపూట అన్నం పెట్టిన కుటుంబానికి తన జీవిత సర్వస్వాన్ని అంకితం చేసిన ఒక మహనీయుని జీవితానికి సంబంధించిన కథ. అందుకే యీ చిత్రాన్ని కన్నీటి కథ అనడం వుచితం ప్రతి స్త్రీ, పురుషుడు చూడవలసిన, చూడదగిన 'మానవత'వున్న మంచి కథ యిది.

## నాగేశ్వరరావు, వాణిశ్రీ

జంటగా నటించడం 'ఆత్మీయులు' చిత్రంలో ప్రారంభమైంది అప్పట్నుంచి అక్కినేని, వాణిశ్రీ నటించిన చిత్రాలన్నీ విజయవంతం అయినాయి. 'దసరా బుల్లోడు, విచిత్రబంధం, ప్రేమనగర్, పవిత్రబంధం, కొడుకు—కోడలు, ఇద్దరు అమ్మాయిలు, బంగారుబాబు, దత్తపుత్రుడు' చిత్రాల్లో అపజయం చవిచూచిన చిత్రాలను వ్రేళ్లమీద లెక్కపెట్టొచ్చు

ఇటీవల నాగేశ్వరరావు, వాణిశ్రీలను ఏ కొత్త చిత్రంలోనూ బుక్ చెయ్యలేదేం ? అన్నప్రశ్న వుదయించింది దానికి ప్రత్యేక కారణమంటూ ఏమీలేదు. నాగేశ్వరరావు, వాణిశ్రీ అంటే వాళ్లకు సరైన పాత్రలుండే కథలను నిర్మాతలు తలపెట్టాలి

*మాధవీ కంబైన్స్ !*


'సుపుత్రుడు' చిత్ర నిర్మాతలు రాజేంద్ర ప్రసాద్, సుబ్బారావు గార్లు నిర్మించబోయే కొత్త చిత్రంలో వాణిశ్రీ, అక్కినేని నాయకీ నాయకులుగా నటించబోతున్నారు ఈ చిత్రానికి తాతినేని రామారావు దర్శకుడు

ఆగస్టు ఆఖరు వారం షూటింగు ప్రారంభమయ్యే ఈ చిత్రానికి గొల్లపూడి రచన చేస్తున్నారు.

## అపజయం ఎరుగని జంట!

నాగేశ్వరరావు, వాణిశ్రీలవలె, శోభన్—శారద జంటగా నటించిన చిత్రాల్లో ఫెయిల్యూర్స్ చాలా తక్కువ. అసలు లేవేమో అనుకుంటాను

వీరిద్దరూ 'మనుషులు మారాలి'చిత్రంలో చూడ ముచ్చటయిన జంటగా ప్రేక్షకులను ఆకర్షించారు. 'పసిడి మనసులు,



'డాక్టర్ బాబు'లో శోభన్‌బాబు, జయలలిత.



'ఇంటిదొంగ'లో జమున, కృష్ణంరాజు.

సిసింద్రీ చిట్టిబాబు, మానవుడు—దానవుడు, కాలం మారింది, శారద, జీవితం' చిత్రాల్లో విడివడని జంటగా నటించి ప్రేక్షకుల అభిమాన జంటగా స్థిరపడ్డారు.

ఇప్పుడు సమత చిత్రవారి 'ఇదాలోకం'లో శారద, శోభన్ భార్యాభర్తలుగా నటించారు ఈ చిత్రానికి ఛటర్జీ కథను వ్రాయ, ఆదివిష్ణు మాటలను పాదిగారు బాక్సాఫీస్‌కు దగ్గర చుట్టమై కూర్చున్న కె ఎస్ ప్రకాశరావు ఈ చిత్రంద్వారా మరింత సన్నిహితుడయ్యే విధంగా 'ఇదాలోకం' చిత్రాన్ని ప్రేక్షకలోకానికి అందించబోతున్నారు ఈ చిత్రంలో శోభన్ ద్విపాత్రాభినయం ఒక ప్రత్యేక ఆకర్షణ. ముఖ్య భూమికలను నాగభూషణం, చంద్రమోహన్, అల్లురామలింగయ్య, ఆరతి, సుమ, శాంత, వెంకటేశ్వరరావు ధరించారు, లక్ష్మీఫిలింస్ ద్వారా విడుదలయ్యే ఈ చిత్రానికి వి. యాచేంద్ర, భలేరావు నిర్మాతలు

## శారద ద్విపాత్రాభినయం!

'శారద' చిత్రంతో ఊర్వశి ఆంధ్రుల ఆడపడుచుగా స్వీకరించబడింది. ఆ చిత్రంలోని ఆమె నటనకు కన్నీరుగార్చిన కన్నెలు ఒక్కరా, యిద్దరా పేర్కొనడానికి. శారద చిత్రాలంటే ప్రజలు ఏదో ఆశించిపోయే పరిస్థితి ఏర్పడింది. తనపై ప్రేక్షకులు పెట్టుకున్న ఆశలకు అనుగుణంగా ఆమె పాత్రలను ఎన్నుకోవాలి అందుకే ఆమె ఒక గట్టి నిర్ణయాన్ని తీసుకుంది కథను విని, తనకు పాత్ర నచ్చినట్లయితేనే, ఆ చిత్రాన్ని అంగీకరిస్తుంది అలా ఆమె ఒప్పుకున్న చిత్రం ఒకటుంది. ప్రపథమంగా ద్విపాత్రాభినయం చెయ్యబోతూంది.

*ఏమిటా చిత్రం?*

సంఘపు దురాచారాలకు, దుష్ప్రచారాలకు బలి అయిన తల్లి, కూతుళ్ల కథ అది. కథను 'తాత—మనవడు' ఫేమ్ దాసరి వ్రాశారు మాటలను నారాయణరావు వ్రాస్తున్నారు, సినిమా అనుకరణకూడా ఆయనదే. ఇన్ని తనవైనప్పుడు, దర్శకత్వం ఆయన చేస్తేనే చిత్రం అనుకున్నట్లు వస్తుంది.

*కొత్తసంస్థ, పాతవాళ్లు*

ఈ సమస్యాత్మక చిత్రాన్ని నిర్మించడానికి పూనుకొంది శ్రీ లక్ష్మీనరసింహా ప్రొడక్షన్స్ ఈ సంస్థను మావుళ్లయ్య, రామతారకం స్థాపించారు. చిత్రనిర్మాణం వరకు అయితే వీళ్లు కొత్తవాళ్లే కాని చిత్ర పరిశ్రమలో ఐయిదారేండ్ల సంబంధం వుంది అనేక చిత్రాలను శ్రీకాకుళం గోదావరిజిల్లాలకు కొని ప్రదర్శించియున్నారు

*రాధమ్మ పెళ్లి!*

శ్రీ లక్ష్మీనరసింహా ప్రొడక్షన్సు నిర్మించ బూనుకున్న చిత్రానికి, 'రాధమ్మ పెళ్లి' అని పేరు పెట్టడం జరిగింది ఈ చిత్రానికి రమేష్ నాయుడు సంగీత సారధి. కథ, మాటలు, సినిమా అనుకరణ. దర్శకత్వంను దాసరి నారాయణరావు చేపట్టారు. కృష్ణ నాయకుడు. సెప్టెంబరునుండి షూటింగు.

## రెండవ భార్యగా శారద!

అనంతలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ నిర్మిస్తున్న 'ప్రేమలు—పెళ్ళిళ్లు' షూటింగు నిర్విరామంగా హైదరాబాదు సారధిలో జరుగుతూ ఉంది దగ్గుపాటి భాస్కరరావు తయారు చేసే ఈ చిత్రానికి ఆచార్య ఆత్రేయ రచయిత. ఈ చిత్రానికి విశ్వనాధన్ సంగీతాన్ని సెల్వరాజ్ ఛాయను, జి. వి. సుబ్బారావు కళను, మార్తాండ్ కూర్పును నిర్వహిస్తున్నారు. దర్శకత్వాన్ని వి మధుసూదనరావు చేపట్టారు

పై చిత్రంలో అక్కినేనికి యిద్దరు భార్యలున్నారు ఆయన రెండవ భార్యగా శారద నటిస్తుంది భార్యా భర్తలుగా శారదా నాగేశ్వరరావులు నటించడం ఇదే ప్రథమం ఆదర్శ గృహిణి పాత్ర ఆమెది. మొదటి షెడ్యూలు రష్ చూసిన వాళ్లు నాగేశ్వరరావు—శారదల జంట చూడ ముచ్చటగా ఉంది అని చెపుతున్నారు.

*జయలలిత పాత్ర ఏమిటి?*

'ప్రేమలు — పెళ్లిళ్లు' చిత్రంలో జయలలిత ఒక ముఖ్య పాత్రను పోషిస్తూంది. కథానాయకుడి మొదటి భార్య వేషం ఆమెది. చాలా కాలం తర్వాత అక్కినేని, జయలలిత దంపతులుగా నటిస్తున్నారు

*డాక్టరుగా నాగేశ్వరరావు!*

ప్రసిద్ధ నవల 'ప్రేమలు — పెళ్లిళ్లు' ఆధారంగా అనంతలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ నిర్మిస్తున్న అదే పేరుగాన్న చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు డాక్టర్‌గా పాత్ర పోషణ చేస్తున్నారు. మానసిక సంఘర్షణకు



'మైనర్ బాబు'లో వాణిశ్రీ, శోభన్ బాబు.

లోనైన క్లిష్టమైన వేషం ఆయనది. ఆయన్ను డాక్టరు గెటప్‌లో చూచి నాలుగు ఏండ్లు అయి ఉంటుంది. ఆయన డాక్టరుగా నటించిన అనేక చిత్రాలు లోగడ ఘన విజయాన్ని సాధించాయి. 'ప్రేమలు—పెళ్ళిళ్లు' చిత్రంలో ఎస్వీ రంగారావు, జి. వరలక్ష్మి, గీతాంజలి, శ్రీధర్, లీలారాణి ముఖ్య పాత్రధారులు. ఈ చిత్రం షూటింగు సెప్టెంబరుకల్లా పూర్తవుతుంది. అన్న పూర్ణా విడుదల

## అక్కినేని ధరించే రెండు వేషాలు!

'కథా నాయకుడు' చిత్ర నిర్మాత కె గోపాలకృష్ణకు 'నటసామ్రాట్' నటించడానికి అంగీకరించి అక్టోబరు నుండి కాల్ షీట్లు యిచ్చారు. ప్రతి నెలా పది రోజుల చొప్పున ఫిబ్రవరి వరకు తేదీలను కేటాయించారు అక్కినేని. ఈ చిత్రంలో నాగేశ్వర రావు వైవిధ్యమున్న రెండు వేషాలను ధరిస్తారు. ఈ చిత్రానికి కె. హేమాంబరధర రావు దర్శకుడు నాగేశ్వరరావు చిత్రాన్ని డైరెక్టు చెయ్యడం, ప్రత్యగాత్మ తమ్ముడైన హేమాంబరధరరావుకు ఇదే ప్రథమం. అక్కినేని చిత్రానికి రచన చేసే అదృష్టం యువ రచయిత గోపీని వరించింది. అలాగే సంగీత సారథ్యం చక్రవర్తికి లభించింది.

# సినిమా

## విఠలాచార్య చిత్రం

జూన్ 24 న, మధ్యాహ్నం మూడు గంటలకు వాహినీలో ప్రారంభమైంది మొదటి షెడ్యూలు 30 వరకు జరిగింది; ఈ షెడ్యూలులో రామారావు, కృష్ణంరాజు మిక్కిలినేని, బాలకృష్ణ, పండరీ బాయి, జయలలిత పాల్గొన్నారు. కథ తమిళంలో 'మురడన్ ముత్తు' పేరిట హిందీలో 'గోపి' పేరిట విడుదలైంది. ఆ కథకు బొల్లిముంతచేత మాటలను వ్రాయించారు. విఠలాచార్య. మహదేవన్ చేత పాటన్నీ రికార్డింగు జరిపించారు. ఈ చిత్రానికి అన్నదమ్ములు పని చెయ్యడం ఒక విశేషం.

ఆ అన్నదమ్ములు ఎవరనుకున్నారు? ఎన్నో చిత్రాలకు దర్శకత్వం వహించిన ఎస్. డి. లాల్, ఎంతో ప్రతిభావంతుడు అని పేరుతెచ్చుకున్న ఎస్. ఎస్. లాల్‌గార్లే. మొదటివ్యక్తి దర్శకత్వానికి, రెండవ వ్యక్తి ఛాయాగ్రహణానికి బాధ్యత స్వీకరించారు.

*జయలలిత అమ్మగా గిరిజ*

విఠలాచార్య నిర్మిస్తున్న చిత్రంలో జయలలిత కథానాయికగా నటిస్తోంది ఆమె తల్లిగా గిరిజ నటించడానికి అంగీకరించింది. హిందీలో లలితాపవర్ చేసిన వేషం వేషం ఆమెది.

చూశారా! కాల చక్ర మహాత్మ్యం ఒకనాటి కథానాయిక గిరిజ, యింతలోనే మరొక నాయిక తల్లిగా నటించవలసి వచ్చింది. గిరిజ శివాజీ, అక్కినేని, నందమూరిగార్ల సరసన నటించి యుంది. తర్వాత హాస్యం పై దృష్టి మరల్చింది. 'హాస్యబ్రహ్మ' రేలంగికి జంటగా చక్కగానే నటించింది. గతవారం ఆమెను చూడడం జరిరిగింది ఇప్పటికీ మంచి ఫాన్‌లో ఉంది అనిపించింది. నటిగా మళ్ళీ రాణించే అవకాశం ఉందామెకు.

*అన్నా, వదినలు!*

ఈ చిత్రంలో 'నటరత్న'కు అన్నయ్యగా ఎస్వీ రంగారావు, వదినమ్మగా అంజలీదేవి నటిస్తున్నారు. సహాయపాత్రలను రాజబాబు, సత్యనారాయణ, విజయలలిత పోషిస్తున్నారు. ఈ చిత్రం విజయా పిక్చర్స్ ద్వారా విడుదల అవుతుంది.

జగ్గయ్య, నాగభూషణం గార్లు తప్ప మిగతా వాళ్లందరూ విఠలాచార్య చిత్రాల్లో నటించి యున్నారు. హీరో లందరూ నటించిన విషయం పాఠకులకు తెలుసు. ఆయన మొదటి హీరో చలం. తర్వాత కాంతారావు. కృష్ణ, శోభన్, రామకృష్ణలు ఆయన దర్శకత్వంలో పని చేశారు. పెద్ద హీరోలు నాగేశ్వరరావు, రామారావు గార్లు ఆయనకు యెంతో సహకరించారు. క్యారెక్టర్ ఆర్టిస్టులు జగ్గయ్య, నాగభూషణం గార్లను మినహాయిస్తే, తదితరు లందరూ ఆయన చిత్రాల్లో ఏదో ఒక వేషం వేసి యున్నారు.

పరిశ్రమలో యిబ్బందులకు గురి అయిన వాళ్లు చాలామంది ఉన్నారు ఆలాటివాళ్లలో చాలామంది విఠలాచార్య సహాయాన్ని పొంది యున్నారు. కొందరు ఇంకా ఋణ పడి యున్నారు. అందుకే ఆయనకు కష్టం వచ్చినప్పుడు, పరిశ్రమ అంతా సానుభూతి చూపిస్తుంది.

## జయలలిత పరవశించింది

కల్లా లెరుగని పల్లె గుండెలో, ఎల్లలెరుగని ధర్మన్న చల్లని నీడలో పెరిగిన అందాల అమాయకపు కన్నె పిల్ల గౌరి. ప్రకృతి సహజ సిద్ధమైన పరుగుల సెలయేటి కెరటాలలో పరవశించి, తన చెలికత్తెలలాటి పక్షి పిల్లలతో పరుగులు తీస్తూ, మైమరచి



విజయా గార్డెన్స్‌లో జరిగిన 'బంగారుబాబు' శతదినోత్సవ దృశ్యం.

'కొమ్మమీద — కోయిలమ్మ
గొంతెత్తి పాడిందిలే
గుండెలోన — కోరికేదో
పడగెత్తి — ఆడిందిలే'—అంటూ మధు

రానుభూతులను చవి చూడసాగింది. 'కట్' అన్నారు దర్శకుడు లెనిన్‌బాబు. పల్లెపిల్లగా జయలలిత నటించింది. రవీంద్రా ఆర్ట్ పిక్చర్స్ వారి రంగుల చిత్రం 'డాక్టర్‌బాబు' చిత్రంలో ఈ దృశ్యం కనిపిస్తుంది.

నాయకుడు శోభన్ !

ఆమె నాయకుడు మనోనాధుడుగా శోభన్‌బాబు నటించారు. తమ్మారెడ్డి కృష్ణమూర్తి నిర్మించిన ఈ చిత్రానికి ఊటీ లొకేషన్సు కొత్త అందాన్ని ఇస్తుంది. ఈ చిత్రంలో చలపతిరావు సంగీతంలో ప్రత్యేకత వినిపిస్తుంది. ప్రతి పాట పదే పదే పాడుకునేట్టు సంగీతాన్ని సమకూర్చారు చలపతిరావు. ఈ చిత్రంలో రంగారావు, గుమ్మడి, జి. వరలక్ష్మి, విజయలలిత, రాజనాల, రాజబాబు, అల్లు రామలింగయ్య, లీలారాణి, నాగేష్, జగ్గారావు ముఖ్య పాత్రధారులు. మోదుకూరి జాన్సన్ మాటలను, కన్నప్ప ఛాయను, సూరన్న కళను, సంజీవి కూర్పును నిర్వహించారు లక్ష్మి విడుదల.

## రామారావుతో వద్దు !

'పౌరాణిక చిత్రాల్లో రామారావు గారి సరసన మీరు నటించవద్దు' అని హితవు చెప్పింది శ్రీమతి నాగేశ్వరరావు. 'శ్రీ కృష్ణార్జున యుద్ధం' చూచిన తర్వాత భర్తకు భార్య యిచ్చిన మంచి సలహా యిది. ఈ నిజాన్ని నటసామ్రాట్ వెల్లడించారు, 'బంగారుబాబు' శత దినోత్సవ సభలో.

మాదే పై చేయి !

'బంగారుబాబు' శత దినోత్సవ సభకు అధ్యక్షత వహించి, ఉపన్యసించిన నటరత్న అన్న మాటలు యివి. మా సినిమాలను ప్రేక్షకులు ఆదరించే వరకు మాదే పై చేయి అని ఆయన అన్నప్పుడు, విజయా నందనోద్యానం కరతాళ ధ్వనులతో మిన్ను ముట్టింది.

స్పెషల్ యిష్టం !

'నటి షావుకారు' జానకి అంటే నాకు స్పెషల్ యిష్టం. సుశీల పాటతో స్థిర మస్తుంది. జానకి నటనలో అంత తీపిదనం ఉంది. ఆమె ఉచ్ఛారణలో అంత కమ్మదనం ఉంది. సంభాషణలను ఎక్కడ, ఎలా విరిచి చెప్పాలో జానకికి బాగా తెలుసు. మేమిద్దరం కలిసి నటించిన చిత్రాలు తక్కువే అయినా అవి మాణిక్యాలు' అన్నారు 'బంగారుబాబు' కధానాయకుడు.

# సినిమా

*9 వంద రోజుల సినిమాలు!*

తీసిన గొప్ప సంస్థ జగపతి. ఇన్ని విజయవంతమైన చిత్రాలను నిర్మించిన అధినేతకు ఉన్నది ఎంత? మూడు లక్షలు మాత్రమే. డబ్బుకోసం మాత్రం కాదు. ఆయన చిత్రాలను నిర్మిస్తున్నది. 'మంచి చిత్రాలుతీశారు బాగా ఖర్చు పెట్టి తీశారు, హిట్ చిత్రాలు తీశారు' అన్న పేరుకోసమే. ఈ మాటలను 'బంగారుబాబు' సెట్లో నాగేశ్వరరావు అన్నారు.

*నాగేశ్వరరావుకు 22 ఏండ్లు!*

'బంగారుబాబు' సినిమాలో నాగేశ్వరరావును చూస్తే, ఆయనకు 22 ఏండ్లు అన్న భావం కలిగించింది. కాబట్టి ఆయన మరో 28 ఏండ్లు కథానాయకుడిగా నటించడం తథ్యం. 'ఆయనకన్నా ఒకటిన్నర ఏడు పెద్దవాడ్ని. మేమిద్దరం ఉన్నంత వరకు మాదే పై చేయి' అన్నారు, రామారావు.

*గర్వించదగ్గ నటుడు!*

'యావద్భారతం గర్వించ దగ్గ నటుడు రామారావు. వైవిధ్యమున్న పాత్రపోషణకు ఆయన పెట్టింది పేరు. పర్సనాలిటీతో బాటు వాయిస్, మాడ్యులేషన్ ఆయనకు ఉన్నాయి. పదేండ్లనుండి మనసులో దాచుకున్న మాటలు యివి' ఈ ప్రశంస అసాధారణ ప్రజ్ఞావంతుడు అయిన అక్కినేని నోటంట వచ్చింది.

## మైనరు జోరు తగ్గింది!

అసలే జోరుగా పోయే కారు; ఆ కారు అంత స్పీడుగా పోవడానికి కారకుడు మైనరు బాబు. కారు వేగంతోపాటు, అతని వయస్సు వేగం కూడా ఎక్కువైంది. అతగాడి వేగానికి తట్టుకోలేకపోయారు వీధిలో తిరుగాడే ప్రజలు. కన్నూ, మిన్నూ గానక అతడు కారు నడుపుతుంటే, అతడ్ని అటకాయించే ధైర్యం ఎవ్వరికీ లేకపోయింది. అతడికి అడ్డంగా నిలబడింది ఒక అందమైన పిల్లది. కారును కదపకుండా చేసింది. అతగాడ్ని ఉద్దేశించి,

'కారున్న మైనరు, కాలం
మారింది మైనరు, ఇక
తగ్గాలి మీ జోరు, మా
చేతికి వచ్చాయి తాళాలు'—అంటూ ఉడికించింది. మైనరుబాబు కుందేలు పిల్లయ్యాడు. బిత్తర బోయాడు. 'కట్' అన్నారు దర్శకుడు తాతినేని ప్రకాశరావు. ఈ దృశ్యం శ్రీ సారధి అండ్ టి. పి. ఆర్. కంబైన్సు వారి 'మైనరు బాబు' చిత్రంలో కనిపిస్తుంది. మైనరుబాబుగా శోభన్‌బాబు, అతడ్ని ఉడికించిన అమ్మాయిగా వాణిశ్రీ నటించారు.

'డిగ్నిటీ ఆఫ్ లేబర్' ముఖ్య అంశంగా తీసుకొని ప్రముఖ దర్శకుడు తాతినేని ప్రకాశరావు సృష్టించిన కథ యిది. మాటలను ఆత్రేయ, భమిడిపాటి వ్రాశారు. ఈ చిత్రానికి చలపతిరావు సంగీతాన్ని కె. ఎస్. ప్రసాద్ ఛాయను, ప్రసాద్, పాణి సహాయ దర్శకత్వాన్ని నిర్వహించారు. ముఖ్య పాత్రలను రంగారావు, గుమ్మడి, రాజబాబు, అల్లు రామలింగయ్య, రమణారెడ్డి, శ్రీధర్, మిక్కిలినేని, అంజలీదేవి, సూర్యకాంతం, లీలారాణి, సలీమా ధరించారు. నవయుగ విడుదల.

## అనిల్ ఆర్ట్స్!

'మైనరుబాబు' కథకుడు శ్రీ తాతినేని ప్రకాశరావు వ్రాసిన మరొక కథను అనిల్ ఆర్ట్స్ చలన చిత్రంగా నిర్మిసున్నారు. ఈ సంస్థను ఆయన మనవడు అనిల్ పేరిట స్థాపించడం జరిగింది. సినిమా అనుకరణ, దర్శకత్వం ఆయనే చేపట్టారు.

*గురువు స్విచ్ ఆన్!*

అనిల్ ఆర్ట్స్ షూటింగు జూన్ 25న, రాత్రి 8 గంటలకు ప్రసాద్ స్టుడియోలో ప్రారంభమైంది. తన గురువు, పూజ్యుడు అయిన ఎల్. వి. ప్రసాద్ గారిచేత స్విచ్ ఆన్ చేయించారు. విజయనిర్మల క్లాప్ కొట్టింది.

*కృష్ణ - విజయనిర్మల!*

ఈ చిత్రానికి భమిడిపాటి రచయిత. నాయికా నాయకులుగా విజయనిర్మల, కృష్ణ నటిస్తున్నారు. ఒక ముఖ్య పాత్రను ఎస్వీ రంగారావు పోషిస్తారు. ఆగస్టు అయిదు నుండి రెగులర్ షూటింగు ఆరంభం అవుతుంది, అన్నారు ప్రకాశరావు. ఈ చిత్రం తారకరామ ద్వారా విడుదలవుతుంది.

*మూడింట్లో భార్యాభర్తలు!*

నిత్య జీవితంలో భార్యాభర్తలుగా ఉన్న కృష్ణ, విజయ నిర్మల తెర జీవితంలో నాయకీ, నాయకులుగా నటిస్తున్నారు. విజయకృష్ణ ఫిలింస్ 'మీనా' ఒకటి; పద్మాలయా నిర్మించబోయే చిత్రం ఒకటి; అనిల్ ఆర్ట్స్ తీసే చిత్రం ఒకటి.

## లక్ష్మికి చీరె కట్టిన హీరో!

వన భోజనానికి లలితను తీసుకు వెళ్లడానికి చీర కట్టుకుని రమ్మన్నాడు ఏడుకొండలు. 'నాకు చీరె కట్టుకోవడం రాదు' అంది ఆధునిక యువతి లలిత. 'చచ్చాం, ఏం చేస్తాం, ఆ నాడు పదిమందిలో నీకు తాళి కట్టాను. ఈ వేళ ఎవ్వరికీ తెలియకుండా నీకు చీరె కట్టేస్తా' అన్నాడు ఏడుకొండలు.

ఏడుకొండలు మరదలు రంగమ్మ లలిత డ్రస్సు వేసుకొచ్చింది. ఏడుకొండలు ఆమెను కోప్పడ్డాడు. రంగమ్మ చిన్నబుచ్చుకుంది. ఏడుకొండలు ఆమెను ఓదారుస్తూ, చిలిపిగా—

'ఒసె వయ్యారి రంగీ, వగలమారి బుంగీ
ఊగిందే నీ నడుము ఉయ్యాల
ఆ పూపు చూస్తుంటే
నా నోవ లేకుంటే

పాడిందే నా మనసు జంపాలా'—అంటూ తన మరదలిని ఒక ప్రక్క, తన భార్యను ఒక ప్రక్క ఆనంద సముద్రంలో ముంచేత్తాడు ఏడుకొండలు. 'కట్' అన్నారు దర్శకుడు ప్రత్యగాత్మ. ఈ దృశ్యం ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి 'పల్లెటూరి బావ' లో కనిపిస్తుంది. ఏడుకొండలుగా నాగేశ్వరరావు, లలితగా లక్ష్మి, రంగిగా శుభ నటించారు.

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ నిర్మించిన మరొక ప్రయోజనాత్మక చిత్రం ఇది. 'చదువు, సంస్కారం పట్నపు చదువులవల్లనో, పట్నవాసము వల్లనో వస్తుందనుకోవడం పొరపాటు. పల్లె బాగ్లలోనూ, పల్లెజీవుల్లోనూ కూడా అలాంటివి అబ్బుతాయి' అనేడి నిజాన్ని చాటి చెప్పే కథ యిది. ఏ. వి. సుబ్బారావు నిర్మించిన ఈ చిత్రం నవయుగ ద్వారా విడుదల అవుతుంది

## కొత్త కాపురం !

ప్రసన్న లక్ష్మి పిక్చర్స్ నిర్మించే చిత్రానికి 'కొత్త కాపురం' అన్న పేరును స్థిర పరచినట్లు, నిర్మాత జి. వెంకటరత్నం చెప్పారు. కథను కళ్యాణ సుందర జగన్నాథ్ వ్రాశారు. మాటలను బొల్లిముంత రాస్తున్నారు.

*కృష్ణ, చంద్రకళ...*

ఈ చిత్రంలో కృష్ణ, చంద్రకళ జంటగా నటిస్తున్నారు. ముఖ్య పాత్రలను ఎస్వీ రంగా రావు, సూర్యకాంతం, రాజబాబు, రమాప్రభ, కృష్ణంరాజు, లీలారాణి పోషిస్తారు. సినిమా అనుకరణ, దర్శకత్వంను పి. చంద్రశేఖర రెడ్డి చేపట్టారు.

*కథను గూర్చి...*

దిక్కు, మొక్కు లేనివాడ్ని చేరదీసి, ఆదరించి, అభిమానించాడు ఒక వ్యక్తి. ఆయన్ని దేవుడిగా కొలుస్తూ, ఆయ కోసం ఆయన కుటుంబ సంక్షేమం కోసం అనుక్షణం అంకితమైన కథానాయకుడి జీవిత కథయే 'కొత్తకాపురం' చిత్రం. ఈ చిత్రానికి కె. వి. మహదేవన్ సంగీతాన్ని, మహేశ్వరరావు కూర్పును, చలం కళను, మరీయిరానీ ఛాయను నిర్వహిస్తున్నారు.

## కొత్త హీరోకి రెండవ ఆఫర్ !

'కన్నె వయసు' కథానాయకుడు లక్ష్మికాంత్‌కు మరొక చిత్రంలో నటించే అవకాశం లభించింది. డాబ్సన్ పిక్చర్స్ వారి 'అరంగేట్రం.' తెలుగుచిత్రంలో కథానాయిక ప్రమీల తమ్ముడి వేషం లక్ష్మికాంత్‌కి ఇవ్వడం జరిగింది. గుళ్ళపల్లి నాగేశ్వరరావు ఈ చిత్రానికి పి. డి. ప్రసాద్‌ను దర్శకుడిగా పెట్టుకొన్నారు. సమయస్ఫూర్తి ఉన్న వ్యక్తి నాగేశ్వరరావు. నమ్మకం లేనిదే యే పనీ తలపెట్టడు. తలపెడితే విజయం సాధిస్తాడు.

## జమున గుండెల్లో కొత్త వలపు !

అన్యోన్యంగా, నిత్య నూతనంగా దాంపత్య జీవిత మాధుర్యాన్ని చవిచూచే భార్యాభర్తల మధ్య ఎడబాటును ఏర్పరిచాడు, పుట్టించిన భగవంతుడు. అదే దేవుడు ఆ దంపతులను ఏకం చేశాడు. విడిపోయిన మనసులు, కలుసుకున్న దేహాలు ఎంత పులకరిస్తాయి, ఎంత ఆనందిస్తాయి. ఆ దంపతులు ఆనందసౌభాగ్యాన్ని డాక్టర్ నారాయణరెడ్డి యెంత అందంగా పాడిగారో.

'కొండెప్పైన, వెండి వాన
గుండెల్లో కొత్త వలపు కురిపించాలి
ఆ కొత్త వలపు కోరికలను పండించాలి

ఈ పాటను సుశీల, బాలసుబ్రహ్మణ్యం చేత తియ్య తియ్యగా, కమ్మ కమ్మగా పాడించారు సంగీత సారధి కోదండపాణి. ఇంత మంచి పాటకు ఎంతో చక్కటి ప్రదేశం అవసరం అనిపించింది దర్శకుడు హేమాంబరధర రావుకు 'ఇంటి దొంగలు' చిత్రం కోసం.

అందుకే కొడైకెనాల్‌కి వెళ్ళారు. అక్కడి సుందర ప్రదేశాల్లో పై పాటను చిత్రీకరించారు. ఎంతో సహజంగా నటించారు భార్యాభర్తలుగా పాత్ర పోషణ చేసిన జమున కృష్ణంరాజు.

*ఇంటి దొంగలు*

సుభాషిణీ ఆర్ట్ పిక్చర్స్ నిర్మించిన 'ఇంటి దొంగలు' త్వరలో పూర్ణా ద్వారా విడుదలవుతుంది. కథ, మాటలను భమిడిపాటి వ్రాశారు. ముఖ్య పాత్రలను సత్యనారాయణ, అల్లు రామలింగయ్య, నిర్మల పుష్పకుమారి, రావి కొండలరావు, విజయలక్ష్మి పోషించారు. ఛాయను శేఖర్, సింగ్, ప్రొడక్షన్ను మహేంద్ర, కూర్పును బి. గోపాలం కళను బి. ఎస్. కృష్ణ నిర్వహించారు.

## లలితా మూవీస్ !

ప్రముఖ నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావుగారి అల్లుడు చిరంజీవి ప్రసాద్ నెలకొలిపిన సంస్థపేరు యిది వీరు నిర్మించబోయే చిత్రానికి పి చంద్రశేఖరరెడ్డి దర్శకుడు

—శ్రీనివాస్ ●



'గాంధిపుట్టినదేశం'లో కృష్ణంరాజు, లత.

# డాక్టర్ సలహాలు

## డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

కె సాయి వరప్రసాద్, హైదరాబాద్—23

నాకు తరచుగా ముక్కు నుంచి రక్తం కారుతుంటుంది. దీనికి కారణము ఏమిటి? నివారణోపాయం తెలపండి

* ముక్కు లోపలి పొర వాయటం, బయటనుంచి లోనికి ప్రవేశించిన హానికర మైన వస్తువులు, ముక్కు లోపల ఏర్పడే 'పాలిప్'లు, ముక్కు బయట తగిలిన దెబ్బలు, శక్తి కొలదీ ముక్కులో గాలి పీల్చటం—వదలటం, సిఫిలిస్, డిఫ్తీరియా, అడినాయిడ్స్, రక్తనాళములు మ్యూకస్ పొర క్రింద పుండలు చుట్టుకొని ఉండటం బ్లడ్‌ప్రెషర్, రుమాటిక్ ఫీవర్, రక్తములో విటమిన్ 'కె' లోపం—తదితర మార్పులు, పొంగు, టైఫాయిడ్, ఇన్‌ఫ్లూయెంజా, మలేరియా మొదలగు అంటు వ్యాధులు ముక్కు లోనుంచి రక్తం కారటానికి కొన్ని కారణాలు

మీకు వున్న లోపాన్ని పైన చెప్పిన కారణాల దృష్ట్యా, తగిన వైద్య నిపుణులకు చూపించటం మంచిది

ఎస్ సుబ్బలక్ష్మి, రాజమండ్రి

చిగుళ్ళనుంచి రక్తం కారుతున్నది చిగుళ్లు వాచినట్లుగా వుంటాయి నొప్పి తరచూ వుంటుంది అప్పుడప్పుడు నోటి లోపల కూడ పుండ్లు ఏర్పడుతున్నాయి

* చిగుళ్ల నుంచి రక్తం కారటానికి, వాయటానికి విటమిన్ 'సి' లోపం ముఖ్య కారణం శరీరంలోనూ, తీసుకొనే ఆహారం లోనూ విటమిన్ 'సి' లోపించినప్పుడు ఇలా జరుగుతుంది నిమ్మ, నారింజ, బత్తాయి, వుసిరికాయలు మున్నగు వాటిలో ఇది ఎక్కువగా ఉంటుంది ప్రతి రోజూ ఆహారంలో విధిగా పండ్లను వాడాలి

నోటిలో ఏర్పడిన పుండ్లు బి కాంప్లెక్స్ విటమినుల లోపం వల్ల ఏర్పడతాయి పాలు, ఆకు కూరలు ముఖ్యంగా తీసుకోవాలి

సి రాఘవయ్య, విడవలూరు (కోవూరు)

కంట్లోపడిన నలుసు వెలుపలకి రాకుండా వుంటే కంటికి ప్రమాదమా ?

* కంట్లోపడిన నలుసునిబట్టి వుంటుంది ప్రమాదమున్నదీ లేనిదీ !

నలుసు గట్టిదయితే, (అంటే రాపిడీ కలిగించునది అయితే) కంటిలోని నల్లగుడ్డుపై గీతలు, చారలు ఏర్పరచి పుండుపడి — 'కార్నియల్ అల్సర్' రావచ్చును ఇలాంటి నలుసులలో ఇనపధూళి వరి నూర్పిడులప్పుడు వూక మొదలయినవి ముఖ్యము,

సి క్రిష్ణమూర్తి, విజయవాడ

నేను మాట్లాడితే బొంగురు గొంతుకతో మాట్లాడినట్లుంటుంది నా వయస్సు 15 సం లు

* ఈ వయస్సులో గొంతులో కొద్ది మార్పులు జరుగవచ్చును, ప్యూబర్టీ సమయంలో గొంతు మార్పు సహజం కానీ ఇలా ఇదివరకునుంచీవుంటే, 'ఇ ఎన్. టి' వైద్యులవద్ద 'వోకల్ కార్డ్స్' టెస్టు చేయించుకోవాలి 'హైపో థైరాయిడిసమ్' వున్నప్పుడుకూడా ఇలా రావచ్చును

బి విజయలక్ష్మి, అనంతపురం

నాకు, మా వారికి దూరపుచూపు తక్కువ ఇద్దరమూ కళ్ళజోడు వాడుతున్నాము మాకు 3 నెలల పాపవున్నది, ఈ దృష్టిలోపం మా పాపకికూడా వస్తుందా?

* మీ దృష్టిలోపాన్ని 'మయోపియా' అంటారు ఇద్దరికీ ఈ లోపం వున్నప్పుడు పుట్టిన పిల్లలకు తరచూ చూపు పరీక్ష చేయించడం అవసరం ఎక్కువగా—ఇద్దరికీ వున్నప్పుడు పిల్లలకి తొందరగా ఈ దృష్టి లోపం రావటానికి అవకాశము ఎక్కువ

వి సూర్యనారాయణ, హైదరాబాద్.

నాకు ముక్కుకి సంబంధించిన 'అడినాయిడ్స్' దీనివల్ల నాకు తరచూ ఇబ్బంది చేస్తోంది ముక్కులో ఒక ప్రక్కనే గాలి పీల్చ కలుగుతున్నాను ఇలా గత 7 సం లుగా బాధపడుతున్నాను

* 'అడినాయిడ్స్' అనే లింఫ్ గ్రంధులు ముక్కు లోపలి భాగములో వుంటాయి అవి పెరిగినప్పుడు, గాలిపోయే మార్గానికి అడ్డుపడతాయి

ఇలా జరిగినప్పుడు శస్త్ర చికిత్సద్వారా 'ఇ ఎన్ టి' సర్జన్లు, వీటిని తీసివేయ కలుగుతారు మందులువాడితే అవి తాత్కాలికంగానే పనిచేస్తాయి

ఎస్ రంగారావు, విశాఖపట్నం

గత 2 సం లుగా కడుపులో మంటతో బాధ పడుతున్నాను నెలకి రెండు సార్లు ఎక్కువగా వస్తోంది కొన్ని మందులు వాడాను తగ్గలేదు.

* కడుపులోను దాని క్రింద ఉన్నప్రేవు మొదటి భాగంలో పుండుగాని, లేక ఆ భాగములలోని మ్యూకస్ పొర వాచినప్పుడు గాని ఇలా రావటానికి అవకాశము ఉన్నది

ఆహారంలో కారము, పులుపు ఎక్కువగా ఉన్నప్పుడు, ఆహారమును ప్రతిరోజూ సకాలములో తీసుకోక పోయినప్పుడు, త్రాగుడు, ఎక్కువ ఊరగాయలు, మానసిక ఆందోళన, ఎక్కువగా పొగ త్రాగటం ఇలా రావటానికి కొన్ని ముఖ్య కారణములు

ఇలా వున్నవారు, తరచూ కొద్దికొద్దిగా ఆహారం తీసుకోవటం, ఎక్కువగా పాలు, మజ్జిగ, పండ్లువాడటం అవసరం పైన చెప్పిన ఇతర కారణములకుకూడా జాగ్రత్తలు తీసుకోవాలి అల్బిట్స్, ఆంటసార్బ్ వంటి మాత్రలు పూటకి ఒకటిచొప్పున మూడు పూటలు ఆహారానికి ముందు తీసుకోవాలి.


సీతారామాంజనేయ మూవీస్
నిండు కుటుంబం
నిర్మాత అమరా రామసుబ్బారావు
దర్శకత్వం: పి. సాంబశివరావు
సహకారనిర్మాత కొవిశెట్టి శివప్రసాద్
సంగీతం: ఎస్. రాజేశ్వరరావు
ఆంధ్ర శ్రీకల్యాణి పిక్చర్స్, నైజాం: పి.యస్.ఆర్. పిక్చర్స్,
సీడెడ్ విజయశ్రీ పిక్చర్స్, మైసూర్: యం.యస్. కంబైన్స్
విశాఖ-శ్రీకాకుళం-ఒరిస్సా: నార్త్
విశాఖపట్నం బర్మారి పాత్రియేట్స్ రిలీజ్
VIJAYA
STUDIO Roophale




శ్రీమతి వెల్మినేని
పొట్లశేషగిరిరావు

# మనసు – మానవత

వల్లని చీకట్లోకి దీర్ఘంగా చూస్తూ కూర్చున్నాను. టైమ్ పన్నెండు దాటుతున్నట్లు నా రేడియండైల్ వాచ్ చూపిస్తోంది. పచ్చని చెట్లతో ఎంతో సుందరంగా వుండే మాతోట ఈ సమయంలో చాలా భయంకరంగా వుంది. దానికితోడు వాతావరణం తుఫాను వచ్చే సూచనలు చూపిస్తోంది. నల్లని మబ్బులు ఆకాశాన్ని కప్పేశాయి. కొద్దిసేపట్లో భారీవర్షం పెనుగాలీ రావచ్చు. చీకటికి దెలికత్తెల్లా మామిడిచెట్లు, తలలు ఊపుతూ రాక్షసనృత్యం చేస్తున్నాయి. చీకటి పురుగులు చెవుల్ని చిల్లులు చేస్తున్నాయి. దూరంగా ఎక్కడో కుక్కల కొట్లాట వినిపిస్తోంది.

మామూలుగా పిల్లి అరిచినా భయపడే నేను, యింతధైర్యంగా ఒంటరిగా తోట మధ్యలో కూర్చున్నానంటే, అది నా గుండెల్లో మండుతున్న మంట, చంద్రపట్ల రగులుతున్న పగ, కారణం. వాడికి బుద్ధి చెప్పాలని, మంచి మార్గంలో పెట్టాలని ఎన్నోరకాలుగానో ప్రయత్నించి, విఫలురాలి నయ్యాను.

ఉదయం జరిగిన సంఘటన, నా కళ్ల ముందు రీలులా, తిరిగింది.

'చంద్రం! నీకాళ్లు పట్టుకుంటాను. జీవితకాలం నీక్రింద నౌఖరుగా వుంటాను. నా చెల్లెలి జీవితాన్ని నట్టేట్లో ముంచకు. నువ్విలాటి మోసానికి దిగజారావని తెలిసి అది నంచం పట్టింది!'

అది రాజారావు కంఠం. అతను బ్రతిమిలాడుతుంది దెవరినో తెలుస్తూనే ఉంది.

నాలో ఉత్సుకత రేగింది. కిటికీ ప్రక్క నిలబడి వినసాగాను.

చంద్రం పకపక నవ్వుకున్నాడు.

'చంద్రం! ఆ అమాయకురాలు ఆత్మహత్యకైనా వెనదీయదు. నా చెల్లెలు లేకుండా, నే నొక్కక్షణం బ్రతకలేను.'

'పీడాబోయే! యిద్దరికీ సరిపడా విషంకొని పంపనా?'

ఈ మాట చెవిన పడగానే నాలోని క్రోధిక్తతని ఆపుకోలేక పోయాను ఒక్క ఉదుటున గదిలోకి వచ్చి చంద్రాన్ని చంపా చెంపా వాయించాను. అతని చేతిలో బ్రాందీతో నిండిన గ్లాసువుంది. దాన్నిలాగి విసిరికొట్టాను. ఊహించని సంఘటనకి, మొదట బిత్తరపోయి, అంతలోనే తేరుకు, చంద్రం నాచేతులు రెండూ గట్టిగా పట్టుకుని, రాజారావు వైపు తిరిగి—'గెటవుట్' అంటూ అరిచాడు.

నేనేదో అనబోయేలోపలే రాజారావు అక్కడనుండి నిష్క్రమించాడు. వెళుతూ వెళుతూ అతను చూసిన చూపు నా గుండెలో పోట్లు పొడిచినట్లయింది.

'నీకేమైనా పిచ్చెక్కిందా మీనా?'—కోపంగా అడిగాడు చంద్రం.

'ఎక్కినా బాగుండేది. నువ్వుచేసే ఈ మనకార్యాలు తెలియకుండా, ఈ వేదన కలగకుండా బ్రతికేదాన్ని!'

'రాజారావు చెప్ప మాటలన్నీ నిజమనుకుంటున్నావా? వాడి చెల్లెలూ, వాడూ కలిసి మన ఆస్తికోసం వేసిన ప్లానది. పైగా ఆ దుర్గకి ఎంతోమందితో సంబంధం వుంది. అలాంటిదాన్ని పెళ్లి చేసుకోమంటాడు ఈ వెధవ.'

అప్రయత్నంగా 'ఛీ' అన్నాను.

'చూశావా మరి, వింటుంటేనే నీ కింత అసహ్యంగా ఉందా!– నా కళ్లారా ఎన్నో సంఘటనలు చూశాను...' యింకా ఏదో చెప్పబోతున్నాడు.

'షటప్' అరిచాను. 'ఛీ! ఛీ! నీలాంటి వాడికి తోడబుట్టినందుకు, ఈ క్షణానే చద్దామన్నంత అసహ్యంగా ఉంది. ఒడద్దాన్ని ఆ మాయికురాలిని చేసి, మోసంచేసింది చాలక, ఆ భాండాలు వేస్తావా? — రాజారావు అతని చెల్లెలు ఎలాంటి వాళ్లో నాకు బాగా తెలుసు! నిప్పుపట్టుకుంటే చేతులు కాలిపోయినట్లుగా ఆ అమ్మాయి జీవితాన్ని చెడగొడితే నీ శరీరం కుళ్లిపోతుంది. జాగ్రత్త'

చంద్రానికి బాగా కోపం వచ్చింది.

'మీనా నువ్వు నా విషయంలో జోక్యం కలగచేసుకోకు. చిన్నపిల్లని వెళ్లు వెళ్లి చదువుకో'—అన్నాడు టేబిల్ మీద బాటిల్ అందుకుంటూ!

అతని నిర్లక్ష్యానికి మండిపోయింది నాకు.

'అతను అనుభవిస్తున్న క్షోభ నీకెలా అర్థమవుతుందిరా! నీకూ ఆ అనుభవం జరిగితే గానీ తెలుసుకోలేవు' అన్నాను.

'నోర్ముయ్! ఊరుకుంటుంటే పెచ్చు మీరిపోతున్నావ్—' చంద్రం నామీద మొదటి సారిగా విసుక్కున్నాడు.

'చంద్రం—! ఎందరో అమ్మాయిల జీవితాలతో ఆడుకున్నావు. వాళ్ల ఉసురు పాపంలా నిన్ను చుట్టుకుని వుంది. దుర్గలాంటి ఉత్తమురాలిని భార్యగా చేసుకుంటే, ఆమె పుణ్యమైనా నిన్ను కాపాడుతుంది. నా మాటలు విన్నోసార్లు తేలిగ్గా తీసేశావ్. ఈసారికి మాత్రం అలా చెయ్యకు—' నచ్చ చెప్పబోయాను.

'నువ్వు యిలానే నన్ను సతాయిస్తుంటే వెంటనే ఏదోఒక సంబంధం చూసి నీకు పెళ్లిచేసి, పీడ వదుల్చుకుంటాను జాగ్రత్త' అంటూ మరోమాటకి అవకాశం యివ్వకుండానే, మెట్లెక్కి తన గదికి వెళ్లిపోయాడు చంద్రం.

అయితే ఈసారి కూడా నామాటలను పెడచెవిని పెట్టాడు. నేను యింత చెప్పిందంతా చెవిటివాడిముందు శంఖం ఊదినట్లయింది. అందుకే ఆ క్షణానే ఓ నిర్ణయానికి వచ్చాను. నౌఖర్ని కేకవేశాను. ఓ కాగితంమీద నాలుగు ముక్కలు వ్రాసి. రాజారావుకి యిచ్చి రమ్మన్నాను.

ధనమదంతో కళ్లకు పొరలుకట్టి మత్తు పానీయాల మజాలో, మనసూ, మానవతా విడిచి, పరమ కర్కోటకంగా, పచ్చి రాక్షసుడిలా ప్రవర్తించే ఈ చంద్రానికి కోరలు తియ్యాలి. ఆడది అంటే తన విలాసానికి ఉపయోగపడేది మాత్రమే, అనుకుని, ఆమె జీవితంలో నిప్పులుపోసి, తన క్షణిక సుఖాలకి, నూరేళ్ల జీవితాన్ని విలువనా కూర్చి పగలబడినవ్వే పరమ కిరాతకుడి పొగరు అణచాలి. డబ్బుతో దేన్నయినా కొనవచ్చు—ఆఖరికి గౌరవాన్నియి డబ్బే సంపాదించి పెడుతుందని భ్రమపడుతూ బ్రతికే ఒక కామాంధుడి కళ్లు పొడవాలి.

అన్నేమిటి, తమ్ముడేమిటి, అక్కేమిటి, చెల్లెలేమిటి—న్యాయం ముందు అందరం సమానమే! ఏ ధనాన్ని చూసుకుని విర్రవీగుతున్నాడో, అది గడ్డిపూచ విలువ చేయదని నిరూపించాలి.

నాలో ఉద్రేకం కట్టలు తెంచుకుని ప్రవహిస్తోంది. రక్తం సలసలా కాగిపోతుంది. క్రోధంవలన కణతలదగ్గర పచ్చని నరాలు ఉబ్బాయి. నా మనస్సు విశ్రాంతి లేకుండా ఆలోచిస్తోంది. కళ్లు మాత్రం ఎదురుచూస్తున్నాయి, ఏ చిటుకూ చప్పుడయినా చెవులు నిక్కబొడుచుకుంటున్నాయి. నాప్లాను సక్రమంగా నెరవేరుతుందో లేదో అని, అనుమానం ఒకమూల వేధిస్తోంది.

కొద్దిదూరంలో ఏదో జరజరా ప్రాకిన చప్పుడయింది. పామయి వుంటుంది— తేలిగ్గా ఊహించింది నా మనస్సు. భయమనేది కొన్ని ఆమడలదూరం పారిపోయినట్లయింది. పాముకాదు. పులి వచ్చి మీద పడినా, ఈ రోజు నా పని నెరవేరేవరకూ యిక్కణ్ణుండి కదల్ను.

ఎవరో నడుస్తున్నట్లు పసిగట్టాను. క్రమేణా అడుగుల చప్పుడు దగ్గరవుతుంది.

దగ్గరవుతున్న ఆ ఆకారాన్ని గుర్తించాను. అతన్ని ఏటువంటి సమయంలోనైనా యిట్టే కనిపెట్టగలను.

కృంగిపోవలసిన సమయంలో సయితం అంత టీవిగా ఎవరు నడవగలరు?—ఎంతటి హాలాహలాన్నయినా గుండెలమాటున గుప్తపరచి 'ఏమీ జరగనట్లు చిరునవ్వు ఎవరు చిందించగలరు?—మాటయిస్తే పిడుగులు పడ్డా అనుకున్న చోటుకి ఎవరైతే రాగలరు? ప్రపంచం తల్లక్రిందులైనా అతను వచ్చి తీరుతాడు. ఎన్నో సమయాలలో అతనితో సరదాగా కాలక్షేపం చేశాను. అతనికి యిష్టంలేకపోయినా; పార్కులకీ, సినిమాలకీ, లాక్కు వెళ్లాను.

'మీనా'............

మృదువుగా, గంభీరంగా ఎంతో హాయిగా ఉందతని పిలుపు, వెంటనే పలకాలని పించలేదు.

'మీనా—'

అబ్బ! ఎంత తీయగా పిలవగలడు. అతని కంఠంలో యింత మార్దవం ఎలా వచ్చిందో?—కాలేజీలో ఎంతోమంది వారాక కొరకు పడిగాపులు కాస్తుంటే, నేను మాత్రం కారుదిగుతూనే, రాజారావుకొరకు చుట్టూ వెతికేదాన్ని, కాలేజీ ఆవరణలో ఏ చెట్టు ప్రక్కనో చదువుకుంటూ కంటపడేవాడతను. 'హలో రాజా!' అంటూ పలకరిస్తే, ఉలిక్కిపడి తలెత్తి చూసేవాడు వెంటనే అతని పెదాలు చిరునవ్వు చిందించేవి 'గుడ్ మార్నింగ్ మీనా' అంటూ తిరిగి పుస్తకంలో దూరిపోయేవాడు.

'పలకవేం మీనా?'—దగ్గరగావచ్చి కాస్త కంగారుగానే అడిగాడు.

'కూర్చోండి' అంటూ ప్రక్కకి జరిగాను.

చిన్న నిట్టూర్పు వదులుతూ 'ఏకే మయినా పిచ్చి పట్టిందా మీనా?—ఈ అర్ధరాత్రపుడు నన్ను రమ్మని కబురు పెట్టిందెందుకు?—' అన్నాడు.

'క్షమించండి — కష్టం కలిగించాను.'

'అదిగాదు యిలాటి ప్రదేశంలో అందునా అర్ధరాత్రివేళ ఎవరైనా చూస్తే ఏమను కుంటారు?'—నసిగాడతను అతని మాటలు నాకు నవ్వు తెప్పించాయి.

'నేనన్నదానిలో తప్పుందా?'

'బోలెడంత'

ఆశ్చర్యంగా చూశాడు నావైపు, అవును మీలాటి ధనవంతులు తప్పులుచేసినా, ఒప్పులుగానే చెలామణీ అవుతాయి మరి. మాలాటివాళ్ళు మనుష్యులుగా కనిపించరు మీ కళ్లకి.'

అతను ఎవరిని ఉద్దేశించి అన్నదీ నాకు తెలుసు. యిందులో నాదోషం ఏమీ లేదు.

'జరిగిన అన్యాయంలో నా ప్రోద్బలం ఏమైనా ఉందనుకుంటున్నారా?'—అడిగాను.

అతను మాట్లాడలేదు.

'ఎంతసేపని నిలబడతారు కూర్చోండి.'

'ఫరవాలేదు'

'జరిగినదాన్ని గురించి విచారించటం తెలివితక్కువ — వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలి'—సంభాషణ దారిలోకి తేవడానికి ప్రయత్నించాను.

'మీనా! అన్యాయమో, అవమానమో, జరగకూడంది జరిగిపోయింది. యిప్పుడు నేను ఆవేశపడినా, ఆరాటపడినా, ఫలితం ఏమీలేదు నాచెల్లెలు మనసా వాచా చంద్రాన్ని భర్తగా నమ్మింది. నాగుబాము నోటికి

పాలించినట్టు తన సర్వస్వాన్ని ఒక్క శీలాతకుడికి బలిపెట్టుకుంది. వలపుగురూ నవ్వుతున్నా, పదిమంది లోలిగ్గా మాట్లాడుతున్నా, దుర్గ సహిస్తోంది. చంద్రం ఏనాటికైనా మారి తనని భార్యగా అంగీకరిస్తాడని నమ్ముతోంది. అతన్నేమి చేయమన్నావని నాదగ్గర ప్రమాణం చేయించుకుంది'—చివరిమాట అంటూ బరువుగా ఊపిరి వదిలాడు రాజా!

'మీరు పిచ్చి భ్రమ పడుతున్నారు. చంద్రం ఎంత దుర్మార్గుడో మీకు తెలియదు. దుర్గలాంటి అమ్మాయిలెందరో అతని కామాగ్నికి ఆహుతై పోయారు. మాయింటా వంటాలేని ఈ సిగ్గుమాలిన పనులు. ఈరోజీ స్నేహాలు, వీడికెలా ఒంటబట్టాయో అర్థం కావడంలేదు. అలాంటి వాడిని అన్నగా చెప్పుకోవడం సిగ్గుగావున్నా, తప్పనిసరై చెప్తున్నాను. దుర్గని చిట్టి పరిస్థితులలోనూ వాడు వివాహం చేసుకోడు. మనస్సు మార్చుకోడు. వాడలా పాపాలు చేస్తూ, వాటి మధ్యనే చిక్కుకుని ఆహుతైపోతాడు'—అన్నాను.

అప్పటివరకూ నిలబడివున్న రాజారావు శక్తిలేనివాడిలా నా ప్రక్కనే కూలబడిపోయాడు. నామాటలతో అతనిలో ఉన్న కొద్ది ఆశ నశించి వుంటుంది. రెండు చేతులూ తలలోదూర్చి పిచ్చిగా జుట్టు పీక్కుంటూ ఏదో గొణుక్కోసాగాడు.

అతన్ని ఆ పరిస్థితిలో చూసి నా మనస్సు జారిపోయింది. పరువే ప్రాణంగా, అభిమానమే ధనంగా చూసుకుంటూ, వాటిని పుష్కలంగా పొంది, ఆ ఇండదండలతో జీవిస్తున్న ఖరీదైన మనిషి అతను, వెనకాముందూ చూసుకోకుండా చంద్రం వలలో పడిపోయిన దుర్గమీద నాకు కోపం ముంచుకొచ్చింది.

కోటిలో ఒకడుగా దొరికే ఈ మనిషి కొరకు, నూటిలో ఒకదానిగా బ్రతికే నేను ఏమి చెయ్యలేనా?—ఏందుకు చెయ్యను-చేస్తాను. చేసి తీరుతాను. ఒక్క క్షణం. అతనితో గడిపితే చాలదూ, ఆక్షణాన్ని జీవితమంతా తలుచుకుంటూ బ్రతకగలను.

'రాజా!'

'ఏమిటి?' తలెత్తకుండానే అన్నాడు.

యింకా కొద్దిగా అతని దగ్గరకు జరిగాను. శరీరం కంపిస్తోంది, గుండె దడదడ లాడసాగింది. ఏ ఆడపిల్లా చెయ్యకూడనిపని చేయబోతున్నాను. కోరి కోరి కష్టాలను తెచ్చుకోబోతున్నాను.

రెండు శరీరాలు దగ్గరగా మరీ దగ్గరగా వున్నాయి అతనిదేమీ గమనించేట్టు లేదు. కాళ్ల మధ్య తల వాల్చుకుని ఏదో ఆలోచిస్తున్నాడు.

చిన్నప్పటినుంచీ, కలలు గంటూ ప్రోగాధికంగా పెంచుకున్న ఒక్కగానొక్క ముద్దుల చెల్లెలి బ్రతుకు, మొగ్గలోనే తుంచివేయబడితే ఏ అన్నమాత్రం సహించగలడు? అత్తవారింట్లో ఆరళ్లూ, అరమరికలు లేకుండా కాపురం చేసుకోవలసిన చెల్లెలు, పెళ్లి కాకుండానే తల్లి కాబోతుందని తెలిస్తే, ఏ అన్న తట్టుకు నిలబడగలడు?—ఆ అవమానాన్ని ఎలా భరించగలడు?—

యిదే స్థితి చంద్రానికి కలిగించాలి. పరువూ మర్యాద బజారుపాలై, పదిమందీ 'ఛీ' అంటుంటే, ఎంతడబ్బు వెదజల్లినా, ఎందరినోళ్లు మూయిస్తాడో చూడాలి. మొహం బయట పెట్టుకోకుండా చేయాలి. ఆవేదనతో క్రుంగి క్రుశించిపోవాలి. చేసిన పాపాలకి ప్రాయశ్చిత్తం అనుభవించాలి.

వణుకుతున్న నా చేతిని, రాజారావు భుజం మీద వుంచాను. నా స్పర్శకి తలెత్తి చూశాడతను. నాలో కలిగిన మార్పు, నా ఆలోచనలూ అతనికి అర్థంకావడంలేదు.

'రాజా! చంద్రంపైన ప్రతీకారం తీర్చుకోవూ?' అన్నాను. అర్థం కానట్టు నా ముఖంకేసి అయోమయంగా చూశాడు.

నా కంఠంలో సన్నని వణుకు పోతోంది.

'నీ వనుభవిస్తున్న క్షోభ తిరిగి అనుభవించాలి నీ చెల్లెలికి జరిగినదే, తిరిగి చంద్రం చెల్లెలికి జరగాలి'— అంత సిగ్గులేకుండా ఎలా మాట్లాడానో, నాకే తెలియదు. ఆ చీకటి అడ్డులేకపోతే ఈ మాట నానోట వచ్చేదికాదు.

అతనికి వెంటనే అర్థంకాలేదు. కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాడు. ఆ తరువాత అతనిలో ఏదో మార్పు వచ్చింది. అంత చీకట్లోనూ అతని కళ్లు మెరుస్తూ నన్ను తీక్షణంగా పరిశీలించడం గమనించాను.

'యిది ఆవేశంలోనూ, క్షణికోద్రేకంలోనూ అన్నమాట కాదు మిస్టర్ రాజా! మీ చెల్లెలి జీవితం బాగుచెయ్యడంకోసం, నా అన్నబుద్ధి మార్చడానికిగానూ, నేను ఈ నిశ్చయానికి వచ్చాను. ఆలస్యమయేకొద్దీ నేనూ, నా మనసూ ఎలా మారతామో డోంట్ వేస్ట్ దిస్ ఆపర్చునిటీ—' ఏదో పిచ్చిగా వాగాను. నేనున్నస్థితి మర్చిపోయి, నామాటలకు నాకే అర్థం స్ఫురించడం లేదు.

అతను ఆవేశంగా లేచి నిలబడ్డాడు. నా రెండు భుజాలు గుచ్చి పట్టుకుని పైకి

## కాఫీ మాత

పసుపు నుండి లవి పళ్ళు తోముకముందు
నీదు సేవజేతు నిజమ్ము నగాత
నిన్ను సాధువినంత నిరసి మెదురవును
కాఫీమాత నీకు కలుగుకుశుభము.

నీదు వరసగాచి నిన్నందులో వేసి
పంచదారవేసి పాలుబోసి
సేవ జేసినంత సేదదీరెడి మాత
కాఫీమాత నీకు కలుగు శుభము.

కప్పు సాసరులు కనులకింపుగా నిన్ను
సుప్రభాత మందు చూచినంత
నిశిశశిని శశి వోలె నిర్మలవదనమున్న
కాఫీమాత నీకు కలుగు శుభము.

ఇంటికి రెపుడు నిన్ను ఇల వేల్పుగా యెంచి
నీదు సేవ లేక నిదురలేవరు
అమ్మనైతివపుడె అమ్మమ్మలకు నీవు
కాఫీమాత నీకు కలుగు శుభము.

వంటపొయ్యి మీద వంటజేసెడితల్లి,
'శ్రీగణేశ' యనుచు చే నిన్ను
నప్పుడేమిలేక చప్పరించిన మీదట
పప్పుచేసరుగొట్టి పప్పు బోయు.

గంజి త్రాగుచుండ కాఫీవాగిండలో
కోటిపడగలెత్తు కోమటింట
కనుల వెలుగు నీవె కలియుగమందున
కరుణామూర్తి నమ్మ కాఫీమాత!

అమ్మలక్కలార! అత్మబంధువులార!
అన్నదమ్ములార! అప్పలార
కాఫీమాత సేవ కలియుగమందున
చేయకుంటిరేని చిచ్చెపట్టు!

—మంగళ్పల్లి వాసంతి.

లేపాడు. నేనేదో అయిపోతున్నాను నాకళ్ళు మూతలు పడ్డాయి.

'చంద్రం నా మంచిమాటలు నువ్వు చెవికెక్కించుకో లేదు. నీ కోసం నేను ఆహుతై పోతున్నాను—మరి నేను నీ చెల్లెల్ని గదూ' — మనస్సులోనే వెర్రిగా నవ్వుకున్నాను.

రాజారావు తీవ్రంగా నా మొఖంలోకి చూస్తున్నట్లున్నాడు. ఆలస్యం జరుగుతున్న కొద్దీ నాలోని పట్టుదల జారిపోయి పిరికితనం చోటు చేసుకుంటుంది.

'రాజా! సందేహించకు—కమాన్' అన్నాను.

నా చెంప ఛెళ్ళుమంది. ఎగిరి అంత దూరాన పడిపోయాను. అంతవరకూ బిగపెట్టుకున్నట్లు వున్న వాతావరణంలో కదలిక బయల్దేరింది. వర్షం గాలి ఒక్కసారిగా మొదలయ్యాయి. జరిగిందేమిటో అర్థం చేసుకునే లోపునే రాజారావు మాటలు, నా చెవుల్ని ఈదురుగాలిలా దూసుకుపోయాయి.

'ఛీ! నువ్వొక ఆడపిల్లవా?—కాదు. ఆ అన్నకి సరిగా చెల్లెలనిపించావు. యింత నీచమయిన ఆడదానివని కలలోనయినా తలంచలేదు. మీరు మనుష్యులుగాదు—పిశాచాలు. ఆడదానికి ఎంతో విలువైనదేదో, దాన్ని అతితేలిగ్గా పోగొట్టుకోడానికి సిద్ధపడ్డావ్ పైగా మామీద జాలిచూపిస్తూ. నటన నిజంగా నీకంత జాలివుంటే, ఆదుకోటానికి యింక మార్గమే లేకపోయిందా?— మూర్ఖుడు మూర్ఖంగా ప్రవర్తిస్తే ఆ దారికే నువ్వు నడిచి, యింకా అతనికి చెప్పే బుద్ధేమిటి?—మీ అన్నలాంటి మగవాళ్ళే ప్రపంచంనిండా ఉంటారని భ్రమపడకు—' అంటూ ఆగిపోయాడతను. రెండడుగులు నావైపు నడిచి—

'మీనా! నిజం చెబుతున్నాను. మొదట్నుంచీ, నిన్ను నా ఆరాధ్య దేవతగా గుండెల్లో నిలుపుకున్నాను. నాకు అందని చందమామ వని తెలుసుగనక నువ్వెంత చనువిచ్చినా, నేను మాత్రం దూరదూరంగానే ఉండిపోయాను. కానీ—కానీ—ఈనాటి సంఘటనతో నువ్వంటే నాకు అసహ్యంగా ఉంది నీ మొఖం చూడాలంటే సిగ్గుగావుంది జీవితంలో యింకెప్పుడూ నా కళ్ళబడాలని ప్రయత్నించకు—' అంటూ నన్ను చీకట్లో ఒంటరిగా వదిలేసి, పెద్ద పెద్ద అంగలతో వెళ్ళిపోయాడతను.

నేనలాగే చాలాసేపు వర్షంలో తడుస్తూ ఉండిపోయాను.

'యితనెలాంటి మనిషి?'— ఈ ప్రశ్న నా మెదడుని పురుగులా తొలుస్తోంది.

అంతకంతకూ పర్వతంలా పెరిగిపోతున్న అతని వ్యక్తిత్వం, నన్ను అల్ప ప్రాణిగా, అనామకురాలిగా దూరదూరంగా నెట్టి వేసింది.

అతను నన్నారాధించాడట — యిప్పుడు అసహ్యించుకుంటున్నాడట.

నాకెందుకో పెద్దగా నవ్వాలనిపించింది.

'మానవుడు దేవుడూ అంతే! వంచనని మన్నిస్తాడు. మంచిని వంచనగా తలుస్తాడు. యిది మానవ జీవితంలోని అంతర్నాటకం'

నేనొక నిర్ణయానికొచ్చాను.


చంద్రాన్ని ఒకే ఒకమాట అడగాలి. సర్వైన సమాధానమిస్తే సరేసరి! లేకపోతే......

చకచక నడుచుకుంటూ యింటివైపు బయల్దేరాను. మా పెద్దమేడ అనాథలా, ఒంటరిగా, పట్టుబడ్డంగా, నిదురపోతూ కనిపించింది. గూర్ఖా కునికిపాట్లు పడుతున్నాడు. వాళ్ళో నౌకర్లంతా నేలని కరుచుకుని గదుల్లో వున్నారు. మెట్లకెదురుగా అలంకరించబడిన నా తల్లిదండ్రుల పెద్దఫోటో దీనంగా నాకేసి చూసినట్లుంది.

ఒక్కక్షణం అక్కడ నిలబడి స్వర్గంలో వున్నవాళ్ళని క్షమించమని కోరాను.

చంద్రం గది తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. వెలుపలి బెడ్‌లైట్‌కాంతి తలుపుల సందులద్వారా కనబడుతోంది. మెల్లగా తలుపులు నెట్టుకుని లోన ప్రవేశించాను. ఖాళీబెడ్ నన్ను వెక్కిరించింది. బహుశా నిద్ర పట్టక ఎక్కడికయినా వెళ్ళుంటాడు. యిప్పుడో యింకాసేపటికో వచ్చేస్తాడు సోఫాలో కూర్చుంటూ చుట్టూ పరిశీలించాను. వాడి గదిలోకి ఎప్పుడోగాని నేను రాను. ఇప్పుడేం ఘోరం చూడవలసి వస్తుందో అనే భయమే, నన్ను ప్రాంతం చేరనివ్వదు.

చంద్రానికి విచిత్రమయిన గుణముంది. వాడికి ప్రపంచంలోని ప్రతి ఆడపిల్లా, తన



# మనసు-మానవత...

కొంకె పుట్టించబడ్డట్లూ, చిన్న చిన్న పిల్లలు సహితం వాడి కంటికి ఆరిందాల్లానే కనబడేవారు. ఒక్క నేనుమాత్రం పద్దెనిమిదేళ్ళు వచ్చినా వాడి కంటికి పసిపిల్లనే! నామీద విపరీతమైన ప్రేమవాడికి. అయితేనేం, ఆ గుణాన్ని, ఏ ప్రేమా మార్చలేకపోయింది.

అద్దాల బీరువాలో అందంగా పేర్చబడిన ముత్యాలసీయాలు, నా కళ్లల్లో నిరుపుని పెంచాయి. గది గోడలకి తగిలించివున్న ఆయిల్ పెయింటింగ్స్ చూస్తూవుంటే రోతనిపించింది. వాడికి వున్న వికారాలన్నీ బొమ్మల రూపంలో నగ్నంగా నాట్యం చేస్తున్నాయ్!

యిన్నాళ్ళుగా వాడి ఆగడాలు వింటూ, చూస్తూ, మూగగా వుండిపోయాను ఈ వేళ నాలోని సమస్త శక్తులూ విజృంభించాయి. అన్నగా చంద్రానికిచ్చిన విలువా, ప్రేమ అన్నీ నశించాయి. వాడిని గుడ్డి చెయ్యడమో, బ్రతక్కుండా చెయ్యడమో, ఈ రోజుతో తేలిపోవాలి.

చాలా సేపయినా చంద్రం రాలేదు. టైమ్ చూశాను. నాలుగయింది మానసికంగా బాగా అలసి వున్నానేమో సోఫాలో వెనక్కివాలి, మండుతున్న కళ్లని మూసుకున్నాను.

* * *

కిటికీగుండా ప్రసరిస్తున్న తీక్షణమైన సూర్యకిరణాలు మీదబడి చురుక్కుమనిపించి కళ్లు విప్పాను. టైమ్ చూస్తే పదయింది. అంటే రాత్రినుంచీ చంద్రం ఇంటికి రాలేదన్నమాట. క్రిందినుండీ ఏదో కలకలం వినబడుతోంది. బంధువులు ఎవరైనా వచ్చారేమో?

రాత్రి జరిగిందంతా ఒక్కసారి గుర్తుచేసుకున్నాను. రాజారావు గుచ్చి పట్టుకున్న నా రెండు భుజాలూ ఏదో పవిత్రత పొందినట్లనిపించింది. కాస్త గట్టిగా పట్టుకున్నాడేమో, కుడిభుజం కొద్దిగా నొప్పి పెడుతుంది. ఎడంచేత్తో భుజం ఒత్తుకుంటూ లేచి నిలబడ్డాను.

ఎదురుగా గుమ్మంలో చంద్రం ప్రత్యక్షమయ్యాడు. ఏదో అందామని నోరు తెరవబోయానుగాని, ఆశ్చర్యంతో నోరు అప్రయత్నంగానే తెరుచుకుంది.

చంద్రం ఒక్కడేగాదు — అతని ప్రక్కన దుర్గ నిలబడివుంది: యిద్దరి మెడలలో పూలదండలున్నాయి. చంద్రం మొహంలో, నేనెన్నడూ చూడని తృప్తి, చిరునవ్వు రూపంలో వెలుగుతోంది. దుర్గ బిడియం వల్ల కళ్ళు వాల్చుకుని, నేలచూపులు చూస్తోంది.

కళ్లు నులుముకుని మళ్ళీ చూశాను. భ్రమకాదు నిజం నాఎదురుగా, వాళ్ళిద్దరూ పార్వతీ పరమేశ్వరుల్లా వెలిగిపోతున్నారు.

దుర్గ నాకాళ్ళకి నమస్కారం చేసుబోతే తేరుకుని చప్పున ఆమెని హృదయానికి హత్తుకున్నాను.

'వదినా! మీరు నాకు నమస్కరించకూడదు' అన్నాను.

'ఈ వదిన పదానికి అర్హత కలిగించింది మీరే! మీరు లేకపోతే నేనీ యింటినీడని కూడా చేరలేను' అంది దుర్గ. ఆమె కళ్ల వెంట నీళ్లు కారుతున్నాయి.

చంద్రం,—కాదు-కాదు— నా అన్నయ్య కళ్లనుండిగూడా జీవితంలో మొదటిసారిగా రెండు కన్నీటి బిందువులు రాలాయి. ఆ రెండు బిందువులు అతని పాపాలన్నిటినీ తమవెంట లాక్కుపోయిఉంటాయి. నాదగ్గరగా వచ్చి అంటున్నాడు — 'మీనా! నీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేను. నన్నొక మనిషిని చేశావు. నా మనస్సుకి మానవత్వాన్ని ప్రసాదించావు. రాత్రి తోటలో జరిగిన సంఘటన, నన్ను పూర్తిగా మార్చివేసింది.'

నాకళ్లు తృప్తిగా మూసుకున్నాను.

'మీనా! మనస్ఫూర్తిగా నాకింతో యిష్టం కానీ ఈ సంఘటనతో నిన్ను ప్రేమించుకుంటున్నాను' — ఎక్కడో దూరంగా, అస్పష్టంగా మనస్సు నాక్రమిస్తుకొంటున్నాయి, రాజారావు మాటలు—ఒకవైపు చేదు, మరోవైపు తీపి.

అప్రయత్నంగా టేబిల్ సొరుగు లాగి పిస్టల్ తీశాను. క్షణకాలంలో నా జీవితం ముగిసిపోయేదేగానీ, బిత్తరపోయిన చంద్రాన్ని ఒక్కనెట్టు నెట్టుకుని నా దగ్గర కొచ్చిన వ్యక్తి, నాచేతిని విసురుగా నెట్టేశాడు. పిస్టల్ ఎగిరెళ్లి అంతదూరాన పడిపోయింది.


'మీనా!—మీనా!' అంటూ కంగారుగా నన్ని లోకానికి తేవడానికి ప్రయత్నిస్తున్న ఆ వ్యక్తి మరెవరోకాదు — నా రాజా!

# వాసర వాసిని శ్రీ జ్ఞాన సరస్వతి

వ్యాసమహర్షి దక్షిణాపథానికి యాత్ర మీద వచ్చినప్పుడు గౌతమీ పావన తరంగిణీ తీరంలో పవిత్రమయిన వాసర క్షేత్రాన్ని చూసి ముగ్ధుడయ్యాడు. అక్కడ తపస్సు చేశాడు. ఆ బ్రాహ్మీ క్షేత్రంలో బ్రాహ్మీ శక్తి అయిన మహాసరస్వతీదేవిని ప్రధానదేవిగానూ, మహాకాళి, మహాలక్ష్మిని శక్తులని సహదేవతలగాను ప్రతిష్ఠించాడు. ఇదంతా బ్రహ్మాండ పురాణంలో ఉంది.

## చదువుల బండ

ఆలయానికి ఎదురుగా ఒక గుట్ట. ఈ గుట్ట మీద వ్యాసాది మహర్షులే కాక ఈ మధ్యకాలంలో నరహరి మల్హారియనే మహారాష్ట్ర కవి కూడా తపస్సు చేశారు, అష్టసిద్ధులను, మోక్షాన్ని పొందారు.



ఆలయం

గుట్టకి అవతల నిరాయకడి గుడి ఉంది. ఒక ఎత్తు ప్రదేశం మీద చతురస్రాకారపు బండ ఒకటి ఉంది. ఇదే చదువుల బండ. ఆ బండకి నాలుగు దిశలా మన చెవి ఆన్చి వింటే ఋక్, యజుర్, అథర్వ, సామవేదాల స్వరాలు వినపడుతాయని వేదపండితుల అంటారు. వాసరకి వచ్చే భక్తుల సంఖ్య ఇంతా అంతా కాదు. ఆదిశంకరులు 12 ఏళ్ళు శృంగగిరి క్షేత్రంలో తపస్సు చేసి శుద్ధ సాత్వికమూర్తి శారదామ తల్లిని అక్కడ ప్రతిష్ఠించారు. అలాగే కాశ్మీరంలోని శ్రీనగర్‌లోను, అజ్మీర్ సమీపంలోని పుష్కరక్షేత్రంలోను సరస్వతీ విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఆదిశంకరులు రచించిన సరస్వతీ స్తోత్రాలు, అపరాధ క్షమాపణ స్తోత్రం నేటికీ వాసరలోని అమ్మవారి ఆలయంలో అర్చకులు నిత్యమూ పఠిస్తూ ఉంటారు.

ఈ ఆలయం శిథిలం అయిపోగా విద్యారణ్యులవారు పునరుద్ధరించారు. రోహిల్లాలను ఎదిరించి అమ్మవారలను కాపాడిన వీర మక్కాజీ విగ్రహం దేవాలయంలోనే ఉంది.

వ్యాసుడు తపస్సు చేసిన స్థలం వ్యాసపురి అయింది. అదే వాసరమై నేడు 'బాసర్'గా చెలామణి అవుతోంది.

అదిలాబాదు జిల్లాలోని భైంసా తాలూకాలో ఉన్న ఇక్కడికి రైలుమార్గం ఉంది. నిర్మల్ నుంచి బస్సుమీదుగా కూడా పోవచ్చు. గోదావరినది నిజామాబాదు, అదిలాబాదు జిల్లాలకి మధ్య ఉంది.

## జీర్ణోద్ధరణ

10 సంవత్సరాల కిందట శృంగేరీ పీఠం అధిపతులు శ్రీ మదభినవ విద్యాతీర్థస్వాములు వారి ఆంధ్రప్రదేశ్ పర్యటనని ఇక్కడ నుంచే మొదలుపెట్టారు. ఈ క్షేత్ర జీర్ణోద్ధరణ కార్యక్రమం ప్రారంభించారు. క్షేత్రోద్ధరణకు శ్రీ పి. వి. నరసింహారావు గారి అధ్యక్షతన కొంతకాలం కిందట ఏర్పడిన సంఘం చురుకుగా పని చెయ్యవలసిన అవసరం చాలా ఉంది.



మహాసరస్వతి

ఈ మహాసరస్వతి ఆంధ్రుల ఇంటి కోడలయితే మహారాష్ట్రుల ఇంటి ఆడపడుచు! అర్చకులు మహారాష్ట్రులే. చైత్రమాసంలో దిగంబర పాఠక కుటుంబంవారు ఈ అర్చన చేసే వంతు వచ్చింది.

మహారాష్ట్రలో అవధూత శ్రీ దత్త గురుపాదుకా పూజ పురాతనకాలంనుంచి సంప్రదాయంగా వస్తోంది. శివరాత్రి, నవరాత్రి పండుగలలో అమ్మవారికి విశేషోత్సవాలు జరుగుతాయి.

ప్రజలకు భాగ్య సంపదలను ఇచ్చే పోచంపాడు ప్రాజక్టు ఇక్కడికి 50 మైళ్ళ దూరంలోనే ఉంది.

—రామశర్మ

# గుప్పిళ్ల కథ



## ముగ్గురు మూర్ఖులు

మహేష్

'ఉత్తరప్రదేశ్ వ్యవహారంలో ప్రతిపక్ష నాయకులు, విమర్శకులు రకరకాల విమర్శలు చేస్తున్నారు కాని వారిలో చాలా మంది ఒక ముఖ్యమైన విషయాన్ని మరచిపోతున్నారు' అన్నాడు చిదంబరం.

'ఏమిటా ముఖ్యవిషయం?'

'ఉత్తరప్రదేశ్‌లో కమలాపతి త్రిపాఠీ నాయకత్వం క్రింద ఉన్నదీ కాంగ్రెసు ప్రభుత్వమే. కేంద్రంలో ఇందిరాగాంధీ నాయకత్వం క్రిందఉన్నదీ కాంగ్రెసు ప్రభుత్వమే. రాష్ట్రసాయుధ పోలీసుదళాల తిరుగుబాటు సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైపోయింది కాబట్టి కేంద్రం ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్రపతి పరిపాలనను విధించింది. అంటే రాష్ట్రంలో శాంతిభద్రతలను నెలకొల్పడం కోసం కేంద్రంలో ఉన్న కాంగ్రెసు ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న కాంగ్రెసు ప్రభుత్వాన్ని రద్దుచేయడానికి యెంతమాత్రమూ సందేహించలేదు. కాంగ్రెసుపార్టీ దేశం క్షేమం కోసం పక్షపాత రహితంగా వ్యవహరిస్తున్న దనడానికి యిది నిదర్శనం కాదా? కాంగ్రెసు పార్టీ విజ్ఞాయుతికి యింతకంటే ఉదాహరణ యింకేం కావాలి?' అని అడిగాడు చిదంబరం.

'ఉత్తరప్రదేశ్ విషయంలో కాంగ్రెసు పార్టీ చాలా విజ్ఞాయుతిగా వ్యవహరించిందని నువ్వు చెప్పగానే నాకు గుప్పిళ్ళకథ గుర్తుకువచ్చింది' అన్నాడు చూడామణి.

'ఏమిటా గుప్పిళ్ళకథ?' అని చంద్రావు ప్రశ్నించగా చూడామణి చెప్పడం ప్రారంభించాడు.

'ఒక కుర్రవాడు తండ్రితోకలిసి బటానీల కొట్టువద్దకు వెళ్ళాడు. ఆ కుర్రవాని తండ్రికి బటానీలకొట్టు యజమానికీ బాగా పరిచయం ఉంది అందుచేత కొట్టు యజమాని 'బాబూ! ఒక గుప్పెడు బటానీలు తీసుకో!' అని కుర్రవానితో చెప్పాడు. కాని కుర్రవాడు సిగ్గుపడ్డాడు. కొట్టు యజమాని గుప్పెడు బటానీలు తీసుకొమ్మని రెండుమూడుసార్లు చెప్పినాకూడా ఆ కుర్రవాడు సిగ్గుపడి ఊరుకున్నాడు కాని బటానీలు తీసుకోలేదు. అప్పుడు కొట్టుయజమానే గుప్పెడు బటానీలు తీసి కుర్రవాని జేబులో పోశాడు. వెంటనే కుర్రవాడు సంతోషంగా ఒక్కొక్క బటానీ తీసుకొని తినడం ప్రారంభించాడు.

కొట్టువద్దనుంచి తిరిగి వస్తున్నప్పుడు తండ్రి 'యేం బాబూ! బటానీలంటే నీకు యిష్టమే కదా! అతను తీసుకొమ్మంటే యెందుకు నువ్వు తీసుకోలేదు?' అని అడిగాడు.

'నాన్నా! అతను గుప్పెడు బటానీలు తీసుకోమన్నాడు నా గుప్పెడు చిన్నదికదా! అందుచేత నేను తీసుకొంటే కొంచెం బటానీలే వస్తాయి. అతనిది పెద్ద గుప్పెడు కాబట్టి అతను యిస్తే యెక్కువ బటా-

సీలు వచ్చాయి. అందుచేత నేను తీసుకోలేదు' అని కుర్రవాడు సమాధానం చెప్పాడ' అంటూ మాడామణి గుప్పిళ్ళ కథను వివరించాడు.

'నువ్వు చెప్పిన గుప్పిళ్ళకథ బాగానే ఉంది కాని దానికీ, ఉత్తరప్రదేశ్ విషయంలో కాంగ్రెసుపార్టీ వ్యవహరించిన తీరుకూ సంబంధం యేమిటి?' అని ప్రశ్నించాడు చిదంబరం.

'రమారమి యింకొక ఏడు నెలల్లో ఉత్తరప్రదేశ్‌లో అసెంబ్లీ యెన్నికలు జరగబోతున్నాయి. కమలాపతి త్రిపాఠీ మంత్రివర్గం సమర్థవంతం కాదని తేలిపోయింది. కాబట్టి ఆ మంత్రివర్గమే యెన్నికలు జరిగే వరకూ అధికారంలో ఉంటే అసెంబ్లీ యెన్నికల్లో తన అభ్యర్థులు పూర్తిగా ఓడిపోవచ్చునని కాంగ్రెసుపార్టీ భయపడింది. అసెంబ్లీ యెన్నికల్లో ఓడిపోతే, కాంగ్రెసుపార్టీ అయిదేళ్ళపాటు అధికారాన్ని కోల్పోవలసి వస్తుంది. అందుచేత కమలాపతి త్రిపాఠీ మంత్రివర్గాన్ని తొలగించి రాష్ట్రపతి పరిపాలనను విధిస్తే పరిపాలన కొంతవరకు బాగుపడవచ్చును. అప్పుడు కాంగ్రెసుపార్టీ యెన్నికల్లో గెలవవచ్చునని కాంగ్రెసు అధిష్ఠానవర్గం భావించింది. కాబట్టి యింకా రమారమి ఆరుమాసాలపాటు అధికారంలో ఉండే త్రిపాఠీ మంత్రివర్గంచేత కాంగ్రెసు అధిష్ఠానవర్గం రాజీనామా చేయించింది. ఈ పరిస్థితిలో అయిదేళ్ళపాటు ఉండే అధికారంకోసం ఆరునెల్లపాటు ఉండే అధికారాన్ని వదులుకొన్న కాంగ్రెసుపార్టీకీ— పెద్దగుప్పెడు బటానీలకోసం చిన్నగుప్పెడు బటానీలు తీసుకోని కుర్రవానికీ తేడా యేమిటి?' అని ప్రశ్నించాడు మాడామణి.

'అసెంబ్లీలో కమలాపతి త్రిపాఠీకి పూర్తి బలం ఉంది అయినా అక్కడ జరిగిన రాష్ట్రసాయుధ పోలీసుదళాల తిరుగుబాటు కారణంగా కాంగ్రెసు అధిష్ఠానవర్గం త్రిపాఠీచేత రాజీనామా చేయించింది. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ యిప్పుడు ఉన్నవి కాంగ్రెసుపార్టీ ప్రభుత్వాలే కాబట్టి దీన్ని ఆ పార్టీ అంతరంగిక వ్యవహారంగా భావించవచ్చును కాని ముమ్ముందు కేంద్ర ప్రభుత్వం ఉత్తరప్రదేశ్ వ్యవహారాన్ని ఆధారంగా తీసుకొని, రాష్ట్రాల్లో ఉన్న కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని తొలగించే ప్రమాదం ఉన్నది' అన్నాడు శేషన్నలావు.

'అవును యిలాగే ఒక కుర్రవాడు యిద్దరు చిన్నపిల్లలను యేమార్చి మిఠాయి తినేశాడు కదా!' అన్నాడు మాడామణి.

'ఏమిటా కుర్రవాని కథ?' అని చిదంబరం ప్రశ్నించగా మాడామణి చెప్పడం ప్రారంభించాడు.

'ఇద్దరు చిన్నపిల్లలు ఒకచోట బొమ్మలు, పుస్తకాలు, మిఠాయి పెట్టుకొని ఆడుకొంటున్నారు. అక్కడకు కొంచెం పెద్ద కుర్రవాడొకడువచ్చి మిఠాయి చూశాడు. ఆ మిఠాయి తినెయ్యాలని ఆ కుర్రవాడు అనుకొన్నాడు కాని తాను మిఠాయి తీసుకొంటే ఆ పిల్లలు యేడుస్తారు. తరువాత పెద్దవాళ్ళు వచ్చి తనను కొడతారు అని ఆ కుర్రవాడు గ్రహించి ఒక యెత్తు ఆలోచించాడు.

ఆ కుర్రవాడు చిన్నపిల్లల దగ్గర కూచొని కొంచెంసేపు మంచి మాటలు చెప్పిన తరువాత 'ఈ కుక్కబొమ్మ తినెయ్యనా?' అంటూ ఒక్క బొమ్మ చేతికి తీశాడు.

చిన్నపిల్లలు 'తినెయ్య' మన్నారు.

అప్పుడా కుర్రవాడు కుక్కబొమ్మను నోటిదగ్గర పెట్టుకొని తిన్నట్లుగా నటించి, కుక్కబొమ్మను తిరిగి యిచ్చివేశాడు.

చిన్నపిల్లలు అది చూసి 'కిలకిల' నవ్వారు.

'తరువాత— కుర్రవాడు 'ఈ పుస్తకం తినెయ్యనా?' అంటూ ఒక పుస్తకం తీశాడు.

'తినెయ్య'మన్నారు పిల్లలు.

కుర్రవాడు దాన్నికూడా నోటిదగ్గర పెట్టుకొని తిన్నట్లుగా నటించి, తిరిగి యిచ్చేశాడు.

ఆ తరువాత కుర్రవాడు 'ఈ మిఠాయి తినెయ్యనా?' అంటూ మిఠాయి ఉండ తీశాడు.


'మామూలుగా తిరిగి యిచ్చేస్తాడు కదా!' అనుకొని పిల్లలు 'తినెయ్య' మన్నారు.

వెంటనే ఆ కుర్రవాడు మిఠాయి నోట్లో వేసుకొని తినేశాడు.

'మా మిఠాయి తిరిగి మాకిచ్చెయ్య' మని పిల్లలు అడిగారు.

'మీరే తినెయ్యమన్నారు కదా!' అని చెపుతూ కుర్రవాడు అక్కడనుంచి వెళ్ళిపోయాడు' అని మాడామణి కుర్రవాని కథచెప్పి యింకా యిలాగ అన్నాడు.

'ఆ కుర్రవాడు చిన్నపిల్లల్ని యేమార్చి మిఠాయి తినేసినట్లుగానే, కేంద్రప్రభుత్వం ఉత్తరప్రదేశ్ వ్యవహారాన్ని ఉదాహరణగా చూపిస్తూ ముమ్ముందు కాంగ్రెసేతర ప్రభుత్వాల్ని తొలగించే ప్రమాదం ఉంది కాబట్టి ఈ విషయాన్ని ప్రజలు జాగ్రత్తగా ఆలోచించవలసి ఉంది.' ●



# భారతదేశం లోని రాష్ట్రాలు భాషాప్రయుక్త రాష్ట్రాలా?

1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు దేశానికే పెద్ద ప్రమాదం వాటిల్లిందని కొందరు తలచారు. భాషా ప్రాతిపదికమీద ఏర్పడిన తొలి రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రాన్ని పేర్కొన్నారు. ఇక దేశం ముక్క చెక్కలయి పోతుందని, సమైక్యత దెబ్బ తింటుందని వీరు అభిప్రాయపడ్డారు. అవిభక్త చెన్నరాష్ట్రంలో పెద్ద భాగంగా వుంటూ వచ్చిన ఆంధ్రప్రాంతము సమైక్య రాష్ట్రపు ఖజానా నింపడానికే ఉపయోగపడుతూ వచ్చింది. ఒకరిద్దరు తప్ప అవిభక్త రాష్ట్రంలో ముఖ్య మంత్రి పదవులు నిర్వహించిన వారందరూ ఆంధ్రులయినా ఆంధ్రప్రాంతము వెనకబడి పోయింది. అందుకే 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రము ఏర్పడినప్పుడు ఒక మహాకవి ఇలా అన్నాడు.

మూడుకోట్ల తెలుగు నోళ్ళు
పాడిందే పాట
మూడు కోట్ల తెలుగువాళ్ళు
పాడండా పూట

ఈ పాట 1956 నవంబర్ 1న అడిపోయింది. ఆంధ్రప్రాంతానికి చెందిన నాయకులు మూడుకోట్ల ఆంధ్రుల నోళ్ళు మూసేసి విశాలాంధ్ర సాధించారు. ఇది గతచరిత్ర. ఈరోజున ఆంధ్రులు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కొరకు పోరాడుతూ వుంటే 'ఒక భాషకు ఒక రాష్ట్రం' అనే నీతి కొందరు గుర్తుకు తెస్తున్నారు. ఈ సమయంలో ఆలోచించవలసిన విషయం ఒకటి వుంది. 'భారత దేశంలోని రాష్ట్రాలు భాషా ప్రయుక్త రాష్ట్రాలా?' అన్నది.

రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు ఫజల్ అలీ కమిషన్ని ఏర్పరచారు. భాషా ప్రాతిపదిక మీద రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరగలేదు. ఆంధ్ర తెలంగాణా ప్రాంతాలు విడిగా వుండవచ్చని ఫజల్ అలీ కమిషన్ అభిప్రాయం వ్యక్తపరిచింది. కొన్ని చేర్పులు ఇక్కడ, కొన్ని మార్పులు అక్కడ జరగగా 1956 నవంబర్ 1న కొన్ని కొత్త రాష్ట్రాలు వచ్చాయి.

ఐతే —

గుజరాతీ, మరాఠీ భాషలు మాట్లాడే ప్రజలు గల సంయుక్త రాష్ట్రం 'బొంబాయి' 1960 ఏప్రియల్ 1వరకూ అలాగే వుంది. 1966 వరకూ పంజాబ్, హర్యానాలు కలసే వున్నాయి.

అంతకంటె విచిత్రం హిందీ ప్రధాన భాషగా గల రాష్ట్రాలు ఈరోజున ఆరు వుండడము, ఈ వివరాలు పరిశీలిద్దాం. రాష్ట్రాలుగా విభజించాలని 'వీరెందుకవరు? మరి అస్సాం కథ.

పదునుగల కత్తిపీటతో లేత ఆనపకాయను ఎన్ని ముక్కలుగా సులభంగా నరకవచ్చునో అస్సాంని అన్ని ముక్కలుగా చేసి పారవేశారు. కేంద్రప్రభుత్వం ఆడుతున్నది రాజకీయ జూదం. ఎత్తులన్నీ ప్రభుత్వానికి ఎప్పుడూ అనుకూలంగా పడే ఏర్పాటువుంది. ఎప్పుడూ ఓడిపోయేది ప్రజలు మటుకే. 'సమయానుకూలంగా రేట్లు మార్చబడును' అన్నట్లు భారత ప్రభుత్వం సమయానుకూలంగా నీతి మారుస్తూ వచ్చింది. ఆంధ్రప్రదేశ్లోని ప్రజలు ముక్తకంఠముతో రాష్ట్రవిభజనా వాంఛ ప్రకటిస్తూవుంటే ధర్మపన్నాలు

| రాష్ట్రం | ప్రధానభాష | జనాభా | వైశాల్యం |
|---|---|---|---|
| బీహార్ | హిందీ | 5 కోట్ల 63 లక్షలు | 174,000చ.కి.మీ. |
| హర్యానా | ,, | 1 కోటి | 44,000చ.కి.మీ. |
| మ. ప్రదేశ్ | ,, | 4 కోట్ల 16 లక్షలు | 444,000చ.కి.మీ. |
| రాజస్థాన్ | ,, | 2 కోట్ల 57 లక్షలు | 342,000చ.కి.మీ. |
| ఉ. ప్రదేశ్ | ,, | 9 కోట్లు | 294,000చ.కి.మీ. |
| హిమాచల ప్రదేశ్ | ,, | 35 లక్షలు | 56,000చ.కి.మీ. |

ఆంధ్రుల ప్రత్యేక రాష్ట్రవాంఛని సమర్థించక 'ఒకభాషకు ఒకరాష్ట్రం' అనే నీతిపాఠం వల్లిస్తోన్న పెద్దలు ఈ హిందీ రాష్ట్రాల నన్నిటినీ కలిపి ఒకేరాష్ట్రం చెయ్యాలనే నీతిపాఠం ఎందుకు వల్లించరు? విశాల హిందీరాష్ట్రం పెద్దదయి పరిపాలనా సౌలభ్యం కరువయి పోతుందని వీరి నమ్మకం. భారతదేశంలో హిందీ తర్వాత అత్యధిక సంఖ్యాకులు మాట్లాడేభాష తెలుగు. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా తెలుగు మాట్లాడే విశాలప్రాంతాన్ని రెండు వల్లిస్తూ కేంద్రము ఒకభాషకు రెండు రాష్ట్రాలు తగవని చెప్తోంది. ఇదే సూత్రం హిందీ భాషా ప్రాంతానికి వర్తించలేక పోవడం తన అశక్తత అని కేంద్రము ఒప్పుకోలేక తప్పుకుంటోంది.

భాషకి రాష్ట్రానికి ముడివేసి అర్థంలేని వాదంలో దిగి తనని తాను సమర్థించుకోలేని కేంద్రము ఆంధ్రప్రదేశ్ సమగ్రతని కాపాడినా అది 'భూగోళం'లో మటుకే చోటు చేసుకుంటుంది. 'చరిత్ర లో ఆంధ్ర తెలంగాణాలు ఏనాడో ఏర్పడ్డాయి!

—తాజీ ప్రసాద్

# ప్రశ్నావళి

—కె. రామలక్ష్మి—

**పి. కె. ఆర్, అమలాపురం**

**చివరకు మిగిలేది ఏమిటి?**

మనకి ఉన్నదే— ఉన్నది. తిన్నదే— ఉండేదీ. మిగిల్చినదే—పోయింది!

**జి. ఆర్. ఆర్, కాకినాడ**

**జీవితం క్షణికం కనుక శాశ్వతంగా నిలవడానికి ఏంచేయాలి ?**

ఈజీవితం క్షణభంగురమే. కాని శాశ్వతంగా నిలిచేవి రెండున్నాయి. ఎదుటివాడి కష్టంపట్ల సానుభూతి. నీకష్టంపట్ల తెగువ.

**అల్లసాని, పూలేరు**

**ఎంతోమంది రాస్తూంటారు. చూస్తూంటాను. నాకాభాగ్యం లేదే అని నిట్టూర్పు స్తాను. ఎందుకూ నా రచనలు కొరగావన్నప్పుడు ఆ వరం దేవుడు నాకెందుకు ప్రసాదించాలి? దీనికి సమాధానం ఎవరు యిస్తారు?**

మీకా వరం ప్రసాదించాడంటున్నారే— దేవుడు అడిగి చూడండి! లేకుంటే, అర్థంకాని యీగొడవ ఏమిటి?! రాసింది అచ్చుకానంతమాత్రాన యిలా రాసి, మీ 'పేరంటి పెద్ద' కీర్తికే అప్రతిష్ఠ తెస్తున్నారు! ప్రచురితం అవుతున్న రచయితల అదృష్టంపట్ల యీర్ష్య అనవసరం. రచన ప్రచురింపబడ్డం, తిరస్కరింపబడ్డం— లాటరీకాదు., ఓర్పుకి పరీక్ష.

**డి. డి. పి, చాట్రాయి**

**వర్తమాన గరీబీహఠావో పరిపాలనలో గరీబులు ఎవరైనా షరాబులైనారా ?**

అలా ఎందుకని షరాబులని గరీబులను చేసే ప్రయత్నాలు చేయిస్తున్నాంగా! పెన్నిధి పంచలేకపోయినా పేదరికం పంచడంకూడా— త్యాగమే.

**ఎస్. వి. ఎన్, అనకాపల్లి**

**పెండ్లి అయిన ఆడది భర్తదగ్గరకంటే పుట్టింటి దగ్గిర వుండాలని ఎక్కువగా కోరుకుంటారు కారణం ఏమిటండి?**

అక్కడ పుట్టిన చివురుకొమ్మకదా! ఆమాత్రం అపేక్షవుండడం అసహజం కాదే.

**టి.డి.హెచ్.ఆర్, కుర్ద్ పర్ (బిలాయి)**

**ఏమండీ గుడికి ఒకద్వారం, గృహానికి రెండుద్వారాలు వుండడంలో మీ ఉద్దేశ్యం?**

దేవుడుదగ్గిర నుంచి తప్పించుకు పారిపోవాలనే తొందర వుండదు. ఇంటినుంచి ఒక్కొక్కసారి పారిపోవాలని పిస్తుంది. అందుకే గుడికి ఒకే ద్వారం వున్నా యిబ్బంది లేదు. ఇంటికి రెండున్నా సరిపోవు!

**ఎస్. కె. వై, కొత్రపాడు**

**ఆడపిల్ల పుడితే లక్ష్మితో సమానం అంటారు. మగపిల్లవాడు పుడితే—**

పెట్టుబడికి నష్టం రాదని ధైర్యంగా వుంటారు. హాయిగాపెంచి, చదువు చెప్పించి బలిపశువుగా కాక పోటీపశువుగా పెళ్లి మార్కెట్‌కి దిగుమతి చేస్తారు.

**కె యు ఆర్, ఏలేటిపాడు**

**మద్రాసునుంచి సమైక్యతా ప్రచారాలు జోరుగా చేస్తున్నారు. ఎంత ముట్టిందేమిటి (డబ్బు.)**

మనలో మన మాట ఆయుమ్మరంలో మీరెంత దండారేమిటి ఉపారాజుగారూ, యిలా అడుగుతున్నారు! అంతా మీలాగే వుండరండి. ఆ సంగతి లేటుగానైనా గ్రహించడం మంచిది.

**ఎస్. ఎస్, గూడూరు**

**పుత్రికల తల్లిగాకాక, పుత్రుల తల్లిగా కట్నాలపై మీ అభిప్రాయం ఏమిటి?**

కట్నాల విషయంలో అబ్బాయి. అమ్మాయి తేడా లేదు నాకు. ఎవరికీ కట్నం యిచ్చి పెళ్లిచెయను. పెళ్లిచేసి యింట్లోనూ వుంచుకోను!

**జి ఎమ్, హుస్సేన్‌పల్లి**

**మా నాన్న ఉన్న ఆస్తిఅంతా దుబారా ఖర్చులకు వినియోగిస్తున్నారు. అది మా తాత సంపాదించినది.**

ఎవరో సంపాదించి యిచ్చిన ఆస్తి — మీరు ఖర్చుచేస్తే ఏం? మీ నాన్న ఖర్చు చేస్తేనేమి! ఎవరో ఒకరు—దాన్నలా హరింప చేయడమే సుఖం... స్వంతంగా సంపాదించుకునే పౌరుషం వస్తుంది

**ఎమ్. పి, పంటఖుర్దు (నిజామాబాదు)**

**'నడుస్తున్న చరిత్రే'మిటండీ రుద్రాణిగారూ.**

చాలాకాలానికి నా పేరు జ్ఞాపకం చేసేరు! వర్తమాన చరిత్రే నడుస్తున్న చరిత్ర ప్రసాద్‌గారూ.

**జి. ఎస్, తిరుపతి**

**మీరు మీ వారూ ఎప్పుడైనా పోట్లాడగా?**

పోట్లాటలేకపోతే నాకు బోరు. అంచేత ఏదో కష్టపడి కయ్యానికి కాలు దువ్వుతాన్నేను.

**ఎస్. వి. బి. సి. హెచ్. మానకొండూరు**

**ఏమండీ కె. రా. గారూ అణకువలేని ఆడదానికి అందం వున్నా దండగరా' ఎంతవరకూ నిజం?**

అది మీ మగవారు సృష్టించిన మాట. వ్యక్తిత్వంలేని ఆడదానికే— అందం వున్నా రాణించదంటాన్నేను.

**వి. ఏ. ఎస్. కొరుమూరు**

**కొద్దిమంది మహిళామతల్లుల రచనల వల్ల మధ్యతరగతి యువకులు, యువతులు మానసికముగా చెడిపోతున్నారని నా భావన...**

మానసికంగా బలహీనులై ఆలోచనలతో చదివిన రచనల ఫలితంగా చెడిపోయే యువక మహిళామతల్లుల రచనలే కాదు— భాగవతం చదివినా చెడిపోతారు! . . .

**ఎస్. పి, హిందూపూరు**

**రామలక్ష్మిగారూ, మీరెందుకలా మీ ప్రశ్నావళి ద్వారా అందర్నీ బాధ పెడుతున్నారు?**

సరదాకి! (పోయిన జన్మలో నేను కానిబాల్‌ని అయివుంటాను!)

**ఎమ్. వై. ఆర్, పలూరు**

**స్త్రీ జాతిని విపరీతంగా దుమ్మెత్తిపోసిన వేమనపై మీ అభిప్రాయం?**

స్త్రీ జాతిని విపరీతంగా ఆరాధించినవాడు కనుకే— అంత విపరీతంగానూ దుమ్మెత్తిపోయగలిగాడు. ఎప్పుడూ— అతిప్రేమ— అతి ద్వేషానికే కదా— దారి తీసేది.

**సుబ్బశ్రీ, కర్నూలు**

**మృత్యువు చిహ్నమేమిటి ?**

వేదన.

**కన్నీరు దేనికొరకు?**

మోసిన, చేసిన పాపాలని ప్రక్షాళనం చేయడానికి

**మనస్సు ఆదర్శం?**

స్వచ్ఛంగా స్ఫటికంగా— వుండాలని.

**మిమ్మల్ని ద్వేషిస్తే?**

అభిమానం అరి అయితేనే కదా ద్వేషిస్తారు అనుకుంటాను

**జి. ఎమ్. ఎస్, పెనుమంట్ర**

**మనసు అంటే ఏమిటి?**

మన చేతలకీ వూహలకీ సాక్షి.


**హృదయం అంటే ఏమిటి?**

మన కోర్కెలకి కోట.

**ఈ రోజుల్లో మాట విలువ గొప్పదా? డబ్బు విలువ గొప్పదా?**

డబ్బున్న వారి మాట విలువైనది.

సీరియల్




**జరిగిన కథ**

నిలయ చెల్లెలు లోక. రోగంతో తీసుకుంటున్న ముసలితండ్రి ఒకడున్నాడు. సంసార బాధ్యత అంతా నిలయదే. ఆమె ఒక ఆఫీసులో పని చేస్తున్నది. ఆ ఆఫీసులోనే పని చేస్తున్న భాస్కర్రావు ఆమెని పెళ్ళాడతానన్నాడు. కాని, కుటుంబ పరిస్థితి దృష్ట్యా నిలయ అంగీకరించలేదు. లోకకి సినిమాలంటే పిచ్చి. ఆమెకి తగినవాడే మోహన్. సినిమాల్లో చేర్పిస్తానని లోకని మద్రాసు తీసుకు వచ్చాడు మోహన్. నిలయా మధూ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. కాని మధు తల్లి అందుకు సమ్మతించలేదు. వేరే సంబంధం గురించి చెప్పింది. మధు తల్లడిల్లిపోయాడు. లోక గర్భవతి అయ్యాక మోసంచేసి వెళ్ళిపోయాడు మోహన్. జయ ఆమెకి మంచి స్నేహితురాలు. తన తండ్రితో నిలయ పార్కులో కనిపించిందని విన్నాక జయ మనసు మనసులో లేదు.

## 9

రోజులు గడిచిపోతున్నాయి. ఏటొచ్చీ జయకి రోజులు భారంగా నడుస్తుంటే, రామనాథంగారికి నిమిషాల్లా దొర్లిపోతున్నాయి.

'జయకి పెళ్ళి చెయ్యరా?' అందారోజు హఠాత్తుగా నిలయ.

'ఎందుకు చెయ్యనూ? ఇదుగో ఆరోజు నువ్వన్నావుగా... ప్రతినెలా జీతం ఇంటికి ఖర్చులకి పోగా మిగిలింది ఖచ్చితంగా బ్యాంకులో వెయ్యమనీ, లేకపోతే నాతో మాట్లాడననీ...'

'ఔను అన్నాను. ఫలితం ఏమన్నా ఉందా?'

'లేకేం? నువ్వామాట అన్నప్పటి నించీ దాస్తూనే ఉన్నాను. జల్సా ఖర్చులేవీ మానేశాను కదా! నువ్వు చెప్పినప్పటి నించీ సాయంత్రం ఆఫీసు నించి తిన్నగా ఇంటికే వస్తున్నాను ఇంట్లో సరుకులేం కావాలో, పిల్లల అవసరాలేమిటో రోజూ కనుక్కుంటున్నాను.' నవ్వింది నిలయ.

'ఇంక నీ రెండవ ఆజ్ఞ జయకి త్వరలో పెళ్ళి చెయ్యమని కాబోలు.'

'ఔను.'

'నువ్వు చెప్పినట్టల్లా చేస్తానుగా ఇంకా ఎందుకు విసిగిస్తావు!' దగ్గరి కొచ్చి పట్టి వొచ్చి దూరంగా ఎందుకు పారిపోతావు.'

'అందీ అందని అందంలోనే ఆనందం ఉందన్నారుగా.'

'ఏడిశావు.' నిలయ చేతిపట్టుకుని తన చెంపలకానించుకున్నారు రామనాథంగారు.

మెల్లిగా తన చేతిని వెనక్కి తీసుకుని 'పదండి పోదాం. చీకటిపడుతోంది' అంటూ లేచింది. ఇద్దరూ గేటు దాటుతుండగా అప్పుడే లోపలికి అడుగుపెడుతున్న భాస్కర్రావు ఎదురుపడ్డాడు. నిలయని పలకరించబోయి మళ్ళీ పక్కనున్న రామనాథంగారిని చూసి మొహం చిట్లించుకుని మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. లోలోనే నవ్వుకుంది నిలయ. తండ్రి వెంట నిలయ కూడా లోపలికి రావడం చూసిన జయ అదోలా వాళ్ళిద్దరి వంకా చూసి కోపంగా వంటింట్లోకి వెళ్ళిపోయింది. జయతో ఏకాంతంగా మాట్లాడాలనుకున్న నిలయ మెల్లిగా వంటింట్లోకి నడిచింది. కాఫీ కలిపే ప్రయత్నంలో ఉంది జయ. 'నాన్నగారికివ్వు గానీ నాకొద్దు జయా కాఫీ.'

'అబ్బో! ఛెట్టు చేస్తోంది. బతిమాలాలి కాబోలు' మనసులోనే విసుక్కుంది జయ. మౌనంగానే ఉండిపోయింది మాట్లాడటానికి మనస్కరించక. 'అలా ఉన్నావేం జయా! ఒంట్లో బాగులేదా! నీతో కొంచెం మాట్లాడాలి.'

'నాతో మాట్లాడే అవసరం ఏముంది? అయినా తల నెప్పిగా ఉంది నాకు. ఎవరి మాటలూ వినే ఓపిక లేదు.

తెల్లబోయింది నిలయ. అయినా తమాయించుకుని చిన్నగా నవ్వడానికి ప్రయత్నించింది. 'నామీదెందుకో, కోపంగా ఉంది నీకు. పోన్లే ఇంకోసారెప్పుడైనా మాట్లాడతాను.'

'ఏమీ తెలియనట్టు ఎలా మాట్లాడుతోందో! ఛీ! ఛీ ఇలాంటి వాళ్ళనేమనుకోవాలి? తనమీదెంతో జాలి ఉన్నట్టు ఆ రోజలా మాట్లాడిన మనిషేనా? నాన్నగారిని వల్లో వేసుకుని గోతులు తవ్వడానికి ప్రయత్నిస్తోంది. సిగ్గు లేకపోతే సరి తండ్రి వయసున్న మొగాడితో ఆ షికార్లూ, ఆ తిరుగుళ్ళూ ఏమిటో? బుద్ధి తక్కువై ఆరోజు తన మనసులో బాధంతా చెప్పుకుంది అనవసరంగా.

'ఇక్కడేం చేస్తున్నావు నిలయా? కాఫీ జయ తీసుకొస్తుందిలే. నువ్వొచ్చి కూర్చో!' వంటింటి వైపొచ్చారు రామనాథంగారు.

'మీరు తాగండి కాఫీ. నేనింక ఇంటికి వెళ్తాను. పొద్దుపోయింది.'

'అరకప్పు తీసుకోపోనీ, అయినా నేను కూడా వస్తానుగా మీ ఇంటిదాకా.'

'హా వద్దు వద్దు, మళ్ళీ మీరు రావడమెందుకు' అంటూ వెళ్ళిపోతున్న నిలయని చూస్తూ 'నిర్లక్ష్యం చేసుకోడం నా తరం కాదు సుమా!' అంటూ చిన్నగా గొణుక్కున్నారు రామనాథంగారు.

* * *

తూర్పు. అవంతపెట్టడంతో తన్నని సరిగా తను కూడా వాళ్ళతో పిక్నిక్కి బయల్దేరింది నిలయ. 'అతినాతమే కదా


మేము వెళ్తున్నది. నిన్నేమైనా ఆఫీసుకి సెలవుపెట్టి రమ్మన్నానా? ఊరికే గోళ్ళు గిల్లుకుంటూ ఒక్కదానివీ కూర్చుని రోజంతా ఏం చేస్తావు. ప్రతి ఆదివారమూ చేసేదదే కదా! ఒక ఆదివారమైనా సరదాగా కాలక్షేపం అయితే నీకే మార్పు కింద ఉంటుంది' అంటూ ఎలాగైతేనేం నిలయని ఒప్పించగలిగింది ఝాన్సీ ఝాన్సీ. ఝాన్సీ స్నేహితురాళ్ళు నలుగురు, నిలయ మొత్తం ఆరుగురు. ఝాన్సీ స్నేహితురాళ్ళలో సుజాత తండ్రికి కారుంది.

'మా కార్లో వెళ్దాం. మా నాన్నగారు వొద్దనరు. ఆ రోజుకి కారుని, డ్రైవరుని మనకప్పగిస్తారు.' అంది సుజాత. సరే నన్నారు అంతా. 'అసలెక్కడికి వెళ్ళాల'న్న ప్రశ్నకి కూడా సుజాతే చెప్పింది. 'మా తోటలిక్కడికి పదిమైళ్ళలో ఉన్నాయి. చాలా చిన్న పల్లెటూరది. పొలాలూ, తోటలూ, కాలవలూ చాలా అందంగా, బావుంటుందా ఊరు. మా బాబాయ్‌గారిల్లు ఆ తోటల్లోనే ఉంది. అందుకని మనకి తిండికిబ్బంది లేదు. తోటల్లోపడి గంతులెయ్యడం, భోజనంవేళకి వాళ్ళగూటికి చేరుకోడం. నేను ముందే ఈ కబురు వాళ్ళకి తెలియజేస్తాను వాళ్ళు సిద్ధంగా మనకోసం అన్నీ చేస్తారు.'

'ఛ! ఇంతమందిమి కల్సి వాళ్ళింటి మీద పడటం బాగుండదేమో.' నసిగింది ఝాన్సి.

'ఆహాహా! చెప్పొచ్చావులే, ఈ కాలం పిల్లలు అరడజనుమంది తినే అన్నం వాళ్ళింట్లో ఇద్దరు మనుష్యులు తేలిగ్గా ఊది పడేస్తారు తెల్సా! పల్లెటూరమ్మా అది పల్లెటూరు. మనమూ మన భోజనాలూ వాళ్ళకో లెక్కా!' మిగిలినవాళ్ళంతా సుజాత మాటలకి నవ్వారు. చివరికి ఝాన్సీ, సుజాత వాళ్ళ వాళ్ళ ఇళ్ళల్లో ఏమైనా రెండు మూడు రకాల చిరుతిళ్ళు చేయించి పట్టుకొచ్చేటట్టు, భోజనం మాత్రం సుజాతావాళ్ళ బాబయ్‌గారింట్లోనే చేసేటట్టు నిశ్చయమయింది. ఇదంతా నిలయకి కూడా చెప్పి ఒప్పించింది ఝాన్సీ.

ఆదివారం రానే వొచ్చింది. పొద్దున్నే తొమ్మిదింటికల్లా నిలయని తీసుకుని సుజాత ఇంటికి బయల్దేరింది ఝాన్సీ. ఇద్దరూ వెళ్ళేసరికి మిగిలినవాళ్ళు కూడా అక్కడ సిద్ధంగా ఉన్నారు. వాళ్ళందర్నీ కూడా ఇదివరకు రెండు మూడుసార్లు ఝాన్సీ వాళ్ళింటికి వచ్చినప్పుడు చూసింది నిలయ. ఆ పరిచయంతోనే వాళ్ళంతా నిలయని పలకరించారు. వద్దంటున్నా కూడా అందరికీ ఉప్మా, కాఫీలు తెచ్చింది సుజాత. అవన్నీ కానిచ్చి లేచేటప్పటికి డ్రైవరు కారుతో సిద్ధంగా ఉన్నాడు గేటు దగ్గిర. ముందు సీట్లో సుజాత, మరొకమ్మాయి కూర్చున్నారు. వెనక నిలయతోపాటూ మిగిలిన ముగ్గురూ సర్దుకున్నారు. దోవలో రెండు పక్కలా కనిపించే పచ్చని పొలాలూ, తోటలూ, పిల్ల కాలవలూ, బారులుతీరి సిపాయిల్లా నిలబడ్డ కొబ్బరిచెట్లూ, ఒంటికి చల్లగా తగులుతున్న గాలీ అందరికీ ఎంతో ఆహ్లాదాన్ని కలిగించాయి. 'హాయిగా ఈ పల్లెటూళ్ళో ఉండే వాళ్ళు ఎంత అదృష్టవంతులో! ఎంత బాగుంటుంది ఇటువంటి చోట ఉండిపోతే' అంది నిలయ.



'ఏదో రెండురోజులుండగలవు, నాలుగు రోజులుండగలవు జీవితమంతా ఇటువంటి ఊళ్ళో ఛస్తే ఉండలేవు.' అంది ఝాన్సీ నవ్వుతూ అదీ నిజమేననిపించింది నిలయకి

# ప్రాచీన వైద్య పద్ధతులు

## వాంతులు, వమనవికారాన్ని హరించేవి

(అజీర్ణం వల్ల, పైత్యంవల్ల —ప్రయాణం చేసేటప్పుడు ప్రయాణవాహనంయొక్క ఆయిల్ వాసన పడకపోవడం వల్ల — గర్భిణులకు నేవిళ్ళు వల్ల వాంతులవడం గాని—వాంతివికారం గాని కలుగవచ్చు. అజీర్ణ పదార్థాలు వాంతి అయిపోడమే మంచిది వాంతి అయినా యింకా వికారంగా ఉన్నట్లయితే మొదట చిన్న మంచు ముక్క తినిపించి ఈ క్రింది చికిత్సలలో ఏది యుక్తమయిన దయితే అది చెయ్యవచ్చు.)

1. ఉసిరిక పళ్ళుగాని, వాని రసంగాని పుచ్చుకుంటే వమనవికారం తగ్గుతుంది

2. సుమారు ముప్పై చుక్కల ఏలకుల అర్కమును పంచదారతో సేవిస్తే వమనవికారం నివృత్తిస్తుంది

3. కరివేపచెట్టు ఆకుల లేదా ప్రాను చెక్క లేదా వేరుచెక్క తేలిక కషాయాన్ని పూటకు ఒక ఔన్సు చొప్పున మూడు పూటలు యిస్తే వాంతులు కడతాయి

4. ఒక ఔన్సు ఎర్రావడ చెట్టు ఆకుల రసాన్ని రెండు లేదా మూడుపూటలు యిస్తే వాంతులు తగ్గుతాయి

5. లేతకొబ్బరికాయనీళ్ళు త్రాగినట్లయితే వమనవికారం తగ్గుతుంది.

6. ఖర్జూరపు పువ్వు, కొబ్బరిపువ్వు, ఈత పువ్వు, తాటిపువ్వు —వీనిలో ఏ పువ్వు రసమయినా తీసి, (మోతాదుపూటకు ఒక ఔన్సు) ఆ రసంలో పటికపంచదార, కొంచెం మంచి గంధం కలిపి పానం చేయిస్తే వాంతులు కడతాయి. రసం తీసేటప్పుడు పరిశుభ్రమైన కొంచెం మంచినీళ్ళను కలిపి నూరవచ్చును.

7. జినపచెట్టు ఆకులరసాన్ని పూటకు ఒక ఔన్సు చొప్పున పానం చేయిస్తూంటే వమనవికారం కడుతుంది

8. ప్రత్తిగింజలపప్పు చూర్ణాన్నిపూటకు ఒక తులం చొప్పున తేనెతో రోజా మూడు పూటలా సేవిస్తే వాతపిత్త శ్లేష్మల వలన కలిగే వాంతులు కడతాయి

9. మిరియాలను మంచినీళ్ళతో కల్వంలో మెత్తగానూరి — గచ్చకాయంతేసి వుండలు చేసి— పూటకొక వుండచొప్పున తినిపిస్తే వాంతులు కడతాయి.

10. ఒక ఔన్సు తియ్యదానిమ్మరసానికి సమానంగా పంచదార కలిపి రెండు మూడు పూటలు పానం చేస్తే వమనవికారం కడుతుంది

11. చింతపండు తగు మోతాదులో తింటే పైత్యవమనం కడుతుంది.

12. నిమ్మపళ్ళ రసం త్రాగుతూంటే భోజనానంతర వమనం కడుతుంది

13 గర్భిణస్త్రీలు — కడుపులోత్రిప్పు, వికారం ఉన్నప్పుడు ఒక లవంగా మొగ్గను నోట్లో వేసుకొని నెమ్మదిగా నములుతూంటే ఆ వికారం తగ్గుతుంది

(వయస్సున కనుగుణంగా పిల్లలకిచ్చే మోతాదును తగ్గించాలి)

### పులిత్రేనుపులను హరించేవి

1 ముదిరిన అరటికాయలను ఎండలో ఎండబెట్టి వానిని పిండిచేసి చిన్న చిన్న బిళ్ళలుగా చేసి ఎండబెట్టి ఉప్పుతో వారం పది రోజులపాటు భోజనానంతరం తిన్నట్లయితే పులి తేనుపులు నివృత్తిస్తాయి.

2 అరటి ఆకుల భస్మాన్ని భోజనానంతరం సైంధవ లవణంతో తగు మోతాదులో సేవిస్తే పులి త్రేనుపులు కడతాయి.

3. కొబ్బరి కాల్చి చేసిన బూడిదనుగాని—కొబ్బరితో తీసిన సారాన్నిగాని భోజనానంతరం తగు మోతాదులో సేవిస్తే పులి త్రేనుపులు కడతాయి.

4 ఎనిమిది గోధుమ గింజల ఎత్తు మానుప్పును—మూడు ద్రాముల నిమ్మ పళ్ళ రసంతో—నీళ్ళు కలిపి—భోజనానంతరం నాలు గైదు రోజులు పానం చేస్తే పులి త్రేనుపులు హరిస్తాయి అరటి సొరుగు లేక కొబ్బరి ఆకులు మొదలగు కొన్ని చెట్లను కాల్చి చేసిన క్షారానికి మానుప్పు అని అంటారు.

5. పది లేక పదిహేను గోధుమగింజల ఎత్తు సజ్జి క్షారాన్ని—నిమ్మపండు రసంలో నీరు కలిపి అందులో పై క్షారాన్ని కలిపి భోజనానంతరం కొద్ది రోజులపాటు పానం చేస్తే పులి త్రేనుపులు కడతాయి.

(వయస్సున కనుగుణంగా పిల్లలకిచ్చే మోతాదును తగ్గించాలి.)

సేకరణ ఆకుండి నారాయణమూర్తి

## విడిన మబ్బులు

దూరంగా కనపడుతున్న పల్లెపడుచుల్ని గమనిస్తూ మౌనంగా ఉండిపోయింది. పది మైళ్ళూ పదినిమిషాల్లో వొచ్చేసినట్లనిపించింది అందరికీ కబుర్లతో. పిన్నికీ, బాబాయ్‌కీ స్నేహితురాళ్ళ నొక్కొక్కళ్ళని పరిచయం చేసింది సుజాత. ఇంతలో 'హలో' అంటూ పక్క గదిలోంచి ఇవతలి కొచ్చాడు సుందర్.

'అరే! నువ్వెప్పుడొచ్చావు? ఇంకో నెల్లాళ్ళకో ఎప్పుడో సెలవు పెట్టొస్తావని చెప్పారు నాన్నగారు.' అంది టూప్పి సుందర్ వైపు చూసి.

'ఔను అలా అనే నాన్నగారికి ఉత్తరం రాశాను నేను. అందుకే వీళ్ళక్కూడా తెలియదు నేనిలా హఠాత్తుగా వొస్తానని.' అంటూ తల్లివైపు చూపించాడు సుందర్. 'నిన్ననే వొచ్చాను అక్కడ మా ఆఫీసులో స్ట్రైకులూ ఏవేవో గొడవలూ వచ్చాయి. పరిస్థితం బాగులేదు. ఆఫీసుకి వెళ్ళి రోజూ ఆ గొడవల్నీ అయోమయం అక్కడ గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునే బదులు ఇక్కడికి రావడం మంచిదని వచ్చేశాను.'

'మంచిపని చేశావు. ఇదిగో వీళ్ళు నా ఫ్రెండ్స్...'

'ఔను. అమ్మ రాత్రి చెప్పింది. అమ్మాయిల కి కాఫీలూ, టిఫిన్లూ...'

'ఏం నాయనా కాఫీ, టిఫిన్లతో పంపించేద్దామనుకుంటున్నావా? మేం శుభ్రంగా ఊరంతా తిరిగి, తోటల్లోపడి గంతులేసి వొచ్చి బొజ్జనిండా, గడ్డ పెరుగుతో అన్నం తింటాం' గడ్డ పెరుగు తల్చుకుని లొట్టలు వేస్తూ అంది సుజాత.

'అమ్మా! తొందరగా వెళ్ళి పెరుగు గిన్నెల్లోంచి మజ్జిగ చేసెయ్యి. మర్చిపోయేవు... నాకు మాత్రం ఓ చిన్నగిన్నెడు పెరుగు తీసి విడిగా పెట్టు.' హాస్యంగా అంటూ సుజాత వైపు కొంటెగా చూశాడు సుందర్.

'ఉహూ! ఇలా ఉందా నీ పని, పిన్నీ తప్పకుండా ఈపూట సుందర్‌కి నీళ్ళ మజ్జిగ పొయ్యి. మర్చిపోకు' సుజాత మాటలకి నవ్వుకుంటూ లోపలికి పోబోయిందావిడ గబుక్కుని ఆవిడ చెయ్యిపుచ్చుకుని అంది సుజాత, 'పిన్నీ కాఫీ లేమన్నా

తయారు చేస్తామేమో! మేమందరం రెండేసిసార్లు కాఫీ, టిఫినూ కొట్టివచ్చిన వాళ్ళం. ఇంక ఇప్పుడేం వద్దు. మేమలా తిరిగొస్తాం. ఈ లోపల మా పిన్ని వంటకాల్లో నాకేవేవి ఇష్టమో అన్నీచేసి అక్కడపెట్టి రెడీగా ఉంచుతుందిట.'

'అన్యాయం, నీ ఫ్రెండ్సు ఇంకా అయిదుగురున్నారు. నీ ఒక్కదాని ఇష్టాల ప్రకారమే చెయ్యమంటే ఎలా? వాళ్ళ కోపం రాదూ పాపం. అందుకే...'

'అమ్మా ఏ గొడవా ఉండదు...నా ఫ్రెండ్సు ఎవరూ లేరుగా ప్రస్తుతం ... అందుకని చక్కగా నా కేవేవి ఇష్టమో అవి చేసేయమ్మా బాధలేదు. కదండీ' అన్నాడు కావాలని అమాయకంగా మొహంపెట్టి ఝాన్సీ వాళ్ళవైపు తిరిగి. అందరికీ నవ్వొచ్చింది అతని మాటలకి.

'సుందర్! నువ్వు మేము వెళ్ళిపోయే దాకా మాతోపాటు తిరిగి మాకు గైడ్‌గా ఉంటావుట వింవక్కా.'

'ఔనౌను. ఇది చాలా పెద్ద సిటీ. వెనకాల నాబోటి మగధీరుడు లేకుండా మీబోటి ఆడంగులు అడుగుతీసి అడుగు వెయ్యలేరు'

'ఏం ఝాన్సీ! మీ కెవరికన్నా అభ్యంతరమా సుందర్ మనతో కాసేపు తిరిగి అఫ్‌కోర్సు మనకి బోరకొట్టినప్పుడు వెళ్ళి పొమ్మందాం' అంది సుజాత.

'వింతమాటన్నావు! అలా అయితే అసలు ఈ మొనగాడు రానేరాడు' కోపం నటించాడు సుందర్.

'సుజాత మాటల కేం లెండి. మీ కంపెనీ మా కెంతో సరదాగా...' ఝాన్సీ మాట పూర్తి కాకముందే అన్నాడు సుందర్.

'అయ్యబాబోయ్! అలా పొగడకండి. నాకు భయం వేస్తుంది. అసలే ఘోటక బ్రహ్మచారిని.'

'సరే సరే! పదండి.' అంటూ తొందర పెట్టింది సుజాత. చెప్పులు తొడుక్కుని సుందర్ కూడా వచ్చాడు.

'మొదట గంటలమ్మగుడి చూస్తారా?' చిన్నగా నవ్వుతూ అడిగాడు గేటు దాటి రోడ్డుమీది కొచ్చాక

'గంటలమ్మా!' ఆశ్చర్యంగా అడిగింది ఝాన్సీ.

'ఏం, ఆ పేరెప్పుడూ వినలేదా ఝాన్సీ నువ్వు?'

లేదన్నట్టుగా తలూపింది ఝాన్సీ సుజాత ప్రశ్నకి.

అట్టే దూరం నడవక్కర్లేకుండానే గుడి ముందుకొచ్చారు.

వీళ్ళని చూసి గుడి పక్కనే ఉన్న గుడిసెలోంచి ఒక నలబయ్యేళ్ళ స్త్రీ బయటికొచ్చింది 'ఎప్పొచ్చావ్ అబ్బాయి గోరు ఊర్నించి, రండమ్మా! లోనికి రండి.' అంటూనే గుడిలోకి నడిచింది.

గుడిలోపలి అమ్మవారి విగ్రహం భయంకరంగానూ, పెద్దదిగానూ ఉంది. వింతగా చూస్తూ నిలబడింది ఝాన్సీ. గుడిసెలోంచి వచ్చిన స్త్రీ కుంకం, పసుపు ఉన్న పళ్ళెం అందరికీ అందించింది. అందరూ కొద్ది కొద్దిగా కుంకం, పసుపు తీసుకున్నారు సుందర్ తప్ప. అందరూ తలో పావలా పర్సుల్లోంచి తీసి ఆ పళ్ళెంలో వేశారు. తర్వాత గుడిలోంచి బైటికొచ్చాక 'ఆంజనేయస్వామిని కూడా చూస్తారా

ఇక్కడికి రెండు ఫర్లాంగులు ఉంటుందా గడ' అన్నాడు సుందర్.

'ఎదురుగా ఆంజనేయస్వామిని చూస్తున్నాం కదా! ఇంకా ఎక్కడికో వెళ్ళడమెందుకు?' సుందర్ కొక్కడికే వినిపించేటట్టు నెమ్మదిగా అంది సుజాత నవ్వుతూ. కళ్ళతో బెదిరిస్తున్నట్టు చూశాడు సుందర్.

ఆంజనేయస్వామి గుడి ఎత్తుగా కొండమీద ఉంది. సుమారు వంద మెట్లున్నాయి. చకచకా, పందెం వేసుకున్నట్టు మెట్లెక్కడం మొదలెట్టారు. కింద మెట్ల దగ్గిర నాలుగు కొబ్బరికాయలూ పెట్టుకు కూర్చున్న అమ్మి దగ్గిర ఒక కొబ్బరికాయ కొంది సుజాత. మెట్లన్నీ ఎక్కి పైకి వచ్చాక ఆయాసంతో రెండు నిమిషాలు నిలబడి పోయారంతా. ఆ తర్వాత దేవుడిని దర్శించుకుని సింధూరం, ప్రసాదం పుచ్చుకుని బయటికొచ్చి కాసేపు కూర్చుని లేచారు. మెట్లు దిగుతుండగా

'ఇంక మా ఊళ్ళో చూడవలసినవి తోటలూ, పొలాలూ తప్ప మరేమీలేవని సుజాతగారికి సవినయంగా మనవి చేసుకుంటున్నాను' అన్నాడు సుందర్ హాస్యంగా.

'మాకూ తెల్సులేవోయ్! ఆ తోటల్లోనే వడిగంతు లేయ్యాలనుకున్నాం.' సుజాత వెంటనే అంది.

'ఇక్కడ దగ్గిర్లో హాస్పిటల్ ఏమీలేదు. ఆ తర్వాత మీ ఇష్టం.'

నిలయ నవ్వాపుకోలేక పోయింది సుందర్ మాటలకి.

'మరి నాకు సెలవా?' అన్నాడు సుందర్ మెట్లన్నీ దిగాక.

'బావుంది. అప్పుడే చెక్కేద్దామనుకుంటున్నావా?'

'నీకు బాగుండచ్చు, కాని పాపం నీ ఫ్రెండ్సుకు ఫ్రీగా మాట్లాడుకుందుకుండదు నామూలాన. వీండుకొచ్చాంరా భగవంతుడా అనుకుంటారు వాళ్ళు, నేను మళ్ళీ కొంచెం సేపయ్యాక వచ్చి మిమ్మల్ని కలుస్తానుగా.'

'ఎలా? మేమెక్కడుంటామో మీకెలా తెలుస్తుంది మరి?' ఝాన్సి చిత్రంగా అడిగిన ప్రశ్నకి పగలబడి నవ్వారు సుజాత, సుందర్.

'ఇంత పెద్ద ఊరనీ ఇది. మీరెక్కడున్నారో పట్టుకోలేక పోవడానికి.' సుందర్

# విడిన మబ్బులు

మాటలకి సిగ్గుపడింది ఝాన్సీ.

ఝాన్సీ వంకే కన్నార్పకుండ చూస్తున్న సుందర్ని గమనించింది సుజాత 'సరే సుందర్! నీకూ కష్టంగానే ఉంటుంది పాపం మా ఆడవాళ్ళ మధ్య. నాకు తోటలోదోవ తెల్సు. మేం వెళ్తాం' అంది.

'సరే!'అంటూ వెనక్కి తిరిగి వెళ్తూ మళ్ళీ ఒకసారి ఝాన్సి వంక చూశాడు సుందర్. అప్పుడే అతనివైపు చూసిన ఝాన్సీ చటుక్కున తల తిప్పుకుంది. కాలువ గట్లంట, వరిచేని పొలాల్లోంచి నడుచుకుంటూ ఆడుతూ పాడుతూ సుజాతా వాళ్ళు తోటలోకి చేరుకున్నారంతా. పెద్ద మామిడితోట అది. అటుపక్క నిమ్మ, ఆరెంజ ఇటుపక్కన కొద్దిదూరంలో కొబ్బరితోట. 'ఇవన్నీ మావే' అంది సుజాత.

'అబ్బా! పైన ఎండగా ఉన్నకూడా ఈ మామిడి చెట్లలో ఎంతో చల్లగా ప్రాణానికి హాయిగా ఉంది' అంది ఝాన్సీ కిందగ ఉన్న ఓ మామిడి కొమ్మమీద కూర్చుంటూ. అన్ని చెట్లకికూడా కొన్ని కొమ్మలు కిందగా ఉన్నాయి ఎక్కేందుకు వీలుగా. సుజాత కూడా ఝాన్సీ కూర్చున్న కొమ్మమీద కూర్చుంటూ నిలయని పిల్చింది. 'బాబోయ్! నాకు భయం' అంటూ సుజాత చెయ్యిపుచ్చుకుని జాగ్రత్తగా ఎక్కి కూర్చుంది నిలయ. మిగిలిన ముగ్గురమ్మాయిలూ కూడా పక్కనేఉన్న మరో చెట్టుకొమ్మలమీద ఎక్కికూర్చుని ఉయ్యాలలూగటం మొదలెట్టారు.

'అందరూ పాటలు పాడాలిప్పుడు సుజాతా నువ్వు మొదలెట్టు' అంది ఝాన్సి 'ఓ! యస్! మనం బతిమాలించుకోం' అంటూ ఓపాట పాడింది సుజాత. తర్వాతివంతు నిలయదైంది. ఝాన్సీ మరీ పట్టుపట్టడంతో పాడింది నిలయ. అందరిచేతా పాడించి 'నాకు రాదు. నేను పాడలేను' అంటూ కూర్చుంది ఝాన్సీ.

'సరే అయితే నువ్వు పాడలేదు కాబట్టి నువ్వు దొంగవిట. మేము పరుగెత్తాం. మమ్మల్ని ముట్టుకోవాలి' సుజాత మాటలకి 'ఓ' అంటూ చెంగున కొమ్మమీంచి దూకింది ఝాన్సీ 'ఎప్పుడో చిన్నప్పుడు పరిగెత్తానేమో! అంతే. ఇప్పుడు! పరిగెత్తడమే! కాళ్ళునెప్పెట్టాయంటే 'పరిగెత్తడం వల్ల కాళ్ళు నెప్పెట్టాయి. లీవు గ్రాంటు చెయ్యవల్సిందంటూ రేపొద్దున్న ఆఫీసరుకి విన్నవించుకోవల్సి ఉంటుంది. మీరాడండి. నేను తల్లినిటం. కొచ్చి మీరు నన్ను ముట్టుకోవాలి.' అంటూ కొమ్మ మీద మరింత సర్దుకు కూర్చుంది నిలయ.

సరేనంటూ పరిగెత్తారు మిగిలినవాళ్ళు. చాలాసేపు పరిగెత్తాక సుజాత దొంగయింది. వాళ్ళు తిరిగి చెట్టు దగ్గిరికి వొస్తుండగా, కూడా తెచ్చుకొచ్చిన సంచీలోంచి జంపకానా తీసి కింద పరిచింది నిలయ. వొస్తూనే 'అమ్మ! కాళ్ళు నెప్పులు' అంటూ దానిమీద చతికిలపడింది ఝాన్సీ. అందరూ కూర్చున్నాక పేక తీసి అందరికీ పంచి, మధ్యలో, సంచీలోంచి వేరుసెనగకాయలు, మరో రెండు మూడు రకాల తీపి, కారం సరుకులు తీసి పెట్టింది సుజాత. అవి తింటూ ఆట మొదలెట్టారు. కొంచెం సేపు గడిచిందో లేదో ఒక ముసలి నౌకరు బుట్టలో కొబ్బరి బొండాలు పట్టుకొచ్చి వాళ్ళ దగ్గిర పెట్టాడు. 'ఇవెక్కడివి?' అడిగింది సుజాత.

'అదుగో చినబాబుగారు మీ అందరికీ ఇమ్మన్నారమ్మా!' అంటూ దూరంగా ఒక చెట్టుకింద నిలబడ్డ సుందర్ని చూపించాడతను.

'ఎంతసేపైందో వొచ్చి! మనం పరిగెత్తడం చూశారంటావా మీ అన్నయ్య?' సిగ్గుపడుతూ అడిగింది ఝాన్సీ.

'ఏం చూస్తే?' కళ్ళెగరేసింది సుజాత.

మరి మాట్లాడలేదు ఝాన్సీ. అందరికీ బొండాలు కొట్టిచ్చాడు నౌకరు. అందరూ అవితాగి, లేత కొబ్బరి తిన్నాక తాము తెచ్చుకున్న టిఫిన్లు కొద్దిగా నౌకరికి పెట్టి, మరికొన్ని కాగితంలో పొట్లంకట్టి సుందర్ కిమ్మని నౌకర చేతికి ఇచ్చింది సుజాత. ఆ తర్వాత తోటంతా చాలాసేపు తిరిగారు. సూర్యుడు నెత్తి మాడుస్తుంటే అప్పుడు తిరగడం చాలించి ఇంటి ముఖం పట్టారు. వెళ్ళేటప్పటికి అన్నీ సిద్ధం చేసి వీళ్ళ కోసం ఎదురుచూస్తోంది సుజాత పిన్ని. సుందర్ భోజనం అయిపోయింది అంతకు పదినిమిషాల ముందు.

"అరే! మాకోసం వెయిట్ చెయ్యకుండా నువ్వు ముందు తినేసి కూర్చున్నావా?' అలిగినట్టు నటించింది సుజాత.

'బావే ఉంది. మీ ఆడవాళ్ళతో నన్ను కూడా...' మరి మాట పూర్తి చెయ్యకుండా నవ్వుతూ ఝాన్సీ వైపు చూస్తూ అక్కడి నించి వెళ్ళిపోయాడు సుందర్. కడుపు నిండా తాజా కూరల్తో, కమ్మని నెయ్యి, గడ్డ పెరుగుతో తిని భక్తాయాసంతో లేచారంతా.

"చూశావా సుజాతా! నువ్వేమన్నావ్! మనమెంత మన తిండెంత అన్నావు. కానీ, ఉన్నమాట చెప్తున్నాను నేనివాళ, రోజూ మామూలుగా తినేదానికి రెట్టింపుతిన్నాను. మిగిలినవాళ్ళ సంగతీ అంతే అని నా నమ్మకం' అంది ఝాన్సీ.

చిన్నగా నవ్వింది సుజాత వాళ్ళ పిన్ని. 'ఇది మీరు రోజూ తినేదానికి రెట్టింపా? మా భోజనంలో సగం లేదు.'

'అలా చెప్పు పిన్నీ. అలా చెప్పు. అమ్మాయిగారు మహా ఇదైపోతోంది. ఇంతా తినేసి మీకు ఋణపడి పోయినట్టు' ఝాన్సీని విగతళిచేసింది సుజాత.

'బాబోయ్! కడుపులో చోటు లేదు' అంటున్నా వినకుండా నాలుగ్గంటలకి మళ్ళీ కాఫీ, టిఫిన్లు అందించింది సుజాతా వాళ్ళ పిన్ని. దొడ్లోపూసిన కనకాంబరాలూ, మరువంచేర్చి మాలకట్టి అందరికి తలో దండా ఇచ్చిందావిడ. పెరట్లోకి ఝాన్సీ ఒక్కతే వెళ్ళినప్పుడు నెమ్మదిగా వెనకే వెళ్ళాడు సుందర్. 'మా ఇంట్లో భోజనం చేసి ఏదో ఋణపడి పోయాననుకుంటున్నారా! పోనీ ఋణం ఎలా తీర్చుకోవాలో చెప్పనా.' దగ్గిరగా వొచ్చేస్తున్న సుందర్ని చూసి తడబడింది ఝాన్సీ. సిగ్గు ముంచుకొచ్చింది. ఎదలో ఏవో భావాలు చిందులేశాయి. సిగ్గుతో మందార పువ్వులైన ఝాన్సీ చెంపల్ని మైమరచి చూస్తున్న సుందర్, 'ఝాన్సీ' అంటూ పెరట్లోకి వస్తున్న సుజాతని చూసి చటుక్కున తల వంచుకుని బాల్ రూమ్ వైపు వెళ్ళి పోయాడు. 'వస్తున్నా సుజా!' అంటూ గబగబా ఇంట్లోకి నడిచింది ఝాన్సీ. గడచిన ఆ మధురక్షణాల్ని మనసులో భద్రపరుచుకుంది. ఆనందం ఒకపక్క, ఎందుకో తెలియని భయం మరోపక్క, రెండిటిమధ్యా ఊగిసలాడే మనసుతో ఉండి పోయింది. అందరూ కబుర్లు చెప్పుకుంటుంటే సరదాగా, కాలం తెలియకుండానే గడిచిపోయింది. 'ఇంక మనం బయల్దేరుదాం' అని సుజాత అనడమే తడవు అందరూ చెప్పుల్లో కాళ్ళుదూర్చి సిద్ధమయ్యారు. వీధిలోకి సుజాతా వాళ్ళ బాబయ్‌గారూ, పిన్నీ, సుందర్ వచ్చారు వీడ్కోలు చెప్పడానికి. అందరి తరఫునా వినయ కృతజ్ఞత చెప్పుకుంది వాళ్ళకి. సుందర్ చూపులు ఝాన్సీమీదే ఉన్నాయి అది గమనించిన ఝాన్సీ సిగ్గుతో ఎవరి వైపూ చూడలేక ఎటో చూస్తూ ఉండి పోయింది. కారు స్టార్టవగానే 'పెద్ద నాన్నగారితో చెప్పు సుజాతా నేను రేపో ఎల్లుండో అక్కడికి వస్తానని' అంటూ చెయ్యి ఊపాడు సుందర్. ఆ మాటలు ఝాన్సీ మదిలో వెన్నెల పరిచాయి.

(ఇంకా వుంది)

## 'అమ్మాయిలతో సినిమాలకు వెళ్ళే స్టయిల్‌గా వుంటుంది.'

క్వెశ్చంటర్వ్యూ

'ఫేషన్స్ కాలాన్ని బట్టి మారుతూవుంటే చూడ్డానికి బాగానే వుంటుంది. కాని, ఆడవాళ్ళు మితిమీరిపోకూడదు. ఆడవాళ్ళూ మగాళ్ళలా డ్రస్ చేసుకుంటే ఇంక తేడాఏముంది?' అన్నాడు పి.మురళీకృష్ణ. కేసరీ హైస్కూల్‌లో చదువుకున్నాడు. ఇప్పుడు ప్రయివేటుగా ఎస్.ఎస్.ఎల్.సి.కి కూర్చుంటున్నాడు.

'పరీక్షలు వుండటమే మంచిది. చదివి తీరాలని పిస్తుంది. పరీక్షలు లేకపోతే చదువూ అబ్బదు, టీచర్లమీద భయభక్తులూ వుండవు' అన్నాడు

'స్టూడెంట్స్ తరచుగా స్ట్రయిక్ చేస్తూవుంటారు. టీచర్ కోప్పడినా స్ట్రయిక్ చేసేస్తూ వుంటారు— ఇది మంచిదికాదు!' అని మురళి అభిప్రాయం.

అమ్మాయిలని ఏడ్పించడం, వాళ్ళకి నిక్‌నేమ్స్ పెట్టడం అందరిలాగే మురళికి కూడా సరదా.

'ఒకమ్మాయి రవుండ్‌నెక్ వేసుకుని గొలుసులు, బెల్టులూ కట్టుకుని వస్తుండేదట. ఆ అమ్మాయికి 'కుక్కపిల్ల' అనిపేరు పెట్టాడు మురళి. అంతా ఇతన్ని 'మురడీ'అని పిలుస్తారట!

'అమ్మాయిలతో సినిమాలకు వెళ్తే స్టయిల్‌గానే వుంటుంది'—అనే మురళితెలుగు సినిమాలు ఎక్కువగా చూస్తుంటాడు (సకుటుంబంగా చూడడు!)

నాగేశ్వరరావు కుర్రాడిలా కనిపిస్తాడు. అందుకే అతను ఇంటరెస్టింగ్‌గా కనిపిస్తాడట!


వాణిశ్రీ ఫిగర్ బాగుంటుంది, ఏక్షన్ బాగా చేస్తుంది. అందుకే ఆమె అంటే అభిమానం

హిందీలో శత్రుఘ్నసిన్హా, జయభాదురి అంటే ఇష్టం

ఈ మధ్యన వచ్చిన చిత్రాల్లో శారద బాగా నచ్చిందట.

'మన వయస్సులో సెక్స్‌మాగజైన్స్ చదవకూడదు కాని, క్లాసులో ఆడపిల్లలు చదవడం చూశాను' అన్నాడు సెక్స్ సాహిత్యం మీద అభిప్రాయం అడిగినప్పుడు.

అవకాశం వస్తే ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడట. ప్రేమ అంటే 'ఎఫెక్షన్' అన్నాడు.



పి. మురళీకృష్ణ

పొలిటిక్స్ అంటే ఇష్టంలేదు. కాని, ఆంధ్రోద్యమ సందర్భంగా కొన్నిదారుణ హింసలు కళ్ళారా చూసి ఆవేశంతో ఇక్కడ సత్యాగ్రహంలో పాల్గొన్నాడు.

కథలు రాయడం, టేబుల్ టెన్నిస్ ఆడటం ఇతని సరదాలు.

సైన్సు సబ్జెక్టు తీసుకుందామని, బాగా మార్కులు వస్తే డాక్టర్‌కావాలని, రాకపోతే మామూలుగా ఉద్యోగం (ఏవుద్యోగమైనా సరే) చేసుకోవాలనీ మురళీకృష్ణ ఆశయం.

—సికరాజు.

# ఒక వారం విపరీతం
ఫాలాక్షుడు

## పెళ్ళికొడుకు హత్య

పిల్లంపట్టి గ్రామానికి చెందిన ఫ్రాన్సిస్ అయ్యర్ అనే అతను రామేశ్వరం—పాంబన్ రోడ్డు వేసే పథకానికి ఇంజనీరుగా పని చేస్తున్నాడట. ఆయనకు 10వ తేదీ ఉదయం వివాహం నిశ్చయమయ్యిందట. ముహూర్త కాలానికి ఆయన కనిపించక పోయేసరికి మనిషి కోసం వెతికారట. ఒక రోడ్డు వారగా ఆయన శవం కనిపించిందట. తల భయంకరంగా పగిలి, మెదడు బయటికి వచ్చేసి వుందట. పోలీసు విచారణ మీద అది ప్రమాదం కాదని, కేవలం హత్యేననీ తేలిందట. తొమ్మిదో తేది రాత్రి ఆయన కొంతమంది స్నేహితులతో ఓ స్కూలులో పడుకున్నారని తెలిసి, ఆ స్కూలుకు వెళ్ళి చూస్తే ఒకచోట రక్తం మరకలూ అవీ కనిపించాయట.

## మొట్టమొదటిసారి కోడిగుడ్లు!

ప్రధాని శ్రీమతి గాంధి లండన్ సందర్శించిన సందర్భంలో అక్కడి పాకిస్తానీయులో కొందరు నినాదాలు చేస్తూ ఆమె కారుమీద కోడిగ్రుడ్లను విసిరారట. "ఇంతవరకూ నామీద రాళ్ళుమాత్రమే పడుతూండేవి. కోడిగ్రుడ్లు పడ్డమిదే మొదటిసారి" అని ఆమె అన్నారట. ఇది ప్రమోషనా? ఎగ్స్‌ట్రా క్లాస్సా! ఎస్ప్రాగ్!




## ప్రేమించినవాడిని వివాహం చేసుకోలేని యువతి ఆత్మహత్య

కుందాపూరు అనే వూరికి చెందిన వనిత అనే ఒకామె ఒక యువకుణ్ణి ప్రేమించిందట. అతన్ని వివాహం చేసుకోడానికి కులము, పెద్దలు అడ్డు వచ్చేసరికి విషం త్రాగి మరణించిందట. విషం త్రాగడానికి ముందు పోలీసుల కోసం ఆమె ఒక వుత్తరం రాసి పెట్టుకున్నదట. 'ప్రేమించిన వాడిని వివాహం చేసుకోలేకపోయాను. అతనితో సంబంధం వదులుకోలేను ఒక లోకంలో వ్యభిచారిణి అనే పేరు పొందకుండా వుండాలంటే అతన్ని వివాహమైనా చేసుకోవాలి, లేకపోతే, యీ తనువు చాలించనైనా చాలించాలి. నాకు రెండోదే శరణ్యం నా శవాన్ని కుక్కలు, కాకులు పీక్కు తినే ముందే దయగల వారెవరైనా దహనం చేయండి' అని వుందట.

## హోటల్ గదిలో స్త్రీ ఆత్మహత్య

ఉత్తర బొంబాయికి చెందిన చెంబూరులోని ఓ హోటలులో జూన్ 8వ తేదీన డబ్బు కట్టి రూము తీసుకున్న 39 ఏళ్ళ నిర్మల అనే ఆమె తొమ్మిదో తేదీ తరువాత గదిలోంచి బయటికి రాకపోయేసరికి 11వ తేదీన యీ విషయం ఆ హోటలు యజమానుల పోలీసులకు తెలియజేశారట. వాళ్ళొచ్చి తలుపుల పగలేసి చూస్తే, ఆమె లోపల చనిపోయి వున్నదట నిద్ర మాత్రలు ఎక్కువ వేసుకుని ఆమె ఆత్మహత్య చేసుకున్నట్టు తేలిందట తాను ప్రేమించిన తన పక్కింటి యువకుణ్ణి కలుసుకోడానికి ఆమె ఆ హోటలులో గూము తీసుకుందట. కానీ ఆమె ఆశించిన పద్ధతిలో అతను నడచుకోనందు వల్ల నిర్మల యీ దురంతానికి తలపెట్టిందట.

## దారుణహత్య


13వ తేదీ రాత్రి విశాఖపట్టణంలో 45 ఏళ్ళ ఎర్రప్ప అనే ఒకతనిని మునిసిపల్ స్టేడియం వద్ద ఎవరో దారుణంగా పొడిచి చంపేశారట అతనికి వీపు పైన, గుండెల్లోనూ బాగా గాయాలయ్యాయట ఈ ఎర్రప్ప పోయిన రెండేళ్ళుగా ఓ బర్మా అమ్మాయిని వుంచుకున్నాడట. ఇప్పుడామె జాడ కనబడటం లేదట—దీని భావమేమి!

## గర్భవతని తెలిసిన మూడోరోజు ప్రసవం!

జినోవాలో ఒకావిడ తన కడుపులో ఏదోఅవుతోందని ఆసుపత్రికి వెళ్తే, అక్కడివారామెను పరీక్షించి ఆ కడుపు ఏదో అవడానికి జలోదరం కారణమని, తొమ్మిదినెలలు చికిత్సచేసి, ఆనక ఆమెగర్భవతి అని, తొమ్మిదో నెల దాటిందనీ ప్రకటించారట. వాళ్ళమక్క అన్న మూడేళ్ళూ డోజులకామె ప్రసవించి పండంటి ఆడపిల్లన కన్నదట. తాను గర్భవతిననే విషయమే తెలియక, ఆవిషయం తెలిసిన మూడోనాడు మాతృమూర్తి అయ్యిన స్త్రీ ప్రపంచంలో యీవిడ ఒక్కతేనని ఆవార్త అన్నది

## సినిమా పిచ్చి!

మద్రాసులో 21 ఏళ్ళ రామలింగం అనే ఓ వుత్సాహవంతుడైన యువకుడు సినిమాకెళ్ళడానికి డబ్బులేక, వెళ్ళడం మానలేక, తుదకు రక్తదానం చేసయినా సరే సినిమాకు వెళ్ళాలని తీర్మానించుకుని, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి చేరిపోయాడట. కానీ, అతని బరువు తూచిన డాక్టర్లు నీకేబోల్డు రక్తం కావాలి పొమ్మన్నారట దీనికతనో చక్కని వుపాయం ఆలోచించి, మళ్ళి వెళ్ళాడట ఈసారి అతని బరువు చూసి, ఆశ్చర్యపోయి, తేరుకుని, పరీక్షిస్తే అతను తన నడుముకు కట్టుకున్న ఓ బండరాయి దొరికిందట. అతని సినిమాదిదృక్షకు జాలిపడి, డాక్టర్లుతప్పు క్షమించి, సినాట్లు వేసి పంపారట—బయటకు, సినిమాక్కాద






### పాదపూజానంతరం దేహశుద్ధి!

పక్కలంక గ్రామవాసి నాగేశ్వరరావుగారి కుమారుడు శివానంద భారతి వున్నపూరువాదరిస్వాముల వారివేషంలో ఆయన వెళ్ళి, అవూరుకొనేరుపక్కనున్న స్థలంలోంచి తన మహాత్యం వల్ల వో బంగారు శివలింగం తీయగలనని ప్రకటించాడట. దాంతో జనం ఆనంద అతిశయాలతో ఆతని పాదపూజ చేస్తూ ఆతని ఒక్కొక్క తోడ్పాటునవచ్చారట. భారతి స్వామి కొనేరు పక్కనున్న ఓ జాగాను గబగబ త్రవ్వి వోలింగాన్ని బయటకు తీశాడట ఈవిషయం నమ్మలేని విజ్ఞాన సమితి (మేధావులు) వారు ఆలింగాన్ని పరీక్షిస్తే అది బంగారు పూతపూసిన కర్రలింగమని, అలను కూడా స్వామి వేషంవేసుకున్న పాదామనిషనీ తెలిందట. దాంతో పాదపూజచేసిన ప్రజలు దేవపూజ, సుద్ధిచేశారట "బాబోయ్, ఇది కూటవిద్య" అని ఆతను అన్నాడట.

### సుమిత్ర అజ్ఞాతవాసం

మైసూరు ప్రభుత్వానికి వణుకు పుట్టించి, యాదవ కులంలో నుసలంలా తయారయిన అందాల సుందరి సుమిత్రాదేశాయి వేరెక్కడో లేదని, బెంగళూరులోనే వుందనీ, ప్రతిపక్ష నాయకుడు హెగ్డె మరొక్కసారి అన్నారట. ఆమెకోసం ప్రస్తుతం మైసూరు, ఆంధ్ర, కేరళ తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, పాండిచ్చేరి పోలీసులు వెతుకుతన్నారట బొంబాయిలో ఆమె నివాసంలో మైసూరు రాష్ట్ర పోలీసులకు దొరికిన డైరీలో భగవద్గీతలోని పద్యాలూ అవీ రాసుండడం వల్ల వారు టక్కునామె చిత్తప్రవృత్తిని కనిపెట్టినట్టు ఆమె బహుశా ఆశ్రమాలలో వుండుండి తీరాలని అవన్నీ గాలిస్తున్నారట. "నాకూ, గౌరవనీయులైన మంత్రి కిట్టూరు గారికి ఏ విధమైన సంబంధములేదు నన్ను గురించి వస్తున్న చెడ్డ ప్రచారాలన్నీ నేను వింటున్నాను, చూస్తున్నాను. పోలీసులను కలవ యిష్టంలేదు కనుక నేను అజ్ఞాతంగా వున్నాను" అనటాని సుమిత్రా దేశాయి బొంబాయిలోని ఒకపత్రికకో వుత్తరం రాసిందని ఆ పత్రికవారు ప్రకటించారట కవరు చింపేయడం వల్ల ఆవుత్తరం ఎక్కడనుంచి వచ్చిందో వారు పసికట్ట లేకపోయారుట.

ఇంత రగడ గాకుండా ఆదిలోనే అసలు మంత్రి కిట్టూరుగారిల్లు సోదాచేసి వుండుంటే ఆమె ఆధారాలు కొన్ని దొరికుండుండేవని మైసూరు శాసనసభలో శ్రీ హెగ్డె అన్నారట— ఎవరెన్నన్నా అప్పుడే దొబూచులాట ఆరంభించి నెల దాటింది.

అవీ – ఇవీ . . .


### చిలకలూరిపేటలో 'రతీ మన్మధ' నాటకం

విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రిగారు రచించిన 'రతీమన్మధ' పౌరాణిక నాటకాన్ని జూన్ 9 న చిలకలూరి పేట యస్. ఆర్. క్లబ్ ఆవరణలో శ్రీ లలిత కళామండలి (మదరాసు) వారు ప్రదర్శించారు ప్రదర్శనానంతరం రచయితకి సన్మానం జరిగింది — (ఓ. వి.)

### జీవితభీమాసంస ఉద్యోగుల (లలితకళల) సంఘ వార్షికోత్సవాలు

జీవిత బీమా సంస్థ ఉద్యోగుల లలిత కళల సంఘం 15వ వార్షికోత్సవాలు జూన్ 1 నుండి 24 వరకు బందరు హిందూ కళాశాల ఆడిటోరియంలో అత్యంత వైభవంగా జరిగాయి. —(ఓ. వి.)





# పుస్తకాలు

## సిన్నమ్మ వొచ్చింది

రచన: రంధి సోమరాజు. వెల మూడు రూపాయలు. శశిధర పబ్లికేషన్స్: 44—13—43, అన్నపూర్ణపేట, రాజమండ్రి—3.

పొద్దు, బూర్జువా పెళ్లికూతురు, ఎదగండి, విరిగిన కల్చర్ కవితా సంపుటాలతో తెలుగు కవి కులంలో ఒక ప్రత్యేక స్థానాన్ని మలచుకొన్న శ్రీ రంధి సోమరాజుగారు ఇప్పుడు వచన కథాకావ్యం 'సిన్నమ్మ వచ్చింది'తో తెలుగు పాఠకుల ముందుకు వచ్చేరు.

రచనా వైఖరిలో దీనిలో శ్రీ సోమరాజుగారు ఇంతక్రితం కన్న భిన్నత్వం చూపేరు కథాకథనంలో శిష్టవ్యావహారికాన్నీ. రిక్షా శివుడూ, వాళ్ల గూడెం ప్రజల మాటల్లో విశాఖయాసనూ ఉపయోగించేరు.

అమరావతి దీనిలోని ప్రధాన పాత్ర. సమాజంలో కొట్టొచ్చినట్లు కనిపించే కొద్దిమంది సంపన్నత, జనబాహుళ్యం దీనహీనస్థితీ చూసి ఆమె కదిలి పోతుంది. భిన్న సంస్కారాలు, ఆర్థిక హోదాలు గణించకుండా పెళ్ళిళ్లు చేసేస్తే ఈ అవ్యవస్థ మార్చవచ్చుననుకొంటుందో మారు. మరో మారు సంఘాన్నంతనీ నుంటబెట్టి బుల్డోజరుతో దున్నేస్తే తప్ప లాభం లేదనుకుంటుంది. చివరకు పేటల్లో కెళ్లి వాళ్ల సేవ చేయడం ఒక్కటే మార్గం అని నిశ్చయించుకొని ఒక బీదల పేటలో మకాం పెడుతుంది.

అయితే సంఘంలో పెత్తనంకోసం తగువులాడుకుంటూ సిబ్బందిని కూర్చుకొనివున్న కుల తత్వవాదుల కామె పేట మకాం ఆటంకమయింది. వాళ్ళు పంపిన రవుడీ లామెను గుడిసెలో పెట్టి అంటించేసేరు. తన మరణ కారకులను అమరావతి క్షమించి, వారిని కొట్టవద్దని ప్రజలకు నీతిబోధ చేసి ప్రాణం వదిలింది. ఆమె మంచితనం చూసి

"అమ్మా అమ్మా అంటూ దుండగులు
అమరావతి కాళ్లపై పడిపోయేరు"

ఇదీకథ.

మధ్య తరగతి యువతలోని మానవతాస్ఫూర్తిని, పాతను సహించలేని వ్యగ్రతను, నూతన ప్రపంచం గురించిన కలలను, వ్యక్తి నిష్ఠ సేవాపరాయణతను, ప్రాణాల్ని నిశ్శంకంగా బలి పెట్టగల త్యాగశీలతను శ్రీ సోమరాజుగారు చక్కని పద చిత్రాలలో తెచ్చేరు.

పక్కపక్కనే అమరావతి మురికిపేటలు చూడాలనుకోవడమే వర్గ సిద్ధాంతాన్ని పరాస్తం చేస్తుందనుకోడమూ, విప్లవం అంటే దుడుకుతనం, హింస అనుకోడమూ కనిపిస్తుంది.

ధనికుడు మురికిపేటలో మకాం పెట్టడం 'డీక్లాస్' కావడం కాదు. వర్గ సిద్ధాంతం అబద్ధమనీ కాదు. విప్లవం అంటే హింస, అహింసల ఎన్నిక కాదు లది కేవలం ఆనుషంగికం.

శ్రీ సోమరాజుగారు సమాజంలో వున్నాయని గుర్తించిన అంతరాలెల్లా వచ్చేయో చూపేది వర్గ సిద్ధాంతం. అది వైయక్తికం కాదు. సమాజగతం. కనక దానిని వ్యక్తి సౌజన్యం పరిష్కరించలేదు. సామాజిక చైతన్యం కావాలి సమాజ నిర్మాణంలో వేళ్లూనికొనివున్న వర్గ వ్యవస్థను మార్చాలంటే ప్రజానీకాన్ని చైతన్యవంతం, నిర్మాణయుతం చెయ్యాలి. విప్లవం అదేది అప్పుడు వస్తుంది. ఆ మార్పును తేవడం విప్లవం లక్ష్యం.

ఈ రెంటినీ కూడ నిరాకరిస్తున్నారు, శ్రీ సోమరాజుగారు. మధ్య తరగతి, క్రియాశూన్య, కేవల సంస్కరణోత్సాహంతో వ్రాసిన కావ్యం 'సిన్నమ్మ వచ్చింది.'

—అవంతి

## కళాసాగర్ వార్షికోత్సవ సంచిక

మద్రాసులో ఈమధ్య చాలా కళాసంస్థలువెలిశాయి. పోటాపోటీలుగా ప్రోగ్రాంలు ఏర్పరుస్తూ ఆంధ్రదేశానికి దూరమై పోతున్నామేమో అనుకొంటున్న తెలుగువారికి కన్నుల పండుగ చేస్తున్నారు. ఈ సంస్థల్లో కళాసాగర్ ఒకటి.

కళాసాగర్ ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా ఒక మంచి సవనీర్‌ని ముద్రించారు. బాపూ బొమ్మని అట్టమీద వేసుకున్న ఈ సవనీర్ సర్వాంగ సుందరంగా వుంది.

ప్రముఖులు కథలు, గేయాలు,వ్యాసాలు ఒకటేమిటి— అన్నీ కళాసాగర్ కార్యక్రమాల్లాగా అందమైన గెటప్‌తో ఆకర్షణీయంగా వున్నాయి. సవనీర్‌ని ఏదృష్టితో ప్రచురించినా కళాత్మకంగా కూడా వుండడం అవసరమని ఈ సంచిక చూసిన తర్వాత అనిపిస్తుంది.

—సికరాజు

# గ్రంథస్వీకారం

## శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం

తాత్పర్య సహితం. వెల 50 పైసలు. ప్రచురణ హిందూ ధర్మ ప్రచారిణి— రాజమండ్రి—1

## శ్రీ వెంకటేశ్వర స్తోత్ర పద్య మణి మంజరి

రచన జవులి శ్రీ వెంకటేశ్వర్లు, పది పుట్టబయలు, వెల రూపాయి,

## శ్రీ జయాంధ్ర శతకము

ప్రత్యేకాంధ్ర మహోద్యమ లఘు కావ్యము. కృతి కర్త: కాసారపు తాతారావు, ఎసెస్ ఏ. వి. ఎన్. కళాశాల విశాఖపట్టణం—1.

## స్వామీజీ

నాటకం. ఒకే సెట్టు, రెండు రంగాలు. రచన రావర్ల వెంకటేశ్వర్లు. ఆంధ్ర రత్నబుక్ డిపో, తెనాలి. వెల మూడు రూపాయలు.

## వినగదప్ప వెఱ్ఱి వెంగళప్ప!

పట్నాతి. రచయిత సల్లా రామ కోటయ్య వెల 3 రూపాయిలు ప్రతులకు —విజయా ప్రెస్ వరంగల్—2.

## పాలిష్ భయ్యా

పిల్లల నాటికలు రచన జె పూర్ణచంద్రరావు. వెల 2 రూపాయలు, ఆనందశాల ప్రచురణలు, గుంటూరు—4.

## శృంగార మాధవం

కవిత. రచన. కె. భాగ్యలక్ష్మి. వెల 2 రూపాయలు. వరశ్రీ కావ్యమాల, నేతాజీవీధి, నరసన్నపేట, శ్రీకాకుళం జిల్లా.

## శ్రీ సుందర మందారము

కల్యాణ వెంకటేశ్వర అష్టోత్తర శతనామావళి. నండూరి పాల శంకరము, తణుకు.

## కాలంమారింది

సాంఘిక నాటకం. రచన గరికి పాటి. 4 రూపాయలు. ఆంధ్ర రత్న బుక్ డిపో,* తెనాలి.

## కృషీవలుడు

నాటకం రచన, బొల్లే పల్లి కేరాఫ్ సౌభాగ్య ప్రింటింగ్ ప్రెస్, న్యూ బస్ స్టాండ్, నల్గొండ.

## స్తుతిమంజరి

జ్ఞాతవ్యాంశ్యవిశిష్ట. సంధాత—ద్విభాష్యం వెంకట సూర్యనారాయణ మూర్తి. అమూల్యం. ప్రతులకు రచయిత పేర చింతలూరు, తూ. గో. జిల్లా.

## ఫినిక్స్ బుక్స్

యులిసిస్ కవితా సంపుటి, రచన ఎమ్వీయల్. వెల రూపాయి. సహోదయా పబ్లిషర్స్, విజయవాడ—2.

## బహిరంగలేఖ

భారత ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీకిబహిరంగ లేఖ. రచన యన్. విజయ్ రాజ కుమార్. రూపాయిన్నర, నవ్యాంధ ప్రచురణలు, కేరాఫ్ ఆంధ్ర మిత్ర ప్రింటింగ్ ప్రెస్, రాజాగారితోట, గుంటూరు—1.


## శ్రీ శివలెంక శంభుప్రసాద్ స్మృతి-2

సంధాన కర్త, ప్రకటన కర్త, కోగంటి దుర్గా మల్లి కార్జున కవి. భారతీ సమితి, పామర్రు. వెల 75 పైసలు. ●

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1 and at Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada 3.
Editor : S. Radhakrishna.



''అపోర్ట్ అదా''లో రేఖా



శాలోఫెన్
బాధానివారిణి మాత్రలు
అమృతాంజన్ లిమిటెడ్ వారి తయారింపు
తలనొప్పి, ఫ్లూ, పంటినొప్పి,
ఒళ్లునొప్పులని
వెంటనే పోగొడ్తాయి
శాలోఫెన్‌లోని ఔషధాలు
డాక్టర్లు సిఫార్సు చేసేవే.
శాలోఫెన్ ఉన్నచోట
బాధ ఉండదు.
SALOFEN
ANALGESIC TABLETS
SALOFEN